




# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam and ongole | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 218 | విజయవాడ, మంగళవారం 8 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00







## 11 లక్షల పాన్ కార్డులు రద్దు



**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా పెద్దసంఖ్యలో పాన్‌కార్డులను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసింది. ఆదాయపన్ను శాఖాధికారులు కొంత కాలంగా దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాజా నివేదికల ప్రకారం జులై 27 నాటికి దేశ వ్యాప్తంగా 11,44,211 నకిలీ పాన్ కార్డులను రద్దు చేసినట్టుగా సమాచారం. అలాగే ఈ నెలాఖరు నాటికి ఆధార్‌తో లింక్ కానీ పాన్ కార్డులు రద్దు కానున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులు తమ పాన్ నెంబర్ పని చేస్తోందో లేదో తెలుసుకోవడానికి ఆదాయపు పన్ను శాఖ పలు సూచనలు ఇచ్చింది.
1 ఆదాయం పన్ను ఈఫైలింగ్ పోర్టల్ సందర్శించవచ్చు.
2 ఇందులోని హోమ్ పేజీలో 'సర్వీసులు' అనే టాబ్ కింద మిగతా 9లో

## ఫ్రిజ్, బైక్ ఉంటే 'సంక్షేమం' కట్



**న్యూఢిల్లీ:** పట్టణ ప్రాంతాల్లో ఉన్న మీకు ఫ్రిజ్, ద్విచక్ర వాహనం ఉన్నాయా...? అయితే మీరు సంక్షేమ కార్యక్రమాలకు అర్హులు కారంటూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ప్రభుత్వం నియమించిన దేబ్రాయ్ కమిటీ ఈ మేరకు కేంద్రానికి నివేదిక అందజేసింది. నాలుగు గదుల ఇల్లున్నా, కారు, ఎయిర్ కండీషనర్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, ద్విచక్ర వాహనం ఉంటే సంక్షేమ పథకాలకు అనర్హులంటూ బిబేక్ దేబ్రాయ్ కమిటీ సిఫార్సు చేసింది. ఇవి మిగతా 9లో

# పునరావాసంపై సమీక్ష

## పురుషోత్తపట్నంపై సిఎం చంద్రబాబు

- మూడేళ్లలో 28 ప్రాజెక్టులు పూర్తి
- వరల్డ్ టాప్-10లో ఐకాన్ బ్రిడ్జి
- ప్రాజెక్టు మొత్తం కనిపించేలా పైలాన్
- 15న పురుషోత్తపట్నం ప్రారంభం
- పోలవరం, పురుషోత్తపట్నంలో సిఎం చంద్రబాబు నాయుడు



చంద్రబాబుకు రాఖీ కడుతున్న మంత్రి సునీత వార్త 3లో

**ప్రజాశక్తి-ఏలూరు, రాజమహేంద్రవరం ప్రతినిధులు**

పురుషోత్తపట్నం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసంపై త్వరలో సమీక్ష నిర్వహిస్తామని, పోలవరం ప్రాజెక్టు మాదిరిగానే పురుషోత్తపట్నం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూమికి భూమి, పరిహారం చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పురుషోత్తపట్నం, పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలో ఆయన సోమవారం పర్యటించారు. జోరువానలోనే సిఎం తన పర్యటనను కొనసాగించారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే పనులను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కొండపైన ఉన్న గెస్ట్‌హౌస్‌లో అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా నిర్మించాల్సిన గృహనిర్మాణ కాలనీలను 2018 మే నెలాఖరుకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్వాసితులకు అందిస్తున్న ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ భూమికి భూమి, పరిహారం వంటి వివరాలను, ఆధార్, రేషన్‌కార్డుతో అనుసంధానం చేయాలని తెలిపారు. ప్రతి ఇంటికీ జియోట్యాగింగ్ చేయాలన్నారు. గిరిజనులకు 12 కాలనీలు, గిరిజనేతరులకు ఒక కాలనీ నిర్మించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం వెయ్యి కోట్లు కావాలని కలెక్టర్ కాటంనేని భాస్కర్ సిఎంను కోరారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ రూ.850 కోట్లు కావాలని అడిగారన్నారు. నిర్వాసితులకు ఒక్కొక్కరికీ రూ.2.80 లక్షలతో ఇళ్లు నిర్మించాలన్నారు. ప్రపంచంలోనే టాప్-10లో ఉండే విధంగా పోలవరంలో ఐకాన్ బ్రిడ్జి నిర్మించాలని, ప్రాజెక్టు ప్రాంతం మొత్తం కనిపించేలా పైలాన్ నిర్మించాలని అన్నారు. శ్రీకాకుళం నుంచి కర్నూలు వరకు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 28 ప్రాథమిక మిగతా 9లో

## దేవరపల్లి భూములు దళితులకే

- మంత్రి నక్కా ఆనంద్‌బాబు ప్రకటన
- సిపిఎం భూ పోరాటానికి విజయం



దేవరపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి నక్కా ఆనంద్‌బాబు

**ప్రజాశక్తి-ఒంగోలు ప్రతినిధి**

సిపిఎం నేతృత్వంలో దేవరపల్లి దళితులు రెండు నెలలుగా సాగిస్తున్న భూపోరాటం విజయవంతమైంది. 'మీ భూములు మీకు అప్పగిస్తున్నాం. మీరే సాగుచేసుకోవచ్చు. ఎలాంటి అభ్యంతరం లేదు. త్వరలోనే భూములను చదును చేస్తాం' అని మంత్రి నక్కా ఆనంద్‌బాబు ప్రకటించారు. సోమవారం ఆనంద్‌బాబు, ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు దేవరపల్లి దళితవాడకు చేరుకుని ఈ ప్రకటన చేశారు. గతంలో చెరువులు తవ్విన వీరన్నకుంట, సూరాయకుంటలో భూములు కోల్పోయిన దళితులకూ ప్రత్యామ్నాయంగా వేరేచోట భూములు అందజేస్తామని మంత్రి చెప్పారు. దేవరపల్లిలో దళితులు తమ భూముల మిగతా 9లో

## రూ.4 వేల కోట్లతో పాఠశాలలకు మౌలిక వసతులు

### కొత్త విధానంలో టెండర్లకు ఆహ్వానం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4,848 కోట్లు కేటాయించింది. హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హెచ్‌ఎఎం) విధానంలో ఈ టెండర్లను ప్రభుత్వం పిలుస్తోంది. మొత్తం టెండరు విలువలోని 40 శాతం నగదును మొదటి చెల్లించి, మిగిలిన దాన్ని అయిదేళ్లలోపు చెల్లించొచ్చు. ఇప్పటివరకు ఈ విధానాన్ని జాతీయ రహదారుల నిర్మాణానికి అమలు చేశారు. తాజా పాఠశాలలకు మౌలిక వసతుల కల్పన కోసం ఈ విధానంలో టెండర్లు పిలుస్తూ పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. సర్వ శిక్షా అభియాన్ సమర్పించిన ప్రతిపాదనల మేరకు పాఠశాలకు ప్రహరీలు, ఫర్నిచర్, బయో ఫెన్సింగ్, అదనపు తరగతులు, గ్రంథాలయ గదులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలకు రూ.4,848 కోట్లు (ఈ అంచనా వ్యయం వడ్డీరేటుతో కలిపి) హెచ్‌ఎఎం పద్ధతిలో టెండర్లు ఆహ్వానించారు. ఈ మౌలిక వసతులు కల్పన పనులు 24 నెలల్లో పూర్తి కావాలి. ఈ నిధులను 2017-18 నుంచి 2024-2025 వరకు ప్రభుత్వం విడుదల చేస్తుంది. 40 శాతం నిధులను మూడేళ్లల్లో రూ.550 కోట్లు చొప్పున రూ.1,650 కోట్లు విడుదల చేయాల్సివుంటుంది. మిగిలిన రూ.31,98 కోట్లు (60శాతం) 2020-21 నుంచి 2024-25 వరకు బ్యాంకు వడ్డీ రేటుతో చెల్లించాల్సి ఉంటుంది.

# వాస్తవాల దర్పణం 'ప్రజాశక్తి'

### అనంతపురం ఎడిషన్ ప్రారంభోత్సవ సభలో మంత్రి కాలవ శ్రీనివాసులు

**ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి**

బలవంతులు, దుర్మార్గుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ధైర్యంగా వాస్తవాలను వెల్లడించే పత్రిక 'ప్రజాశక్తి' అని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు కొనియాడారు. సోమవారం సాయంత్రం అనంతపురం నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎడిషన్ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రింటింగ్ మిషన్‌ను ప్రారంభించారు. సిటిపిని జిల్లా కలెక్టరు జి.వీరపాండియన్, పరిపాలన విభాగాన్ని జిల్లా ఎస్‌పి జివిజి.అశోక్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఎడిషన్ మేనేజరు ఎన్.వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఒక అంశంపైనా పూర్తి స్థాయిలో లోతైన విశ్లేషణ, అవగాహన చేసుకోవాలంటే 'ప్రజాశక్తి' వంటి పత్రికలు చదవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మూల సిద్ధాంతాలకు కట్టుబడే నూతనంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకెళ్లే ప్రయత్నం చేయడాన్ని ఆయన అభినందించారు. ఈ పత్రికకు ప్రభుత్వం తరపున తమవంతు తోడ్పాటును అందిస్తామని హామీనిచ్చారు. జిల్లా కలెక్టరు జి.వీరపాండియన్ మాట్లాడుతూ సమాజంలో పత్రికల పాత్ర చాలా కీలకమన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలాగా పత్రికలు పనిచేస్తున్నాయని తెలిపారు. జిల్లా ఎస్పీ జివిజి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ తమ దృష్టికి రాని అంశాలను కూడా పత్రికల ద్వారా తెలుసుకుంటున్నామని మిగతా 9లో



ప్రజాశక్తి ఎడిషన్ ప్రింటింగు మిషన్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న మంత్రి కాలవ శ్రీనివాసులు

## నంద్యాల నామినేషన్ల ప్రక్రియలో ఉత్కంఠ

- ఆమోదించిన ఎన్నికల కమిషన్
- టిడిపి, వైసిపి అభ్యంతరాలను తోసిపుచ్చిన ఈసి

2






## కేరళలో హింసకు బిజెపి కుట్ర

- అవినీతి అభియోగాల నుంచి దృష్టి మళ్లించేందుకే
- కేరళ సిఎం పినరయి విజయన్

**బెంగళూరు :** వారి నేతలపై వచ్చిన అభియోగాల నుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకే బిజెపి, ఆరెస్సెస్‌లు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో హింసను ప్రేరేపిస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి తమకు సమాచారం అందిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం తెలిపారు. గత నెలలో రాష్ట్ర బిజెపి శాఖ పలు అవినీతి అభియోగాలను ఎదుర్కొందని ఆయన చెప్పారు. బిజెపిపై వచ్చిన అవినీతి అభియోగాలపై సిబిఐ దర్యాప్తు జరిపించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూడా సిబిఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసిందన్నారు. రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి ఎం.టి. రమేష్, కో ఆపరేటివ్ సెల్ కన్వీనర్ ఆర్.ఎస్. వినోద్‌లపై అవినీతి అభియోగాలున్నాయి. రాష్ట్రంలోని రెండు ప్రైవేటు కళాశాలలకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) గుర్తింపు ఇప్పించేందుకు వారు రూ.5.6 కోట్లు లంచం తీసుకున్నట్లు బిజెపి నిర్వహించిన అంతర్గత దర్యాప్తు నివేదిక వెల్లడించిందని విజయన్ పేర్కొన్నారు. ఈ నివేదిక వివరాలను పత్రికలు వెల్లడించడంతో వారిని బిజెపి నుండి సస్పెండ్ చేశారని చెప్పారు. కేరళలో సిపిఎం, బిజెపిల మధ్య దశాబ్దాల కాలంగా సిద్ధాంతపరమైన వైరుధ్యాలు కొనసాగుతున్నాయని, పలు మార్లు హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. 2016లో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇటువంటి సంఘటనలు మరింతగా పెచ్చు మీరాయనిఅసెంబ్లీ సమావేశాల తొలి రోజునే వెల్లడైన ప్రభుత్వ నివేదిక పేర్కొంది.



### సిపిఎంపై నిందలు వేయమని చిత్రహింసలు పెట్టారు

- ఆరెస్సెస్ నిర్వాకాన్ని వివరించిన ఆ సంస్థ కార్యకర్త

**కన్నూర్:** రాష్ట్రంలో జరుగుతున్న హత్యలకు, హింసాకాండకు సిపిఎం కారణమని చెప్పాలంటూ తనను శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురి చేశారని కేరళలోని కన్నూర్ జిల్లాకు చెందిన ఆరెస్సెస్ కార్యకర్త ఒకరు వివరించారు. ఆత్మహత్యకు విఫల ప్రయత్నం చేసి ఆస్పత్రి పాలయిన ఆ కార్యకర్త విష్ణును ఇటీవల సిపిఎం జిల్లా కార్యదర్శి పి జయరాజన్, మిగతా 9లో

## నిర్బంధకాండ వీడండి

- వంశధార నిర్వాసిత ప్రాంతాల్లో పోలీసులను ఉపసంహరించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

2



## అభివృద్ధి పేరుతో కాలుష్యం

- ప్రజలకు ప్రశ్నించే హక్కుండాలి
- పర్యావరణ శాస్త్రవేత్త సునీత నారాయిన్

2

## సిసిటివి ఫుటేజ్ లేదు

### హర్యానా వేధింపుల కేసులో పోలీసులు

**న్యూఢిల్లీ :** ఛండీగఢ్‌లో అర్ధరాత్రి వేధింపులకు గురైన ఐఎఎస్ అధికారి కుమార్తె డిజె వర్ణిక కుందు ఘటనకు సంబంధించి సిసిటివి ఫుటేజ్‌లు లభ్యం కాలేదని ఛండీగఢ్ పోలీసులు సోమవారం తెలిపారు. వర్ణిక కుందు వేధింపులకు గురైన మార్గంలోని 9 సిసిటివి కెమెరాల నుంచి ఫుటేజ్‌లు సేకరించేందుకు ప్రయత్నించామని డిఎస్‌పి సతీష్ కుమార్ మీడియాకు తెలిపారు. అయితే ఆ కెమెరాలు పనిచేయని స్థితిలో ఉన్నాయన్నారు. బాగా పేరున్న ఆ ప్రాంతంలో సిసిటివి కెమెరాలు పనిచేయక పోవడం ఆశ్చర్యంగా ఉందని, ఇది కప్పి పుచ్చుకునే ప్రయత్నంలా కనిపిస్తోందని పోలీసు అధికారి ఒకరు పత్రికలకు తెలిపారు.

**బిజెపిపై దాడికి దిగిన శివసేన, ప్రతిపక్షాలు**

ఈ సంఘటనపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్న నేపథ్యంలో శివ సేనతో పాటు ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. మహిళలకు పలు పథకాలు ప్రవేశపెడుతున్నామని, వారిని గౌరవిస్తున్నామని ఒక వైపు గొప్పలు చెప్పుకుంటూనే, మరో వైపు బిజెపి నేత కుమారుడు మహిళలను వేధింపులకు గురిచేయడం చాలా ఇబ్బందికరమైన పరిస్థితి అని శివసేన నేత మనీష్ కయాండే వ్యాఖ్యానించారు. ఈ సంఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ బరాలా మిగతా 8లో

## వాళ్లే సిగ్గు పడాలి!

- బాధితురాలు వర్ణిక



**ఛండీగఢ్ :** తనను వేధింపులకు గురిచేసిన హర్యానా బిజెపి అధ్యక్షుడు సుభాష్ బరాలా కుమారుడు వికాస్ బరాలా, అతన్ని స్నేహితుడు అశీష్‌లకు శిక్ష పడేంత వరకు పోరాడతానని, బాధితురాలు, ఐఎఎస్ అధికారి కుమార్తె వర్ణిక తెలిపింది. తాను మీడియాకు దూరంగా లేనని, తనకు దాక్కోవలసిన అవసరం లేదని,తనను మిగతా 8లో

## ప్రజ్ఞ

1. ఒలింపిక్స్‌లో ఉసేన్ బోల్ట్ ఎన్ని స్వర్ణాలు గెలిచాడు?
2. ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు నుంచి భారత ఎంత రుణం తీసుకోవడానికి సంతకం చేసింది?
3. నీతి అయోగ్ నూతన వైస్ ఛైర్మన్ ఎవరు?
4. 'ఏషియన్ షూట్ గన్ ఛాంపియన్ షిప్'లో స్వర్ణం కైవశం చేసుకున్న క్రీడాకారుడు ఎవరు?
5. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ నూతన ఛైర్మన్ ఎవరు?

సమాధానాలు 7లో

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## వాతావరణం



### రాష్ట్రంలో వర్షాలు

**ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి**

రాష్ట్రంలోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల ప్రభావంతో మంగళవారం నుంచి వర్షాలు పడే అవకాశాలున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నైరుతి పవనాలు జార్ఖండ్ వైపు వెళ్తుండటంతో ఆ ప్రభావం మన రాష్ట్రంపై ఉంటుందని తెలిపారు. అన్ని చోట్లా ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో ఉన్నాయని వివరించారు.

# నిర్బంధకాండ వీడండి

- వంశధార నిర్వాసిత ప్రాంతాల్లో పోలీసులను ఉపసంహరించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు



**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో నిర్బంధకాండ పెరుగుతోందని, పోలీసులను ఉపయోగించి ప్రజలను, ముఖ్యంగా ప్రాజెక్టుల నిర్వాసితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ నిరసన వ్యక్తం చేస్తే అక్కడ పోలీసులను వందల సంఖ్యలో మోహరింపజేసి, ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని ఆయన విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. వంశధార ప్రాజెక్టు నిర్వాసితులపై ఉక్కుపాదం మోపేందుకు ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లోని పోలీసులను, అధికారులను మోహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. సర్వస్వం కోల్పోతున్న వారితో చర్చించి వారి అంగీకారం అనంతరం ప్రాజెక్టు చేపట్టాల్సింది పోయి, నిర్బంధం ప్రయోగించడం ఏ మాత్రమూ సరికాదన్నారు. వంశధార ప్రాంతంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలకు చెందిన 20 మంది డిఎస్‌పి, 780 మంది సిఐలు, 150 మంది ఎస్‌లతో సహా రెండు వేల మంది పోలీసులను మోహరింపజేయడం రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధానికి నిలువుటద్దమని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టు వ్యయాన్ని ఎప్పటి కప్పుడు పెంచుతూ కాంట్రాక్టర్లకు అదనంగా డబ్బు చెల్లిస్తున్న ప్రభుత్వం. ఆ ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోయి, నిర్వాసితులవుతున్న వారికి మాత్రం 12 సంవత్సరాల క్రితం నిర్ణయించిన పరిహారాన్నే చెల్లిస్తామనడం ప్రభుత్వ పక్షపాత ధోరణికి నిదర్శనమని ధ్వజమెత్తారు. నిర్వాసితులకు అన్ని పరిహారాలు చెల్లించిన తరువాతే ప్రాజెక్టు పనులను చేపట్టాలనే నిబంధనను ప్రభుత్వం పట్టించు కోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంటరి మహిళలు, వితంతువులు, మేజర్లయిన యువతీ, యువకులకు ప్యాకేజీ చెల్లించే విషయంలో ప్రభుత్వ అమానుషంగా వ్యవహరిస్తోందన్నారు. కడప జిల్లా గండికోటలో పరిహారం చెల్లించకుండా గ్రామాల్లోకి నీళ్లొదిలి ప్రజలను అక్కడి నుండి తరమేశారని, అదే పద్ధతిలో తమనూ తరిమేస్తారని వంశధార నిర్వాసితులూ భయపడు తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా విజ్ఞతగా వ్యవహరించి పోలీసు బలగాలను ఉపసంహరించుకుని, నిర్వాసితులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలా కాకుండా పోలీసులను ప్రయోగిస్తే రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతులు, ఇతర ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు నిర్వాసితులకు అండగా నిలిచి చలో శ్రీకాకుళం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో అక్రమంగా చేపల చెరువుల తవ్వకాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామం పక్కనే చెరువు వద్దన్నందుకు కృష్ణా జిల్లా దొండపాడులో అగ్రకుల పెత్తందారులు దళితులపై దాడిచేసి తీవ్రంగా కొట్టారని, వారికి విజయవాడలో చికిత్స అందిస్తున్నారని తెలిపారు. గతంలో యూనివర్సిటీ ప్రొఫెసర్లతో కూడిన బృందం రాష్ట్రంలో చేపల చెరువు వల్ల కాలుష్యం ఏర్పడుతోందని తెలిపినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

**ఎన్నికల్లో నియమావళి పాటించాలి**

నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రభుత్వం నియామవళిని ఉల్లంఘించినట్లు కనిపిస్తోందని మధు తెలిపారు. ఎన్నికలు ప్రకటించిన తరువాత నిధులు ఇస్తామని హామీలు గుప్పించడం. మంత్రివర్గమంతా అక్కడే ఉండాన్ని ఆయన తప్పుపట్టారు. ఎవరైనా ఇబ్బందులు ఎదురైతే పద్ధతి ప్రకారం ప్రతిఘటించాలేగాని, వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని మధు అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మైనింగ్ మాఫియాను మంత్రివర్గం ప్రోత్సహిస్తోందనే అనుమానాలున్నాయని, బెల్టు షాపులు రద్దు చేశామని చెప్పుకుంటున్నా, అవి నేటికీ ఎక్కక పడితే అక్కడే ఉన్నాయని, చివరకు చిల్లర దుకాణాల్లోనూ మద్యం దొరుకుతోందని చెప్పారు.

## ఆహార భద్రత చట్టాన్ని సమర్థవంతంగా అమలు

- గుంటూరు నుంచే శ్రీకారం
- ఎపి ఆహార కమిషన్ ఛైర్మన్ పుష్పరాజ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఆహార భద్రత చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని ఎపి ఆహార కమిషన్ ఛైర్మన్ జెఆర్ పుష్పరాజ్ అన్నారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం ఆయన ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు కమిషన్ సభ్యులుగా విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, వెంకట్రావు, కృష్ణమ్మ, స్వర్ణగీత బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ ఆహార భద్రత చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు పనిచేస్తామన్నారు. రాష్ట్రంలో 1.42కోట్ల రేషన్‌కార్డులకు సరుకుల్ని పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాల వల్ల మాతా శిశు మరణాలు తగ్గాయన్నారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో కమిషన్ పనిచేయాల్సి ఉందన్నారు. ఎపి ఆహార కమిషన్‌ను దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఆహార కల్తీపై చర్యల్ని గుంటూరు జిల్లా నుంచే ప్రారంభిస్తామన్నారు. పౌరసరఫరాల శాఖా మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న ఆహార కమిషన్ ఛైర్మన్ స్థానాన్ని పుష్పరాజ్ ద్వారా భర్తీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి పరిటాల సునీత, పౌరసరఫరాల శాఖ కమిషనర్ బి రాజశేఖర్, వినుకొండ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అరాచకాలంటేనే జగన్

- ఎక్సైజ్ మంత్రి జవహర్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రతిపక్షనేత జగన్ అరాచకాలకు పెట్టింది పేరని ఎక్సైజ్ శాఖా మంత్రి కె శామ్యూల్ జవహర్ విమర్శించారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నంద్యాలలో టిడిపి భారీ మెజార్టీతో గెలుస్తుందని, నంద్యాల అభివృద్ధికి చిరునామాగా మారుతుందని తెలిపారు. జగన్ అధికారం లేకుండానే తన ఫ్యాక్షన్ నైజాన్ని చూపి ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తున్నారన్నారు. మరోపక్క శిల్పా మోహన్ రెడ్డి కులాలకు కించపరుస్తున్నారని, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. జగన్‌కు ఇప్పటికే ఓటమి భయం మొదలైందని, శిల్పా సోదరులు పార్టీలు మారడంలో బ్రాండ్ అంబాసిడర్లుగా గుర్తింపు తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు అభివృద్ధి పనులు చూసేందుకు నంద్యాలకు వెళ్తున్నారని, రాజకీయం చేయడానికి కాదని వివరణ ఇచ్చారు.

## రాజ్యసభ ఛైర్మన్‌గా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తా

- సుందరయ్య నిరాడంబరత నాకెంతో ఇష్టం
- వెంకయ్య నాయుడు

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ/నెల్లూరు**

రాజ్యసభ ఛైర్మన్‌గా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తా. రాజకీయాల్లో తనకు ఎవరూ శత్రువులు లేరు. అంతా ప్రత్యర్థులే. కమ్యూనిస్టు సిద్ధాంతాలు నాకు నచ్చనప్పటికీ.. ఎంతో నిరాడంబరమైన జీవితాన్ని కొనసాగించి, సైకిల్‌పై పార్లమెంటుకు వచ్చిన సుందరయ్య అంటే నాకెంతో ఇష్టం. ఆయనతో కలిసి అసెంబ్లీలో ఐదేళ్లు పనిచేసే భాగ్యం కలిగింది' అని ఇటీవల ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన ఎం.వెంకయ్య నాయుడు గుర్తు చేసుకున్నారు. ఆయన స్వంత జిల్లా నెల్లూరులోనూ, తిరుపతిలోనూ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా పై విషయాలు ప్రస్తావించారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ఆయన సోమవారం తెల్లవారుజామున తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతిలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తిరుమల నుంచి స్విమ్స్‌కు చేరుకున్న ఆయనకు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో రూ.18 కోట్లతో నూతనంగా నిర్మించిన వసతి భవనాన్ని ప్రారంభించారు. రూ.74.76 కోట్లతో నూతనంగా నిర్మించనున్న ఓపీడీ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే స్విమ్స్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇక్కడ వైద్యవిద్యను అభ్యసించిన విద్యార్థులు గ్రామాల్లో సేవలందించి పేరు గడించాలన్నారు. తర్వాత రుయాకు చేరుకుని గర్భిణులకు నూతనంగా నిర్మించిన కాన్పుల ఆస్పత్రిని ప్రారంభించారు. అనంతరం ఎస్‌వి మెడికల్ కళాశాలలోని కృష్ణమాచారి ఆడిటోరియంలో ఎంబిబిఎస్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

## జగన్‌పై చర్యలు తీసుకోవాలి

- డిజిపికి టిడిపి ఎమ్మెల్సీల వినతి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

సిఎం చంద్రబాబును కాల్చేయాలంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రతిపక్ష నేత జగన్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, బచ్చుల అర్జునుడు, టిడిపి నాయకులు వర్ల రామయ్య డిజిపి ఎన్ సాంబశివరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విజయవాడలోని డిజిపి క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన్ని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన వారు జగన్‌ను అరాచక శక్తిగా పేర్కొన్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడుతున్న జగన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బ్లేడ్ బ్యాచ్‌కు, వైసిపి బ్యాచ్‌కు తేడా ఏమీ లేదని ఎద్దేవా చేశారు. సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జగన్‌పై ఎన్నికల సంఘం, పోలీసులు చర్యలు తీసుకుంటారనే నమ్మకం తమకుందన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని ప్రతిపక్ష నేతకు హితవు పలికారు.

## 20 వేల వినతులతో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నిరసన

- సిఐడి చీఫ్‌కు వినతి అందజేత
- 16 నుంచి చైతన్య యాత్ర

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విజయవాడలోని సిఐడి కార్యాలయంలో సోమవారం సిఐడి చీఫ్ ద్వారకా తిరుమలరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా సేకరించిన 20 వేల వినతి పత్రాలను ఈ సందర్భంగా నెత్తిన పెట్టుకుని సిఐడి కార్యాలయం వద్ద తమ నిరసన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ వ్యవహారంలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 15 వరకు బాధితుల్లో చైతన్యం తీసుకురావడానికి చైతన్య యాత్ర చేపట్టినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరావు మీడియాకు తెలిపారు. 2014లో సంస్థ మూతపడినా, 2015లో ఆస్తులను కోర్టు ఎటాచ్ చేసినా బాధితులకు ఇంత వరకు న్యాయం జరగలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం చేసిన ఆర్థిక మోసంతో ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాలకు రూ.5 లక్షలు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించినా, మూడు నెలలలోపు డిపాజిట్లు చెల్లిస్తామని స్వయంగా సిఎం చంద్రబాబు మార్చి నెలలో హామీ ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. సిఐడి అధికారులు, ధర్మాసనం బాధితులకు న్యాయం చేయాలని చూస్తుంటే సంస్థ యాజమాన్యం మాత్రం ఆస్తులు వేలం జరగకుండా అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. తమ సమస్యల పరిష్కారం కోసం 20 లక్షల డిపాజిట్ దారులు మరో ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు ముప్పాళ్ల పేర్కొన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని భరోసాతో పాటు బాధితుల్లో చైతన్యం నింపడమే యాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు అందుకే చైతన్య యాత్ర నిర్వహించి బాధితులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి తిరుపతిరావు, కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పేరుతో కాలుష్యం

- ప్రజలకు ప్రశ్నించే హక్కుండాలి
- పర్యావరణ శాస్త్రవేత్త సునీత నారాయిన్



చుక్కపల్లి పిచ్చయ్య స్మారక ఉపన్యాసమిస్తున్న సునీత నారాయిన్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

కాలుష్యాన్ని వెదజల్లే పశ్చిమ దేశాల అభివృద్ధి నమూనా సరి కాదని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త సునీత నారాయిన్ స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వాలు ఇలాంటి విషయాల్లో అసమ్మతి తెలిపే హక్కు లేకుండా ప్రజలకు లేకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చుక్కపల్లి పిచ్చయ్య ఐదో స్మారక ప్రసంగ కార్యక్రమం సోమవారం సాయంత్రం విజయవాడలోని శేషసాయి కల్యాణ మండపంలో ఏర్పాటైంది. ఈ సభలో సునీత నారాయిన్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధికంగా ఇంధనాన్ని ఖర్చు చేయడమే అభివృద్ధికి నమూనాగా చెబుతున్నారని, కానీ ఆ తరహా అభివృద్ధి అనార్థలతో ఎప్పటికైనా కుప్ప కూలిపోతుందని హెచ్చ రించారు. వాతావరణం లోనూ అనేక మార్పులు వచ్చాయని, వర్షాలు అతిగా పడి వరదలు వస్తున్నాయని, ఎక్కువ కాలం వర్షాలు పడటం లేదని, రుతుపవనాల్లో మార్పొచ్చి వ్యవసాయ రంగంపై ఆ ప్రభావం పడుతోందని చెప్పారు. వాతావరణంలో పెరిగిపోతున్న తాపాన్ని తగ్గించేందుకు కాలుష్యాన్ని వెదజల్లుతున్న దేశాలు గతంలో కొన్ని ఒప్పందాలు చేసుకుంటే, ట్రంప్ దాన్నుండి బయటకు వచ్చారని గుర్తు చేశారు. ఇది ప్రమాదకరమైన పరిణామమన్నారు. ఢిల్లీ వంటి మహా నగరాల్లో వాహనాల రద్దీతో గాలి విషతుల్యమైందని తెలిపారు. అక్కడ 15 శాతం వాహనాలు 90 శాతం రోడ్డును ఆక్రమించాయని, అది 100 శాతానికి చేరితే ఢిల్లీలో పరిస్థితి మరింత భయానకంగా మారుతుందని వివరించారు. అక్కడ ఇంధన వాడకం లేకుండా సైకిళ్లకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందని సూచించారు. మరోపక్క నదులు కలుషితమవుతున్నాయని, యమునా నది ఇప్పటికే పూర్తిగా కలుషితమైపోయిందని చెప్పారు. చెత్తను నగరాలకు దూరంగా ఉండే ప్రాంతాల్లో వేసి, అక్కడి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. తిరువనంతపురంలో చుట్టుపక్కల ప్రజలు తిరగబడితే చివరకు చెత్తను తిరిగి వినియోగించుకునే విధంగా మార్పులు చేర్పులు చేసుకున్నారని, ప్రశ్నించే హక్కు ద్వారా అక్కడది సాధ్యమైందని చెప్పారు. ప్రస్తుత పరిపాలన రాజ్యం, మార్కెట్, సమాజం అనే మూడు విధాలుగా ఉందని, ఇందులో మార్కెట్ వ్యవస్థ పెరిగి సమాజంపై పట్టు సాధిస్తోందని, మార్కెట్ అభివృద్ధి అంటే కాలుష్యాన్ని వెదజల్లడమేనని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎన్ఐటి ప్రొఫెసర్ రామచంద్రయ్య మాట్లాడుతూ చుక్కపల్లి పిచ్చయ్యను నేటి యువత ఆదర్శంగా తీసుకుంటే సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఉన్నత చదువులు లేకపోయినా ఆయన అత్యున్నత ఆలోచనలతో సమాజాభివృద్ధికి కృషి చేశారని వివరించారు. ముందుగా చుక్కపల్లి ఫౌండేషన్ కార్యదర్శి అరుణ్‌కుమార్ తమ సేవా కార్యక్రమాలను వివరించారు. సునీత నారాయిన్‌ను సన్మానించారు.

## కార్పొరేట్ నిధులు ఆగితేనే అవినీతి, కుంభకోణాలకు అడ్డుకట్ట

- 'ది హిందూ' మాజీ ఎడిటర్ ఎన్ రామ్

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

కార్పొరేట్ సంస్థల నుంచి రాజకీయ పార్టీలకు నిధులు అగితేనే అవినీతి, కుంభకోణాలకు అడ్డుకట్ట వేసినట్టవుతుందని 'ది హిందూ' మాజీ ఎడిటర్ ఎన్ రామ్ అన్నారు. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే పెద్దల సమచారాన్ని గోప్యంగా ఉంచే విధంగా చట్టాలు రూపొందించారన్నారు. ఎన్ రామ్ రచించిన 'వై స్కామ్ ఆర్ హియర్ టు స్టే' పుస్తకాన్ని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కె తారక రామారావు సోమవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజకీయ అవినీతిపై రామ్ మాట్లాడారు. ఎన్నికల నిధి సేకరణలో జరుగుతున్న అక్రమాల్ని అడ్డుకోవడంలో ఎన్నికల సంఘం విఫలమైందన్నారు. పొలిటికల్ ఫైనాన్స్ వల్ల ఏడాదంతా కుంభకోణాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా తమిళనాడులో చోటుచేసుకున్న అవినీతిపైన తన పుస్తకంలోని ఒక చాప్టర్‌లో వివరించినట్లు రామ్ తెలిపారు. ఒకేసారి అవినీతిని నిర్మూలించలేమని, పద్ధతి ప్రకారం అవినీతిని పూర్తిగా నిర్మూలించే విధంగా ప్రయత్నించాలన్నారు. అవినీతిని ఏ విధంగా ఎదుర్కోవాలన్న అంశంతో ఈ పుస్తకం ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిధి సేకరణపై మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ ఎన్నికల కోసం ఖర్చు చేస్తున్న మొత్తంలో అప్రకటిత ఆదాయమే ఎక్కువగా ఉందన్న వాదనలో వాస్తవముందన్నారు.

## డ్రగ్స్ కేసు సిబిఐకి అప్పగించాలి

- హైకోర్టులో రేవంత్ పిల్

**ప్రజాశక్తి -హైదరాబాద్**

డ్రగ్స్ కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని కోరుతూ తెలంగాణ తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు రేవంత్‌రెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. డ్రగ్స్ నియంత్రణపై కీలకపాత్ర పోషించే నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) ప్రమేయం లేకుండా సిట్ దర్యాప్తు చేయడం వల్ల ఉపయోగం లేదని పిల్‌లో ఆయన పేర్కొన్నారు. సిట్, కేంద్ర స్థాయి దర్యాప్తు సంస్థలైన ఎన్‌సిబి, రెవిన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్, కేంద్ర ఆర్థిక ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇడి, సిబిఐ సాయం తీసుకోకపోవడం వల్ల దర్యాప్తు జరిపినా ఉపయోగం లేదన్నారు. కేవలం సినీ రంగానికే కాకుండా బడి పిల్లలు, కాలేజీ విద్యార్థులు, ఎంఎన్‌సి ఉద్యోగులు బాధితులుగా ఉన్నారని పేర్కొన్నారు. గోవా నుంచి డ్రగ్స్ వస్తున్నాయని చెబుతున్నప్పుడు జాతీయ స్థాయి సమస్యగా చూసి సిబిఐ విచారణకు ఆదేశించాలని పిల్‌లో హైకోర్టును కోరారు. ప్రతివాదులుగా సిట్, ఎన్‌సిబి, సిబిఐ, ఇడి తెలంగాణ ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శులను చేర్చారు.

## జంతు హింస నివారణకు తీసుకున్న చర్యలేమిటి? : హైకోర్టు

**ప్రజాశక్తి -హైదరాబాద్**

జంతు హింస నిరోధానికి చట్ట ప్రకారం జంతు హింస నిరోధక కమిటీలు తీసుకున్న చర్యలేమిటో తెలపాలని ఎపి పశు సంవర్ధక శాఖను హైకోర్టు ఆదేశించింది. అక్రమ రవాణాలో దొరికిన జంతువుల రక్షణకు తీసుకున్న జాగ్రత్తల్ని కూడా తెలపాలని సూచించింది. వాటిని ఉంచేందుకు అవసరమైన ప్రదేశాలు, ఆహారం, నీటికి నిధులు చేయించారా? అని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ప్రశ్నించింది. జంతు హింస నిరోధానికి ప్రతీ జిల్లాలో కమిటీలు ఏర్పాటు చేయకపోవడంపై యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్, ఇతరులు హైకోర్టులో దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ విచారించి ఈ వివరాలు కోరింది. జిల్లా కమిటీలు వేశామని, నిధుల్ని కేటాయించామని ప్రభుత్వ న్యాయవాది చెప్పగా ఆ వివరాలు కోరుతూ బెంచ్ తదుపరి విచారణ నెలరోజులకు వాయిదా వేసింది.

## ల్యాంకో పిటీషన్ కొట్టివేత

**ప్రజాశక్తి -హైదరాబాద్**

రుణం తీసుకున్నప్పుడు ఇచ్చిన గ్యారెంటీలను అప్పు చెల్లింపు నగదుగా పరిగణించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ల్యాంకో ఇన్‌ఫ్రా వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు తీర్పు చెప్పారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఐడిబిఐ బ్యాంకులకు ఇచ్చిన గ్యారెంటీలనే రూ. రెండు వేల కోట్ల అప్పుకు నగదుగా పరిగణించేలా ఉత్తర్వులు ఇవ్వాలని ల్యాంకో పిటిషన్ వేసింది.

# నంద్యాల నామినేషన్ల ప్రక్రియలో ఉత్కంఠ

- పరస్పర అభ్యంతరాలు తోసిపుచ్చిన ఈసి

**ప్రజాశక్తి - నంద్యాల లీగల్**

నంద్యాల ఉపఎన్నిక సందర్భంగా నామినేషన్ల ప్రక్రియ సోమవారం ఉత్కంఠ రేపింది. టిడిపి, వైసిపి నాయకులు వ్యక్తం చేసిన అభ్యంతరాలతో గందరగోళం నెలకొంది. దీనిపై ఎన్నికల కమిషన్ న్యాయవాదులతో సంప్రదింపులు జరిపింది. చివరికి ఇరు పార్టీల అభ్యంతరాలను ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది.

ఇరు పార్టీల అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించింది. దీంతో నామినేషన్ల ప్రక్రియకు తెరపడింది. అనంతరం ఆర్‌డిఓ కార్యాలయలో వివిధ పార్టీల నాయకుల సమక్షంలో నామినేషన్ల స్క్రూటినీని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్ నిర్వహించారు. శిల్పామోహన్‌రెడ్డి సమర్పించిన నామినేషన్ పత్రంలో అఫిడవిట్‌లో నంద్యాల అడ్వకేట్ సోముల రామతులసీ రెడ్డి చేసిన నోటరీ 2013లోనే ముగిసిందని, ఆ తరువాత ఎలాంటి రెన్యూవల్ చేసుకోలేదని టిడిపి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫారం-26కు అనుబంధంగా ఉన్న ఒక అఫిడవిట్, అది కూడా జ్యూడీషియల్ పేపర్‌పైనే ఇవ్వాలని, అలా ఇవ్వలేదన్నారు. నోటరీపై అడ్వకేట్ సోముల రామతులసీరెడ్డి ఎన్నికల అధికారితో మాట్లాడారు. నోటరీని 2013లోనే రెన్యూవల్ చేసుకున్నానని చెప్పారు. ఆ సయమంలో హైకోర్టులో నోటరీలకు స్టే ఉందని చెప్పారు. ఫారం-26కు అనుబంధంగా పత్రాలున్నాయని, కనుక ఫారం-26 ఇవ్వాల్సిన అవసరం లేదని గట్టిగా వాదించారు. స్టేను పరిగణలోకి తీసుకుని శిల్పా నామినేషన్ స్వీకరించాలని కోరారు. ఈ విషయాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్నికల కమిషన్‌కు తెలియజేశారు. ఎన్నికల కమిషన్ పరిశీలించి నామినేషన్ పత్రాన్ని స్వీకరించాలని ఆమోదముద్ర వేసింది.

ఉదయం 11 గంటలకు నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు ముగించాల్సిన ఈ తతంగం సాయంత్రం 6 :30 గంటల వరకు ఉత్కంఠగా కొనసాగింది. రాత్రి 7 గంటలకు ఎన్నికల కమిషన్ ఆమోదం తెలపడంతో వైసిపి నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందారెడ్డి నామినేషన్ పత్రంలో రిటర్న్ చూపలేదని వైసిపి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబంగా ఉన్నందున రిటర్న్ చూపలేదన్నారు. ఎన్నికల కమిషన్ వైసిపి నాయకుల ఆరోపణలు తోసి పుచ్చి భూమాబ్రహ్మానందారెడ్డి నామినేషన్ స్వీకరించింది.

# రేషన్ షాపుల్లో బహుళజాతి సరుకులు

- వాల్‌మార్టు, డీ మార్టు సంస్థల సర్వే
- సెప్టెంబరు, అక్టోబరుల్లో ప్రయోగాత్మక అమ్మకాలు!
- విలేజీ మాల్స్ వైఫల్యంతో ప్రభుత్వ నిర్ణయం?



**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి**

రేషన్ దుకాణాల్లో బహుళజాతి సంస్థల సరకులను విక్రయించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మరోవైపు మాల్స్ సరుకులు రేషన్ దుకాణాల్లో విక్రయించడం వల్ల చిల్లర వర్తకంపై ప్రభావం చూపుతుందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. రేషన్ దుకాణాల్లో సరుకుల విక్రయాలు తమకు లాభసాటిగా ఉంటాయా?, ప్రజల స్పందన ఎలా ఉంటుందీ అనే విషయాలపై డీమార్టు, వాల్‌మార్టు వంటి బహుళజాతి సంస్థలు సర్వేలు నిర్వహించాయి. సర్వేలు రేషన్ దుకాణాల వద్ద, మురికివాడల్లో నిర్వహించాయని తెలిసింది. రేషన్ సరుకుల కుదింపు వల్ల చాలీచాలని కమీషన్‌లతో ఇబ్బంది పడుతున్న డీలర్లూ, నాణ్యమైన సరుకులు తక్కువ ధరలకు అందిస్తే కొనుగోలు చేసేందుకు ప్రజలూ, సర్వేలో సుముఖత వ్యక్తం చేసినట్లు ఆ సంస్థలు ప్రకటించాయి. కనుక సెప్టెంబరు, అక్టోబరుల్లో ప్రయోగాత్మకంగా మల్టీనేషన్ బ్రాండెడ్ సరుకుల విక్రయాలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పౌరసరఫరాల శాఖ అధికారులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో బియ్యం మినహా మరే ఒక్క సరుకూ అందించడం లేదు. దీంతో లబ్ధిదారుల్లో, రేషన్ డీలర్లలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రేషన్ దుకాణాలను విలేజ్ మాల్స్‌గా మార్చి నిత్యావసర సరుకులు (కందిపప్పు, సెనగపప్పు, మినపగుళ్లు)ను బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరలకు కిలో రూ.50కు విక్రయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. విలేజ్ మాల్స్ పేరుతో విక్రయించేందుకు రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్న సరుకుల్లో నాణ్యత కొరవడింది. దుకాణాలకు సరఫరా చేసిన పామాయిల్ లీటరు ప్యాకెట్ రూ.52కు సరఫరా చేస్తే, బహిరంగ మార్కెట్‌లో రూ.50కే అందుబాటులో ఉంది. ఈ సరుకును వదిలించుకునేందుకు డీలర్లకు అప్పుగా ఇచ్చి టార్గెట్‌లు నిర్ణయించి లబ్దిదారులకు బలవంతాన అంటగట్టారనే విమర్శ ఉంది. నాణ్యత లేకపోవడంతో విలేజ్ మాల్స్‌లో సరుకులు కొనేందుకు రేషన్ వినియోగదారులు ఆసక్తి చూపలేదు. విలేజ్ మాల్స్‌కు సరఫరా అయ్యే సరుకు మూడు దశల్లో చేతులు మారుతుంది. సరుకు చేతులు మారిన ప్రతి సందర్భంలోనూ కమీషన్ రూపంలో నగదు చేతులు మారడంతో నాణ్యమైన సరుకులను చౌకగా వినియోగదారులకు విక్రయించేందుకు అవకాశం ఉండటం లేదని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ఈ నేపథ్యంలో బహుళజాతి సంస్థల సరకులను అమ్మడం ద్వారా ప్రజా వ్యతిరేకతను అధిగమించ వచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

### చిల్లర వర్తకంపై ప్రభావం

ప్రధాన నగరాల్లో మాల్స్ ఏర్పాటు చిల్లర వర్తకులపై ఇప్పటికే ప్రభావం చూపుతోంది. వ్యాపారులు 40 శాతం మార్కెట్‌ను కోల్పోయారు. మాల్స్ సరుకులు రేషన్ దుకాణాల్లో విక్రయిస్తే చిల్లర వర్తకులపై ప్రభావం మరింత ఉంటుంది. మాల్స్ ధరలకన్నా చిల్లర వర్తకుల వద్దే సరుకుల ధరలు తక్కువగా ఉంటాయి. రేషన్ దుకాణాల్లో మాల్స్ సరుకులను విక్రయించే క్రమంలో జిఎస్‌టి పన్నులు మినహాయిస్తే చిల్లర వ్యాపారులు దివాళా తీయాల్సి వస్తుంది.

**- అన్నం శ్రీనివాసరావు, కార్యదర్శి, కాళేశ్వరరావు మార్కెట్ మర్చంట్ అసోసియేషన్**

# తీరంపై బడాబాబుల కన్ను!

**అభివృద్ధి, ఉపాధి పేరుతో చంద్రబాబు ప్రభుత్వం భావితరాలకు తీరని ద్రోహాన్ని తలపెడుతోంది. దేశ ప్రగతికి దోహదపడే పారిశ్రామికాభివృద్ధికి ఎవరైనా అడ్డు చెప్పాల్సిన అవసరం ఉండదు. కానీ అనేక సంవత్సరాల నుంచీ తీర ప్రాంతంలో అక్రమాలను నియంత్రించడానికి ఉపయోగపడుతున్న కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జెడ్) నోటిఫికేషన్‌కు తూట్లు పొడిచేందుకు పాలకులు సిద్ధమవుతున్నారు. విశాఖ తీరంపై బడాబాబులు కళ్లు పడ్డాయి. విశాఖ తీరం అంచున వందల ఎకరాల భూములు చాలావరకూ కబ్జాకు గురయ్యాయి.**


తీరంలో కంచె వేసిన బడాబాబులు

**ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి**

కోస్టల్ కారిడార్ పేర వ్యాపారం చేసుకునేందుకు భూములను, సముద్ర సంపదలను, ప్రకృతి వనరులను బడాబాబులకు కట్టబెట్టే యజ్ఞానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపోశాయి. దీనికి 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అంటూ పేరుపెట్టాయి. విశాఖ సముద్ర తీరం ఆర్‌కె.బీచ్ నుంచి భీమునిపట్నం వరకూ సిఆర్‌జెడ్ ఉల్లంఘనలే నేడు అడుగడుగునా దర్శనమిస్తున్నాయి. అధికారంలో పాలుపం చుకుంటున్న తెలుగు దేశం, బిజెపి నేతలు సంయుక్తంగా తీరాన్ని పంచుకోడానికి సిద్ధమయ్యారు. త్వరలో ప్రభుత్వ స్థాయిలో జిఒను విడుదల చేసి సిఆర్‌జెడ్ చట్టాన్ని లేపేసేందుకు కుట్రకు దిగుతున్నారు. దీంట్లో భాగంగా బీచ్ కారిడార్‌కు భూ సేకరణకు తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బిజెపి అధికారంలోకి వచ్చాక దేశంలో 293 కి.మీ. జాతీయ రహదారులను నిర్మించిందని, మరో 836 కిలోమీటర్ల రహదార్ల నిర్మాణానికి జాతీయ రహదారుల, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. 2016-17లో ఎపిలో జాతీయ రహదారుల కోసం రూ.2014 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. బీచ్ రోడ్ల పరిసర ప్రాంతాలన్నిటినీ కారిడార్లలో భాగంగా రోడ్లు వేసేందుకు అప్పగించాలని కేంద్ర మంత్రి ప్రతిపాదనతో సిద్ధమయ్యాడు.

### విశాఖ తీరం నిండా కబ్జాలే..!

విశాఖ తీరానికి ఆనుకుని ఉండే భూములను ఇప్పటికే పెద్దలు కబ్జా చేశారు. బీచ్‌కు ఆనుకుని కామత్ హోటల్ పక్కనేగల సర్వే నెంబరు 13లోని రూ.100 కోట్ల విలువైన 87 సెంట్ల స్థలాన్ని ఏడాదికి ఎకరాకి రూ.వెయ్యి చొప్పున 33 ఏళ్ల పాటు లీజుకు బిజెపి కార్యాలయానికి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ 340ను 2016 జులై 21న విడుదల చేసింది. బీచ్ ఒడ్డున గల రిజర్వు ఫారెస్ట్ జోడుగుళ్లపాలెం వద్దగల భూమి రూ.50 కోట్ల విలువైన 3వేల గజాలను స్థానిక తెలుగుదేశం ఎమ్మెల్యే ఆశీస్సులతో కొందరు కబ్జా చేశారు. కంచెలు కూడా వేసేశారు. బే పార్కు, వనభోజనాల పార్కు, వెంకయ్య నాయుడుకు చెందిన సాయిప్రియా రెస్టారెంట్ (రుషికొండ)లోగల 20 ఎకరాల స్థలం బడాబాబుల చేతుల్లోకి వెళ్లిపోయింది.

### కోస్తాకు రక్షణ కంచె సిఆర్‌జెడ్..

ప్రపంచంలో 25 దేశాలతోపాటు భారతదేశంలోని సముద్ర జలాల నీటి మట్టం పెరుగుతోంది. దీనివల్ల రానున్న రోజుల్లో భారతదేశంలో 50 నుంచి 60 మిలియన్ల మంది నిర్వాసితులయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చ రిస్తున్నారు. కోస్తా తీర ప్రాంతాన్ని రక్షించేం దుకు దేశంలో సమగ్రమైన చట్టం ఇంతవరకూ లేనేలేదు. అయితే 1991 ఫిబ్రవరి 19న ప్రభుత్వం సిఆర్‌జెడ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇది కొంతలో కొంతమేర తీరప్రాంతానికి రక్షణ కవచంలా ఉంది. సిఆర్‌జెడ్‌లో లోపాలను సరిదిద్దగలిగితే పటిష్టమైన రక్షణ చట్టం కాగలదని మేధావులు సూచించినా ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోనందున నేడు కోస్తా తీరంలో భూములన్నీ హాంఫట్ అవుతున్నాయి. విశాఖ నుంచి భీమిలి వరకూ రూ.వందల కోట్ల విలువైన వేలాది ఎకరాలు కబ్జాకు గురవుతూనే ఉన్నాయి.

> **కోస్టల్ రెగ్యులేటరీ జోన్‌కు తూట్లు**
> **సహజత్వాన్ని కోల్పోతున్న తీరం**
> **ముసాయిదా బిల్లు తెచ్చేందుకు కేంద్రం యత్నం**
> **వందల ఎకరాల కైంకర్యానికి సముద్రం వద్ద కంచెలు**

### తెరపైకి కోస్టల్ మేనేజిమెంట్ జోన్ చట్టం

బహుళజాతి సంస్థలు, బడాబాబుల ప్రయోజనాల కోసం సిఆర్‌జెడ్ చట్టానికి తూట్లు పొడిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తయారయ్యాయి. కోస్టల్ మేనేజ్‌మెంట్ చట్టాన్ని గతంలో తేవడానికి ప్రయత్నించగా పర్యావరణ వేత్తలు, మేధావులు అభ్యంతరాలు చెప్పారు. కోస్టల్ మేనేజ్‌మెంట్ చట్టం జోన్‌లో గతంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లు, ఫోర్ షోర్ ఫెసిలిటీస్, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, పవర్‌ప్లాంట్‌లు, గ్రీన్ ఫీల్డు ఎయిర్‌పోర్టులు, పోర్టులకు అనుసంధానంగా కారిడార్‌లు, వాటర్ స్పోర్ట్స్, ఆక్వాకల్చర్, పర్యాటక హంగులు, క్యాసినోక్లబ్బులు.. తదితరాలను ప్రతిపాదిస్తున్నారు. ఇలాంటివి రాకుండా నిరోధించడానికే సిఆర్‌జెడ్ ఉంది.

### మత్స్య సంపదకు విఘాతం

రాష్ట్రంలోని 9 కోస్తా జిల్లాల్లో మత్స్యకారులు ఏటా రూ.7.1 వేల కోట్ల విలువైన మత్స్య సంపదను ఉత్పత్తి చేస్తున్నట్లు లెక్కలు ఉన్నాయి. కోస్టల్ కారిడార్ పేర ప్రభుత్వం సముద్రంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న 15 లక్షల మత్స్యకార కుటుంబాల పొట్టకొట్టే ప్రయత్నం చేస్తోందన్నది ప్రత్యక్షంగా కనిపిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లా ల్లో కాలుష్య రసాయనిక పరిశ్రమలు, ఇండస్ట్రియల్ కారిడార్‌లు వస్తే గణనీయంగా ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోనుందన్నది పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు. సముద్ర జీవులకు పునరుత్పత్తి కేంద్రంగా బంగాళా ఖాతం ఉంది. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం, రణస్థలం, విజయనగరం జిల్లా భోగాపురం, పూసపాటిరేగ, కోనాడ, విశాఖ జిల్లా భీమిలి, అచ్యుతాపురం, నక్కపల్లి, రాంబిల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన రసాయన పరిశ్రమలతో చేపల లభ్యత పూర్తిగా పడిపోయింది. తీర ప్రాంతం తన సహజత్వాన్ని సైతం కోల్పోయింది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు జిల్లా తడ వరకూ ఉన్న 972 కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారి నుంచి సముద్రం వరకూ ఉన్న భూమిని ప్రభుత్వం సేకరించేందుకు తాజాగా సిద్ధమైంది.

### కోస్టల్ రెగ్యులేటరీ జోన్ ఎత్తేసేందుకు కుట్ర
### మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ

ప్రభుత్వాలు సముద్రాన్ని విధ్వంసం చేయడానికి చూస్తున్నాయని, పర్యావరణానికి తీవ్రనష్టం కలిగించే విధానాలే అనుసరిస్తున్నాయని విశాఖకు చెందిన మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ అన్నారు. సముద్ర జలాల పరిరక్షణకు కంచెగా ఉండే కోస్టల్ రెగ్యులేటరీ జోన్‌ను ఎత్తేసేందుకు తాజాగా కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతుండడం నష్టదాయకమని పేర్కొన్నారు. విశాఖ బీచ్‌లో ఇప్పటికే బడాబాబులకు చెందిన హోటళ్లు, వ్యాపార భవంతులు ఉన్నాయని, వీటన్నిటినీ రెగ్యులరైజ్ చేసుకోడానికి సిఆర్‌జెడ్ చట్టాన్ని సవరించడమో పూర్తిగా ఎత్తేయడమో చేస్తున్నట్లు అర్థమవుతోందని, విశాఖ వాసులు దీనికి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.


ఇఎఎస్ శర్మ
రిటైర్డ్ ఐఎఎస్ అధికారి

### కోస్తా జల వనరులకు ముప్పు

శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకూ కోస్టల్ కారిడార్ ఏర్పాటుకు ప్రతిపాదన వైఎస్ రాజశేఖరరెడ్డికాలం నుంచీ ఉంది. దీనిపై చంద్రబాబు ప్రభుత్వం విశాఖ చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ (విసిసిఐ) పేర మరోసారి బయటకు తీసింది. ఇదే అమలైతే ఈ జిల్లాల్లోని సుమారు 18 నదులు కలుషితమవుతాయి. ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్‌లో భాగంగా వచ్చేటువంటి రసాయన పరిశ్రమలకు ఈ నదుల నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. సాగు, తాగునీటికి కటకటలాడే పరిస్థితులు దాపురించనున్నాయి. తీర ప్రాంతంలో ఉన్న జలవనరులను పెద్ద ఎత్తున వినియోగించుకునే వీలుండడంతో ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ పేర రసాయన, పెట్రో రసాయన పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల మధ్య ఏర్పాటు చేస్తున్న పెట్రోలియం, కెమికల్, పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌కు సంబంధించి రా వాటర్ సోర్సెస్ విషయంలో ప్రభుత్వం రూపొందించిన డిజై న్‌ను చూస్తే పాలకులు విశాఖకు తీవ్ర ద్రోహం చేసే ప్లాన్ వేశారన్నది వెల్లడవుతోంది. విశాఖ నగర వాసుల దాహార్తిని తీర్చేందుకు ఏలేరు జలాశయం ఎడమ కాలువను రా వాటర్ సోర్స్‌గా చెప్పొచ్చు. దీంట్లోంచి 385 మిలియన్ లీటర్ల నీటిని కోస్టల్ కారిడార్‌కు మళ్లించే ప్లాన్ ఉంది. దీంతో విశాఖ నగర వాసులకు శాశ్వతంగా తాగునీరందదు.

## జాతీయ రహదారుల భద్రతకు రూ.3 వేల కోట్లతో ప్రతిపాదనలు



- డ్రైవింగ్ లైసెన్స్‌ను మల్టీపర్పస్‌గామార్చేందుకు కసరత్తు
- ఎన్‌పిసి దృష్టికి తీసుకెళ్లిన రవాణా శాఖ

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి**

జాతీయ రహదారుల భద్రతకు సంబంధించి ప్రపంచ బ్యాంకు సహకారంతో రోడ్‌సేఫ్టీ ప్రాజెక్టును రవాణా శాఖ తెరమీదకు తీసుకొచ్చింది. ప్రాజెక్టుకు సంబంధించి రూ.3 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఐదేళ్ల కాలపరిమితిని నిర్ణయించింది. అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ఫైలు సర్కారు వద్ద పెండింగులో ఉంది. రోడ్ సేఫ్టీ ప్రాజెక్టు విజయవంతం చేయడానికి రవాణా శాఖతో పాటు పోలీస్, ఆర్‌అండ్‌బి, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, ఆరోగ్యశాఖలు సంయుక్తంగా కృషి చేయనున్నాయి. జాతీయ రహదారులపై ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టు వల్ల ఎంతోమంది ప్రాణాలకు భద్రత కల్పించినట్లవుతుందని రవాణా శాఖాధికారులు భావిస్తున్నారు.

### ఎన్‌పిసితో చర్చిస్తున్న అధికారులు

వాహన చోదకులు వాహన కొనుగోలు సమయంలో రిజిస్ట్రేషన్‌లకు ఇచ్చే కార్డును బ్యాంకర్లు అంగీకరిస్తే త్వరలో మల్టీపర్పస్ కార్డుగా తీసుకొచ్చే యోచనలో ఉన్నట్లు రవాణా శాఖ జాయింట్ కమిషనరు వరప్రసాదరావు ప్రకటించారు. బ్యాంకర్లతో ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించారు. ఇప్పటివరకు బ్యాంకర్ల నుండి పూర్తిస్థాయిలో అంగీకారం రాకపోయినప్పటికీ విశ్వసనీయ సమాచారం మేరకు ఐసిఐసిఐ, యాక్సిస్ బ్యాంకులు ముందుకొచ్చినట్లు తెలిసింది. ఈ విషయమై రవాణా శాఖ ఉన్నతాధికారులు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసి)తో చర్చిస్తున్నట్లు సమాచారం. ఇరు శాఖలు అంగీకరానికి వస్తే భవిష్యత్తులో రవాణా శాఖ మంజూరు చేసే కార్డుకు ఒక వైపు డ్రైవింగ్ లైసెన్స్, మరొక వైపు డెబిట్, క్రెడిట్ కార్డు కనబడే అవకాశాలున్నాయి. కార్డు వల్ల బ్యాంకులో వాహనదారులు ఖాతాలు ప్రారంభమవుతాయని, ఖాతాదారులు పెరగడంతో పాటు నగదు లావాదేవీలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

## కరువు రైతుపై జిఎస్‌టి పిడుగు
# 'అనంత'లో ఆగిన బిందు సేద్యం

- పరికరాల ధరలపై పెరిగిన పన్ను శాతం, ఆగిన పంపిణీ
- పనిముట్ల పంపిణీకి ముందుకు రాని కంపెనీలు
- రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి


డ్రిప్ ఇరిగేషన్‌తో సాగు చేసిన పైరు(ఫైల్)

**ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి**

'కరువు జిల్లాలో అడిగిన ప్రతి రైతుకు బిందుసేద్యం పరికరాలు అందించండి.. ఎంత ఖర్చయినా పర్వాలేదు.. కరువు ప్రాంతంలో పంటలను ఎండనీయొద్దు'.. ఈ మాటలు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లాలో పర్యటించిన ప్రతిసారి చెపుతుంటారు. ఈ మాటలు వినడానికి బాగానే ఉన్నా ఆచరణలో అంతగా కనపడదు. ప్రచారార్భాటం తప్పితే క్షేత్రస్థాయిలో రైతులకు ఒరిగిందేమీ లేదు. డ్రిప్ పరికాల పంపిణీలో జాప్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఉన్న జాప్యానికి తోడు ప్రస్తుతం జిఎస్‌టి ప్రభావంతో జిల్లాలో డ్రిప్ పరికాల పంపిణీ మరింత ఆలస్యం అవుతోంది.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్‌టి విధానం ఆధునిక వ్యవసాయ పరికరాల వినియోగానికి భారంగా మారింది. నూతన పన్ను విధానం కారణంగా వ్యవసాయ పరికరాలపై పన్నులు భారీగా పెరిగాయి. ఎంఐ కంపెనీలు గతేడాది రాష్ట్రంలో బిందు సేద్య పరికరాల ధరలను పది నుంచి 15 శాతం మేర పెంచాయి. రైతులు పెరిగిన ధరలతోనే పరికరాలను కొనుగోలు చేశారు. ప్రస్తుతం జిఎస్‌టి విధానం అమలులోకి రావటంతో పరికరాలపై పన్ను 5 నుంచి 18 శాతానికి పెరిగింది. ధర నిర్ణయంపై ప్రభుత్వం స్పందించలేదు. అటు కంపెనీలు ముందుకు రావడం లేదు. దీంతో డిడిలు కట్టిన రైతులు పరికరాల కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల మంది రైతులు డ్రిప్ పరికాల కోసం డిడిలు చెల్లించారు. ఒక్క అనంతపురం జిల్లాలోనే మూడు వేల మంది ఉన్నారు. ఖరీఫ్ ప్రారంభానికి ముందే డిడిలను వ్యవసాయ అధికారులకు అందజేశారు. ఇంతవరకు పరికరాలు అందలేదు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 35 లక్షల హెక్టార్లలో బిందు సేద్యం లక్ష్యంగా పెట్టుకున్నారు. 27,348 హెక్టార్లకు సరిపడా పరికరాలు పంపిణీ చేశారు. అనంతపురం జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 30 వేల హెక్టార్లు లక్ష్యం కాగా 3,200 హెక్టార్లకే అందించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో 90 శాతానికి పైగా వర్షాధారం, బోర్లపై ఆధారపడి వ్యవసాయం సాగవుతోంది. నీరు లేకపోవటంతో బిందు, తుంపర సేద్యంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలల గడుస్తున్నా నేటికి పూర్తిస్థాయిలో బిందు, తుంపర సేద్యం పరికరాలు రైతుల దరిచేరలేదు.

### జిఎస్‌టితో పరికరాలపై పెరిగిన పన్ను

డ్రిప్ పరికరాల కోసం గతంలో రూ.లక్షకు ఐదు వేలు పన్ను చెల్లించేవారు. ఇప్పుడు రూ.18 వేలు పన్ను రూపంలో చెల్లించాల్సి వస్తోంది. అదనపు భారం రైతులకు ఇబ్బందిగా మారుతోంది. పరికరాల ధరలపై ప్రభుత్వం వివరాలు వెల్లడించేంత వరకు పంపిణీ చేసేది లేదని ఎంఐ కంపెనీలు భీష్మించుకుని కూర్చున్నాయి. ఎంఐ కంపెనీలు 18 శాతంలో 6 శాతం వరకు పన్నును భరిస్తామని ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకుని పన్ను భారం భరిస్తేనే పరికరాల పంపిణీ జరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

### కరువు మండలాలలకు మినహాయింపు ఇవ్వాలి



రాష్ట్రంలోని 214 మండలాల్లోని రైతులకు జిఎస్‌టి నుంచి మినహాయింపు ఇవ్వాలి. కరువు జిల్లాల్లో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఈ మండలాల్లో అడిగిన వారికి వెంటనే డ్రిప్ పరికరాలను అందించాలి. దీనిపై ఆలస్యం చేయటం సరికాదు. జిఎస్‌టి భారాన్ని ప్రభుత్వమే భరించాలి.

**పి.పెద్దిరెడ్డి, రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

### ప్రభుత్వ నిబంధనల ప్రకారమే..

గతంలో డ్రిప్ పరికరాలపై పన్ను ఐదు శాతం ఉండేది. ఇప్పుడు 18 శాతం అయింది. ఈ నేపథ్యంలో ఎంఐ కంపెనీలు, ప్రభుత్వం మధ్య చర్చలు జరుగుతున్నాయి. రైతులపై భారం ఏ మేరకు తగ్గించాలో, పన్ను భారం ఎవరు భరించాలో అనే అంశాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. నిబంధనల ప్రకారమే పంపిణీని చేపడతాం.

**వెంకటేశ్వర్లు, ఎపిఎంఐపి, పీడీ, అనంతపురం**

### మూడు నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా



డ్రిప్ పరికరాల కోసం మూడు నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. అధికారులు స్పందించడం లేదు. ఇప్పుడు ప్రభుత్వం పన్ను పెంచింది. కరువులో అదనపు భారం ఎలా భరించాలి. పెరిగిన పన్నును ప్రభుత్వం భరించి డ్రిప్ పరికరాలు ఇవ్వాలి. ఇప్పటికైనా పరికరాలు ఇవ్వకపోతే సాగు చేయడం కష్టమే.

**శ్రీనివాసులు-చిన్న జలాల పురం -శింగనమల మండలం**


నేలపై కూర్చుని నిరసన తెలియజేస్తున్న ముద్రగడ

## మరోసారి పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు

**ప్రజాశక్తి-కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరి)**

'మిమ్మల్ని ఇబ్బందిపెట్టాలంటే రాత్రికిరాత్రే ఏదోరకంగా వెళ్లిపోదును. నాకు అలాంటి ఆలోచన లేదు. అందువల్లే శాంతియుతంగానే పాదయాత్రను మొదలుపెడుతున్నాను' అని కాపు ఉద్యమనేత, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం తనను అడ్డుకున్న పోలీసులతో చెప్పారు. ఆయన చేపట్టిన చలో అమరావతి నిరవధిక పాదయాత్రను 14వరోజైన సోమవారం కూడా ఆయన నివాసం ప్రధానగేటు వద్ద పోలీసులు నిలుపు చేశారు. ముద్రగడ తమ అనుచరులతో నేలపై కూర్చుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'బందులదొడ్డిలో పెట్టి మమ్మల్ని హింసించకండి. మూడు సింహాలకు ఉన్న గౌరవం ప్రజల్లో పోతుంది. ముద్రగడ ప్రతిరోజూ పాదయాత్రకు బయల్దేరి గేటువద్దకు వచ్చి పోలీసులతో కరచాలనం చేసి వెళ్లిపోతున్నారని చెబుతున్నారు. శాంతియుతంగా చేయాలనే పాదయాత్రను మొదలుపెట్టాను' అని స్పష్టం చేశారు. 'హోంమంత్రి చినరాజప్పగారూ... నేను అంతర్జాతీయ ఉగ్రవాదిని కాదు. పాదయాత్రకు అనుమతి కల్పించండి. లేదా నన్ను జైలుకు తరలించండి' అని పద్మనాభం అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాసమస్యలు తలెత్తినప్పుడు పరిష్కరించే మార్గాన్ని చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

## ఆడబిడ్డలకు ప్రభుత్వమే రక్షాకవచం : సిఎం
### రాఖీలు కట్టిన మహిళా నేతలు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఆడబిడ్డలకు ప్రభుత్వం రక్షాకవచంలా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆపదలో ఉన్న మహిళల కోసం అభయ హస్తం యాప్‌ను రూపొందించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. టీజింగ్ చేసే వారిపైనా, మహిళల్ని వేధించేవారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉండవల్లిలోని తన నివాసంలో పలువురు మహిళలు రాఖీ కట్టారు. మంత్రి పరిటాల సునీత, మాజీ మంత్రి పీతల సుజాత, టిడిపి ఏపి శాఖ అధ్యక్షురాలు శోభా హైమావతి, కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, పలువురు టిడిపి మహిళా నాయకులు, బ్రహ్మకుమారీలు ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

### రాజ్‌భవన్‌లో రక్షాబంధన్ వేడుకలు



రాజ్‌భవన్‌లో రక్షా బంధన్ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. గవర్నర్ నరసింహన్‌కు రాఖీలు కట్టేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, హైదరాబాద్‌లోని 24 పాఠశాలలకు చెందిన 350 మంది విద్యార్థినులు, 64 మంది టీచర్లు, బ్రహ్మకుమారీలు తరలివచ్చారు. రాఖీలు కట్టిన వారందరికీ గవర్నర్ నరసింహన్, ఆయన సతీమణి విమలా నరసింహన్ దీవెనలు అందించారు. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు ఒకరినొకరు తోడుగా, అండగా ఉండాలని గవర్నర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

### జగన్‌కు రాఖీ కట్టిన షర్మిల

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆయన సోదరి షర్మిల రాఖీ కట్టారు. అనంతరం వైఎస్ జగన్ ట్విట్టర్ ద్వారా రాష్ట్ర ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పౌర్ణమి రాష్ట్ర ప్రజల్లో సోదరభావాన్ని, ఐక్యతను చాటాలని ఆకాక్షిస్తున్నట్లు ట్వీట్ చేశారు.

## పట్టుబడ్డ దొంగనోట్ల ముఠా
### రూ.1.91 కోట్ల పాత నోట్లు స్వాధీనం

**ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి**

ప్రభుత్వం రద్దు చేసిన పాత నోట్లను విశాఖలో మార్పిడి చేస్తున్న ముఠాను సోమవారం విశాఖ సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద రూ.1.91 కోట్లు విలువ గల పాత రూ.500, రూ.1000 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి సిటీ పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో సంయుక్త పోలీస్ కమిషనర్ డి.నాగేంద్రకుమార్ వివరాలు వెల్లడించారు. నగరంలోని బర్మాక్యాంప్ ప్రాంతానికి చెందిన ప్రధాన నిందితుడు గెడ్డం కళ్యాణ్ కుమార్, గుడ్ల వెంకటరమణ రూ. 25 లక్షల కమీషన్‌కు రూ.1.91 కోట్ల విలువ గల పాత నోట్లను మార్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఐ.చిట్టిబాబు, ఎస్ఐ సతీష్, మూర్తి బృందంతో దాడులు నిర్వహించి అరెస్టు చేశారు.


## లౌకిక భావాలతో విశాల వేదికగా సాహితీస్రవంతి కృషి
### సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొరప్రసాద్


'అలల తీరంలో..' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వొరప్రసాద్, శాంతినారాయణ్ తదితరులు

**ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి**

ప్రజాస్వామిక, ప్రగతిశీల, లౌకిక భావాలతో విశాల వేదికగా సాహితీస్రవంతి కృషి చేస్తోందని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొరప్రసాద్ తెలిపారు. కాకినాడలో ఆదివారం నిర్వహించిన సాహితీ స్రవంతి నాలుగో వార్షికోత్సవానికి సాహితీస్రవంతి కాకినాడ గౌరవాధ్యక్షులు డాక్టర్ వుయ్యపు హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వొరప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధి అద్భుతాల్ని సృష్టిస్తున్నప్పటికీ సామాజికంగా ఇంకా ఛాందస భావాలు, మానవ సంబంధాలను దెబ్బతీస్తున్నాయన్నారు. రచయితలు మానవ సంస్కారాన్ని పెంచే రచనలు విరివిగా చేయాలని కోరారు. సినర్జీ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ ప్రకాష్, పెద్దాపురం మహారాణి కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ఆర్.ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనైనా తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. మొదటి సాహిత్య సదస్సుకు డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు అధ్యక్షత వహించారు. ప్రముఖ కథా, నవలా రచయిత డాక్టర్ శాంతినారాయణ 'సమాజం - సాహిత్యం' అంశంపై ప్రసంగించారు. సాహిత్యం సమాజ వాస్తవికతను ప్రతిబింబించాలన్నారు. ఈ సందర్భంగా సాహితీస్రవంతి 4వ వార్షికోత్సవ కవితా సంకలనం 'అలల తీరంలో..' పుస్తకాన్ని వొరప్రసాద్ ఆవిష్కరించారు. బొల్లోజు బాబా పుస్తకాన్ని సమీక్షిస్తూ మాట్లాడారు. రెండో సాహిత్య సదస్సుకు ప్రముఖ రచయిత పాలపర్తి ధనరాజ్ అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం పొందిన మెర్సీ మార్గరెట్ 'సమకాలీన కవిత్వం - సామాజికత' అంశంపై మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో వివిధ వర్గాల ప్రజల నుంచి తమ అస్తిత్వాలను చాటుతూ కవిత్వం వెలువడుతుందని అన్నారు. మూడో సాహిత్య సదస్సుకు కొత్తపేట కళా సాహితి కార్యదర్శి గిడ్డి సుబ్బారావు అధ్యక్షత వహించారు. వుయ్యపు హనుమంతరావు కవితా సంపుటి 'గాండీవం', మాకినీడి సూర్యభాస్కర్ 'కల్లోల సరళి' పుస్తకాలను గిడ్డి సుబ్బారావు ఆవిష్కరించారు.

మహనీయుల మాట



సంతృప్తి సహజ సంపద.
ఆడంబరం కృత్రిమ దారిద్ర్యం.
- సోక్రటీస్

సంపాదకీయం

# జైట్లీ ప్రేలాపనలు

కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంపైనా, దానికి నేతృత్వం వహిస్తున్న సిపిఎంపైనా కేంద్ర ఆర్థిక మంత్రి, బిజెపి సీనియర్ నేత చేసిన వ్యాఖ్యలు అనుచితం, విద్వేష పూరితం. వామపక్ష కార్యకర్తలు ఉగ్రవాదులని, కేరళ ఉగ్ర రాష్ట్రమని కేంద్ర మంత్రిగా బాధ్యతాయుత స్థానంలో ఉన్న వ్యక్తి నోటి నుంచి రావడం సహించరానిది. కొద్దిపాటి రాజకీయ పరిజ్ఞానం ఉన్న వారెవరికైనా జైట్లీ నరనరాన రాజకీయ ఉన్మాదాన్ని ఎక్కించుకున్నారని ఇట్టే అర్థమైపోతుంది. స్థానికంగా వ్యక్తిగతంగా ఏర్పడ్డ గొడవల్లో ఇటీవల హత్యకు గురైన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త రాజేష్ కుటుంబాన్ని పరామర్శించేందుకు జాతీయ మీడియాలోని సంఘ్ అనుకూల పాత్రికేయులను వెంటేసుకొని ఆదివారం కేరళలో జైట్లీ నిర్వహించన పర్యటనలో పరామర్శ పాలు వెంట్రుకవాసి కూడా లేదు. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కడానికే సరిపోయింది. వ్యక్తిగత వివాదాల్లో చనిపోయిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త కుటుంబం చెంతకు ఢిల్లీ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రి రావడంలోనే రాజకీయలబ్ధి వెంపర్లాట కనిపిస్తుండగా, ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై నిష్కారణంగా నిందలు మోపి జైట్లీ తన కుటిల లక్ష్యాన్ని తానంతట తానే బహితర్గతం కావించారు. ఆయన తన కేరళ పర్యటనకు ఎంచుకున్న సమయం సైతం రాష్ట్రంలో ఘర్షణలను నిరోధించే బదులు మరింతగా ఎగదోసేందుకు ఉద్దేశించింది. శాంతి స్థాపనకు, ఘర్షణల నిరోధానికి ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్వయంగా రంగంలోకి దిగి ఆదివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించగా ఘర్షణల నిరోధానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలకు అన్ని పార్టీలూ మద్దతు ఇచ్చాయి. సరిగ్గా అదే రోజున జైట్లీ కేరళకు వచ్చి లెఫ్ట్ సర్కారుపై నోటికొచ్చినట్లు మాట్లాడటం అసందర్భం. రాజేష్ చనిపోయింది స్థానిక కాలనీలో వివాదం వల్లనేనని ఇప్పటికే దర్యాప్తులో నిర్ధారణ అయింది. పోలీసులు అరెస్టు చేసిన నిందితుల్లో ఇద్దరు బిఎంఎస్, ఐఎన్‌టియుసి కార్యకర్తలు ఉన్నారు. కేరళలో కొన్ని మాసాలుగా జరుగుతున్నవి ఘర్షణలు కాదు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని చెప్పడానికి బిజెపీ, ఆర్‌ఎస్‌ఎస్ పరివారం సృష్టిస్తున్న హింసాకాండ అది. అందువల్లనే ఇప్పటివరకు అక్కడ మరణించిన వారిలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకన్నా ఎన్నో రెట్లు ఎక్కువ సిపిఐ(ఎం) కార్యకర్తలున్నారు. వాస్తవం ఇదికాగా మసిపూసి రాజకీయలబ్ధికి వాడుకోవాలనుకోవడం ముమ్మాటికీ దివాలాకోరుతనమే.

ఆహ్లాదకర ప్రకృతి సోయగాలకు, వామపక్ష, ప్రజాతంత్ర, అభ్యుదయ ఉద్యమాలకు, లౌకిక వాదానికి, అక్షర చైతన్యానికి పెట్టింది పేరు కేరళ. ఇక్కడ తన ఉనికి చాటుకోవాలని కొన్నేళ్లుగా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి చేయని కుట్ర లేదు. ఎన్ని కుయుక్తులు పన్నినా, దేశ వ్యాప్తంగా మోడీ ప్రభ వెలిగినా, కేంద్రంలో తమ ప్రభుత్వ అండ చూసుకొని పెట్రేగినా, ఏడాది క్రితం జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి ఒక్క స్థానంతో సరిపెట్టారు ప్రజలు. తన మతోన్మాద కుట్రలు సాగవని తెలిసినా లెఫ్ట్ ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు దొరికిన ప్రతి సాకునూ సంఘ్ వదలట్లేదు. తమపై అవినీతి మచ్చ లేదని మోడీ చెప్పుకుంటున్న సమయంలోనే ఆయన హయాంలోనే వైద్య కళాశాలల కుంభకోణంలో కేరళ బిజెపి నేతలు నిండా మునిగారు. ఈ కుంభకోణంపై పినరయి సర్కారు విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించింది. గతంలో వాజపేయి ప్రభుత్వంలోనూ పెట్రోలు బంకుల్లో బిజెపి నాయకుల లంచాల బాగోతం వెలుగు చూసింది. తమ అవినీతిని బయట పెట్టుకున్నది బిజెపిలోని ముఠాలే. వీటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి గొడవలు సృష్టిస్తోంది. లెఫ్ట్ అధికారంలోకొచ్చాక తమ కార్యకర్తలు హత్యకు గురయ్యారంటూ బిజెపి పెద్దలు వల్లిస్తున్న జాబితాలోని వారందరూ రాజేష్‌కుమల్లే స్థానిక వివాదాలతో చనిపోయారు తప్ప ప్రభుత్వ ప్రోత్సాహం వల్లనో, లేక సిపిఎం కార్యకర్తల వల్లనో సంభవించినవి కాదు. అయినా వామపక్షాలు హింసావాదులంటూ సంఘ్ ప్రచారం చేయడం దుర్మార్గం.

కేంద్రంలో బిజెపి వచ్చాక అన్ని రాష్ట్రాలనూ తన కిందకు తెచ్చుకునేందుకు 'దండయాత్ర' ప్రారంభించింది. తన మతతత్వ ఎజెండాతో కొన్ని రాష్ట్రాల్లో స్వంతంగా గెలవగా, ప్రజాతీర్పును కాలరాయడంద్వారా, ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా మరి కొన్నింటిని తన ఖాతాలో వేసుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ నేతలు రామ్‌మాధవరావు, మురళీధర్‌రావు వంటి వారు బహిరంగంగానే అన్ని రాష్ట్రాలూ తమ కిందకు తెచ్చుకుంటామని ప్రకటిస్తున్నారు. దక్షిణాదిలోనూ ఉనికి చాటాలని నిర్దేశించుకున్నారు. సంఘ్ లక్ష్యమైన హిందూరాష్ట్ర నిర్మాణానికి గోరక్షక దాడులు సహా అందివచ్చిన ప్రతి అంశాన్నీ నిచ్చెనలుగా వాడుకుంటున్నారు. ఈ కుట్రలను సిపిఎం ఎప్పటికప్పుడు సైద్ధాంతికంగా ఎదుర్కొంటోంది. లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలంటోంది. ఇది బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు కంటగింపుగా మారింది. కేరళలో ఘర్షణలను పురిగొల్పినా, ఢిల్లీలో సిపిఎం కేంద్ర కార్యాలయంపై దాడులు చేసినా, చివరికి ఒక రాష్ట్ర సిఎం అయిన పినరయి తలకు వెల కట్టినా, కేరళలో రాష్ట్రపతి పాలన పెట్టాలని రంకెలేస్తున్నా అందుకే. తనకు ప్రతిబంధకంగా తయారైన సిపిఎం, వామపక్షాలను దెబ్బతీసేందుకు వారి ప్రభుత్వాలున్న త్రిపుర, కేరళను బిజెపి, సంఘ్ పరివార్ తమ లక్ష్యాలుగా చేసుకున్నాయి. లౌకిక, ప్రజాతంత్ర వాదులు సంఘ్, బిజెపి కుట్రలను ముక్తకంఠంతో ఖండించాలి.


# ప్రత్యామ్నాయం చూపుతున్న కేరళ

చర్చ

**సంచారీ చటోపాధ్యాయ్**

రైతులు తిన్నారా? రెండు పూట్ల కాకపోతే ఒక పూటైనా! అసలు వారు ఉన్నారా, లేరా? ఎంతైనా ఉద్యమించండి, నిరసనల్లో ఆలుగడ్డలు, ఉల్లిపాయలు, పాలు ఎంత పెద్ద మొత్తంలోనైనా రోడ్ల పాలు చేయండి. పోలీసు తుపాకులు ఎన్ని ప్రాణాలనైనా హరించుగాక! ఇలా వ్యవసాయ సంక్షోభం వల్ల దేశవ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నా అవి చిరుదీపంలాగే మిగిలాయి. వీటిపై కేంద్రం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే కేంద్ర విధానాల పుణ్యమా అని దేశంలో ప్రతి రాష్ట్రం వ్యవసాయ సంక్షోభంతో కుదేలవుతున్నది. కాని సంక్షోభం నివారించాల్సిన కేంద్రం నిర్లిప్త ధోరణితో వ్యవహరిస్తోంది. దేశంలోని ఇతర నాలుగు రాష్ట్రాల్లాగే కేరళ కూడా ఇదే సంక్షోభాన్ని చవి చూస్తోంది. కాని మధ్యప్రదేశ్, మహారాష్ట్ర లాంటి బిజెపి పాలిత రాష్ట్రాల్లోని రైతులు ఏ స్థాయిలో ఆత్మహత్యలు చేసుకున్నారో, అలాంటి చిత్రం కేరళలో ఇంచుమించు దుర్లభం. ఈ అననుకూలత మధ్య కూడా కేరళ లోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వ్యవసాయ సంక్షోభ నివారణకు శాయశక్తులా కృషి చేస్తోంది.

వ్యవసాయ ప్రాధాన్యత గల మన దేశంలో 50 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారు. కానీ కాలం గడిచిన కొద్దీ కర్షకుల దుస్థితి తీవ్ర రూపం దాలుస్తోంది. పంట నష్టం, పంటకి సరైన ధర లేకపోవటం, రుణ మాఫీ చేయకపోవటం, అభివృద్ధి పేరిట సాగు భూమి కుదింపు వంటి వాటితో రైతుల కష్టాలు పెరుగుతూనే ఉన్నాయి. వారితో పాటే రైతు కూలీలు కూడా ఇదే ఊబిలో కూరుకుపోతున్నారు.



ఇటువంటి సంక్షోభ పరిస్థితికి ఎదురొడ్డి పోరాడుతోంది కేరళ. రైతుల పక్షాన నిలవటానికి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ఉంది. సౌకర్యాలు కల్పించడంలో శక్తి వంచన లేకుండా కృషి చేస్తోంది. రైతు కూలీలు, రైతుల స్వయం పోషణ, అభివృద్ధిని పెంచటానికి వివిధ రకాల చర్యలు తీసుకుంటోంది.

ప్రధానంగా ఆహారం కోసం కేరళ ఇతర రాష్ట్రాలపై ఆధారపడి వుంది. ఇంకా చెప్పాలంటే తృణ ధాన్యాలు, కూరగాయల కోసం కూడా ఆ రాష్ట్రం ఇతరులపై ఆధారపడాల్సిందే. దేశంలో ఇతర రాష్ట్రాలలాగే కేరళలో కూడా ప్రధాన ఆహారం వరి. కానీ వాస్తవానికి అవసరమైన దానిలో పదో వంతు ధాన్యం కూడా కేరళలో పండదు. ఉత్పత్తి పెరగకపోతే కేరళ స్వయం పోషణ కూడా పెరగదు. ముఖ్యంగా ధాన్యం పండించడానికి ఉత్పత్తి వైశాల్యం పెంచకపోతే స్వయం పోషక వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించటం కష్టం. ఇదే ఎల్‌డిఎఫ్ ప్రభుత్వపు ప్రాథమ్యం.

ఇంతకు ముందు అధికారంలో ఉన్నప్పుడు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కేరళలో 'ప్యాడీ ల్యాండ్ అండ్ వెట్ ల్యాండ్ కన్సర్వేషన్ యాక్ట్' (ధాన్యం మరియు తడి భూమి సంరక్షణ చట్టం) చేసింది. కానీ తర్వాత అధికారానికి వచ్చిన యుడిఎఫ్ ప్రభుత్వం దాన్ని పక్కకి నెట్టింది. దీనివల్ల ఉత్పత్తికి పనికొచ్చే భూమి పరిమాణం కుదించుకుపోతోంది. ఇప్పుడు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం మరలా ఆ చట్టాన్ని తిరగదోడింది. దీంతో వారు తలపెట్టిన తడి భూమి సంరక్షణ కార్యక్రమం ద్వారా సుమారు 4.27 హెక్టార్ల భూమి అందుబాటు లోకి వచ్చింది. ప్రస్తుతం ఉత్పత్తికి పనికొచ్చే భూమి పరిమాణం కూడా పెరిగింది. కేరళ లోని సిపిఐ(యం) నాయకత్వంలో ఉన్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఉత్పత్తిని పెంచటంలో విజయం సాధించింది. ఇంచుమించు మూడు వేల ఎకరాల మాగాణి, 15 వేల ఎకరాల మెట్ట భూమిలో ధాన్యం సాగవుతోంది. గత ప్రభుత్వం 'అరుణాముల'లో సుమారు 252 ఎకరాల భూమిని ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు కోసం ఆగం చేసింది. అయితే పరిసరాల పరిరక్షణకు కట్టుబడి ఉన్న కేరళ ప్రభుత్వం 'పథనామతిట్టా' జిల్లా లోని ఆ భూమిలో తిరిగి వ్యవసాయ పనులు మొదలుబెట్టింది. చట్ట విరుద్ధ భూ కబ్జాదారులు పర్యాటక, రియల్ ఎస్టేట్ పేరుతో 'అలెప్పీ'లో 'మేథరాన్ సరస్సు'ను ఆక్రమించుకున్నారు. ఈ 300 ఎకరాలు, 'రాని చిథిరా సరస్సు' తాలూకాలోని 500 ఎకరాల భూమి లోనూ అదే తరహాలో వ్యవసాయ పనులు మొదలయ్యాయి.

కేరళ అంతటా ప్రతి జలాశయం నుండి పూడిక తీయటానికి, వాటిని శుభ్రంగా ఉంచటానికి 'ద హరిత కేరళా మిషన్' అమలు చేసింది. నదులు, చెరువులు, సరస్సులు అన్నిటి విషయం లోనూ ఈ పథకం అమలు చేసింది. కేవలం తడి భూమిని శుభ్రపర్చటమే కాక గట్టిగా ఉన్న నేలలో పూడిక తీయటం, మురికి నీరు తరలించటం, ఉత్పత్తికి ఉపయోగపడేలా భూమి వైశాల్యాన్ని పెంచటం వంటివి ఈ పథకం పరిధిలో ఉన్నాయి. ఈ విధంగా పునరుద్ధరించిన భూమిలో కూరగాయలు పండిస్తున్నారు. రైతులను స్వయం పోషకులుగా మార్చే పనిలో ఇది కూడా ఒక భాగమే. దీంతో ఇప్పటికే వివిధ ప్రదేశాల్లోని సాగు భూమి, జలాశయాలు పునరుజ్జీవమయ్యాయి. అక్షరాస్యత విజన్, ప్రజాస్వామిక వికేంద్రీకరణ, సాధారణ ప్రజల ప్రణాళిక ఆధారంగా ఈ పథకంలో సామాన్య ప్రజల అనుసంధానాన్ని పెంచుతోంది. అయితే పండిన పంటకు మార్కెట్‌ను ఏర్పాటు చేయటం చాలా అవసరం. పంటకు సరైన ధర లభిస్తేనే వ్యవసాయ భూమిని పెంచటం సముచితమవుతుంది. అందు కోసం 'ఓనం, రంజాన్, క్రిస్టమస్' వంటి సామాజిక ఉత్సవాల్లో ప్రత్యేక మేళాలు జరిపి విస్తృతంగా ప్రచారం చేసింది. అంతేకాక ప్రత్యేక మార్కెట్లనూ ఏర్పాటు చేసింది. ఇంతే కాక పండగల సందర్భంలో ప్రతి పంచాయతీ ప్రాంతానికి ఒకటి చొప్పున ప్రత్యేక దుకాణం ఏర్పాటు చేసింది. వీటి ద్వారానే పంట అమ్మకం జరుగుతున్నది.

ఉత్పత్తి, అమ్మకం ఎంత ముఖ్యమో, రైతుల ఆదాయం సునిశ్చితం చేయటం కూడా అంతే ముఖ్యం. దేశం మొత్తం మీద రైతులు, వ్యవసాయ కూలీలకు ఏమాత్రం లాభసాటిగా కనపడటం లేదు. దీంతో కేరళ ప్రతి నెలా రైతుల కోసం రు.1100 పెన్షన్ పెంచింది. దాంతో పాటే ప్రకృతి వైపరీత్యాల్లో ధ్వంసమైన జిల్లాల్లో అనేక సార్లు రైతుల రుణం మాఫీ చేసింది. అంతేకాక పంట బీమా, ఆపద కాల సహాయ నిధి వంటి వాటిని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. దీనివల్ల ప్రకృతి వైపరీత్యాలలో నష్టపోయిన రైతులకు అవసరం మేరకు నష్ట పరిహారం ఇవ్వటానికి వీలుంటుంది. గిరిజన ప్రాంతపు రైతుల కోసం రు.20 కోట్లతో ఒక ప్రత్యేక పథకం అమలు చేశారు.ఇలా రైతులతో సంబంధం ఉన్న వారికి కనీస భత్యం, బీమా ఏర్పాటు చేయటానికి కేరళ ప్రభుత్వం ముందుకెళుతోంది. అదే సమయంలో ఒప్పందం ఆధారంగా వ్యవసాయ పనుల విషయంలో ప్రోత్సహిస్తోంది. దీంతో వ్యవసాయ సంబంధాలు మెరుగవుతాయి.


కేరళలో కూడా వ్యవసాయ భూమి లేకపోవటం, అన్యాక్రాంతం కావటం అనేది రైతులకు వున్న ఒక పెద్ద సమస్య. అక్కడ ఎంతోమంది రైతులకు ఇళ్ళు లేవు. దీంతో భూమి లేని, ఇల్లు లేని రైతులకు ఇళ్ళు నిర్మించేందుకు కేరళ ప్రభుత్వం నడుం బిగించింది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం మొదటి సంవత్సరం లోనే 20 వేల మంది రైతులకు భూమి ఇచ్చింది. రాబోయే నాలుగేళ్ళలో రాష్ట్రంలో ప్రతి రైతుకు ఇటువంటి ఏర్పాటు చేసేందుకు వారు చొరవ తీసుకుంటున్నారు. ★

# నంద్యాల ఎన్నికలు: ఆసక్తికర అంశాలు

**వి. శంకరయ్య**



సందర్భం



**నంద్యాల ఎన్నికల ఫలితాలు వచ్చాక తెలుగుదేశం పార్టీ నుండి గోడ దూకే వారు అధికంగానే వుంటారని భావించవచ్చు. మరో వైపు తెలుగుదేశం పార్టీ బిజెపితో అంటకాగుతోంది. కేంద్ర ప్రభుత్వం కర్రు గాల్చి ఎన్ని మార్లు వాత పెడుతున్నా అన్నింటిని భరించక తప్పని పరిస్థితి ఏర్పడింది.**



రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, పౌరహక్కులు ప్రమాదంలో పడ్డాయి. దళిత, పీడిత జనం నిరసన తెలిపే హక్కును సైతం కోల్పోయారు. జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటే వారిని అభివృద్ధి నిరోధకులుగా చిత్రించే దుష్ట విధానం అమలవుతోంది. తెలుగుదేశానికి ఓట్లు వేసినవారికి, దాని తీర్థం పుచ్చుకున్న వారికే ప్రభుత్వ పథకాలు అమలవు తున్నాయి. దళితులు, నిర్వాసితుల పక్షం నిలబడే వామపక్ష ప్రజాతంత్ర శక్తులపై పోలీసు జులుం ఎక్కువైంది. ఈ పూర్వరంగంలో నంద్యాలలో ఉప ఎన్నికలు వచ్చాయి.

నంద్యాల ఉప ఎన్నిక పలు కీలకాంశాలను తెర మీదకు తెచ్చింది. ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్వవచన విఘాతాలపై తీర్పు రావలసి వుంది. పలు రాజకీయ పరిణామాలకు కూడా సమాధానాలు లభించవలసి వుంది. ముఖ్యమంత్రి అవలంభిస్తున్న అప్రజాస్వామిక, అపసవ్య, అసమానతల విధానాలపై కూడా నంద్యాల ప్రజలు తీర్పు ఇవ్వవలసి వుంది. సాధారణంగా ఉప ఎన్నికలు అధికార పార్టీకి అనువుగా ఉంటాయి. అధికార గణం, డబ్బు కావలసినంత చేతిలో ఉంటుంది. అయినా నంద్యాల ఎన్నికల తీరు పరిశీలిస్తే ఈ పప్పులేమీ ఉడికేట్టు లేవు. ఆరు మాసాల క్రితం రాయలసీమ ఆరు జిల్లాల్లో రెండు పట్టభద్రుల నియోజక వర్గాల్లో ఎన్నికలు జరిగాయి, రెండు నియోజక వర్గాల్లో తెలుగు దేశం అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. అయినా ముఖ్యమంత్రికి కనువిప్పు కాలేదు. రాయలసీమలో వామపక్షాలకున్న బలమేమిటో ఈ ఎన్నికలు నిరూపించాయి. దీనికి తోడు తెలుగుదేశం ఎమ్మెల్సీ చక్రపాణి రెడ్డి రాజీనామాతో తెలుగుదేశం పార్టీ ఆత్మరక్షణలో పడింది. పార్టీ ఫిరాయింపులపై ప్రజల మనోభావాలకు సమాధానం నంద్యాలలో లభించవచ్చు. ఈ ఫిరాయింపులపై తెలుగుదేశం పార్టీ ఒక్క నంద్యాలకే కాక, రాష్ట్ర ప్రజలందరికి జవాబు చెప్పుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

2014 ఎన్నికల్లో ఏపిలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో 15 మంది మాత్రమే గెలుపొందారు. తెలంగాణలో కెసిఆర్ ప్రారంభించిన ఆటతో టిడిపి వికెట్లు ఒక్కొక్కటిగా పడిపోతూ చివరకు తెలుగుదేశం శాసన సభా పక్షం మొత్తంగా టి.ఆర్.ఎస్ లో విలీనమైంది. ఆ తరువాత జరిగిన జంట నగరాల ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచారం చేస్తూ పార్టీ ఫిరాయింపులను రాజకీయ వ్యభిచారం గానూ, తలసాని శ్రీనివాస యాదవ్‌కు మంత్రి పదవి ఇవ్వడం నీచమైన చర్యగానూ అభివర్ణించారు. జంట నగరాల ఎన్నికల ఫలితాలు అందరికి తెలిసిందే. అయితే సంవత్సరన్నర గడిచిందో లేదో ఒకనాడు తాను రాజకీయ వ్యభిచారంగా వర్ణించిన పార్టీ ఫిరాయింపులకు ముఖ్యమంత్రి చంద్రబాబు తెరదీశారు. ఈ అంశంలో తెలంగాణ ముఖ్యమంత్రి కె.సి.ఆర్ నీతి సూత్రాలు వల్లించక తను చేయదలుచుకొన్నది చేశారు. కానీ ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం అలా కాదు. ప్రతి రోజూ పారదర్శకత, విశ్వసనీయత, ప్రజాస్వామ్య నీతి సూత్రాలు చెబుతూ, చివరకు తాను తవ్వుకున్న ఇంకుడు గుంట బురదలో తనే పడ్డారు. ప్రతిపక్ష నేత జగన్ చెప్పారని కాదు కానీ రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులను ముఖ్యమంత్రి ప్రోత్సహించకుండా ఉంటే, వైఎస్ఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే గానే భూమా నాగిరెడ్డి మృతి చెంది వుంటే ఈ రోజు నంద్యాలలో ఉప ఎన్నికలు వచ్చేవే కావు.

ఆ కుటుంబానికి చెందిన వారెవరో ఏకగ్రీవంగా ఎన్నికయ్యేవారు. గతంలో ఈ సంప్రదాయం రాష్ట్రంలో వుంది. ఈ కథ ఇంతటితో ముగిసిపోలేదు. టిడిపి తరపున ఎమ్మెల్సీగా ఎన్నికైన చక్రపాణి రెడ్డి తెలుగుదేశం పార్టీకే కాకుండా ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయడంతో అసలు చిక్కు వచ్చి పడింది. తెలుగుదేశం పార్టీలో చేరి మంత్రి పదవులు పొందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతలు ప్రజల ముందు తలెత్తుకు తిరగడం సాధ్యం కాదనే భావన తెరమీదకు బలంగా వచ్చింది. నంద్యాల ఉప ఎన్నిక ఫలితాలు ఎలా వుంటాయో ఏమో గాని ఒకవేళ తెలుగుదేశం అభ్యర్థి ఓటమి పాలైతే... ప్రజాస్వామ్యంపై ఏమాత్రం విలువలు వున్నా పార్టీ ఫిరాయించి పదవులు పొందిన వారు రాజీనామా చేయక తప్పదు.

దీనికి తోడు రాష్ట్రంలో శాసనసభా స్థానాల పెంపుదల లేదని తేలిపోవడంతో తెలుగుదేశం నేతల్లో గుబులు ప్రారంభమైంది. దీన్నిబట్టి నంద్యాల ఎన్నికల ఫలితాలు వచ్చాక తెలుగుదేశం పార్టీ నుండి గోడ దూకే వారు అధికంగానే వుంటారని భావించవచ్చు. మరో వైపు తెలుగుదేశం పార్టీ బిజెపితో అంటకాగుతోంది. కేంద్ర ప్రభుత్వం కర్రు గాల్చి ఎన్ని మార్లు వాత పెడుతున్నా అన్నింటిని భరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంలో రాష్ట్ర విభజన చట్ట ప్రకారం వెనకబడిన జిల్లాలకు ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీకి ప్రాముఖ్యత ఏర్పడింది. నంద్యాల ఉప ఎన్నికలు ఇదే అంశాన్ని తెరమీదకు తెచ్చాయి. వెనకబడిన ఏడు జిల్లాలకు చట్టబద్ధంగా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక హోదాకు నీళ్లొదిలినట్లు వెనకబడిన జిల్లాల ప్రత్యేక ప్యాకేజీ అంశంలో కూడా నోరు మెదపడం లేదు. గతంలో ఈ తరహాలోనే యుపిఎ హయాంలో 2009-10 నుండి ఐదేళ్ల కాలానికి గానూ బుందేల్ ఖండ్‌కు రూ.7,226 కోట్లు ఖర్చు చేశారు. కానీ ఎపిలో అధికారం చేపట్టిన కొత్తల్లో ఐదేళ్లకు రూ.24,350 కోట్లు అవసరమని కేంద్రానికి లేఖ రాసి చేతులు దులుపుకొన్నారు. తిరిగి ఆ ప్రస్తావన లేదు. రాష్ట్రంలోని ఏడు జిల్లాలకు మూడేళ్లకుగాను రూ.1,050 కోట్లు విదిల్చిన కేంద్రం మిన్నకుండి పోయింది.

కేంద్రం నుండి వెనకబడిన ప్రాంతాలకు చట్టబద్ధంగా అందవలసిన నిధులు, రాయితీలు పొందడంలో విఫలమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నంద్యాలలో ఉప ఎన్నికలు వచ్చేసరికి రూ.1500 కోట్లు వ్యయం చేస్తున్నట్లు చెబుతున్నారు. మరి సీమ ప్రజల గతేం కాను? తుదకు కర్నూలు జిల్లా ప్రజలు ఈ అన్యాయాన్ని క్షమిస్తారా? అంతవరకైతే సరి. రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోంది. ముఖ్యమంత్రి ఏ జిల్లాకు వెళుతున్నా ఆ ప్రాంతంలోని వామపక్ష నేతలను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు.

ఇదిలా వుండగా రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బిజెపి వలలో పడింది. ప్రస్తుతానికి ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత ఇరువురు కమలనాథుల చెంత వున్నారు. ఇరువురి వ్యక్తిగత అవసరాలు అలాంటివి. అయితే ఇది ఎంతో కాలం సాగదు. ముఖ్యమంత్రి చంద్రబాబు బిజెపిని వదిలే సమస్యే లేదు. ఆయన అవసరాలు మరీ ఎక్కువ. 'కాళ్లు బట్టి లాగుతున్నా చూరుబట్టి వేలాడవలసిందే'. ప్రస్తుతం కమలనాథుల చెంత వున్నా వైఎస్ఆర్ కాంగ్రెస్ నేత వెనుతిరిగి రాక తప్పదు. అయితే ఈ పరిణామాల్లో నంద్యాల ఉప ఎన్నికల్లో మైనారిటీలు, దళితులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి. ఒక విధంగా నంద్యాల ఉప ఎన్నికలు పలు కీలకాంశాలకు గీటు రాయి కాబోతున్నాయి. అదే సమయంలో ప్రభుత్వ, ప్రతిపక్షాల మధ్య దూషణల పర్వం కూడా ఎక్కువగా ఉంది. సభకు హాజరైన జనాల్ని చూసిన విపక్షనేత జగన్ అత్యంత ఉత్సాహంతో ముఖ్యమంత్రిపై పరుష వ్యాఖ్యలు చేయడం కొసమెరుపు. మరో వైపు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా తన పార్టీ విధానం గురించి రెండు రోజుల్లో ప్రకటిస్తామని చెప్పారు.

రోజులు గడిచినా ఆ జాడ లేదు. పవన్ కళ్యాణ్ ఉద్దానం కిడ్నీ బాధితుల పక్షం కృషి చేయడం అభినందించదగ్గదే. కానీ గతంలో అనంతపురంలో బహిరంగ సభ పెట్టి చేసిన వాగ్దానాలు గాలికి పోయాయి. అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 34 శాతం వర్షపాతం లోటు వుంది. సాగు చేసిన పంటలు కూడా పక్షం రోజుల పాటు వర్షాలు లేకపోతే పూర్తిగా ఎండిపోతాయని రైతులు భావిస్తున్నారు. పంట సాగు కోసం రైతులు రూ.1500 కోట్లు వ్యయం చేసినట్లు అంచనా వేస్తున్నారు. ఇదంతా కూడా బూడిదలో పోసిన పన్నీరే. కానీ ముఖ్యమంత్రిని కలిసినప్పుడు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాయలసీమ దుర్భర పరిస్థితి గురించి ప్రభుత్వం అవలంబిస్తున్న అసమానతల వైఖరి గురించి ప్రస్తావించక పోవడం ఎంత వరకు సబబు? ప్రత్యేక హోదా గురించి బీరాలు పలికిన పవన్ కళ్యాణ్... ప్రత్యేక హోదాను కేంద్రం వద్ద తాకట్టు పెట్టిన చంద్రబాబుతో ప్రత్యేకంగా సమావేశం కావడం కూడా నూతన పరిణామంగా భావించాలి. ఈ నేపథ్యంలో నంద్యాల ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రజా తీర్పు ఎలా వుంటుందో వేచి చూడాలి. కానీ ప్రజాస్వామ్య ప్రియులు మాత్రం ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు గుణపాఠం నేర్పాలని కోరుతున్నారు.

**(రచయిత విశ్రాంత పాత్రికేయుడు),**
**సెల్: 9848394013.**

# అమెరికా నుండి 'అణు' పాఠం నేర్వాలి!

**బి.తులసీదాస్**




విశ్లేషణ

అమెరికా లోని దక్షిణ కరోలినా రాష్ట్రంలో సాగుతున్న వెస్టింగ్‌హౌస్ ఏ.పి.1000 అణు రియాక్టర్ల నిర్మాణాన్ని నిలిపి వేయాలని దక్షిణ కరోలినా ఎలక్ట్రిక్ & గ్యాస్ కంపెనీ (ఎస్‌సిఈ&జి) జూలై 31న ప్రకటించింది. నాలుగేళ్ళుగా నిర్మాణంలో ఉన్న ఈ రియాక్టర్లకు ఇప్పటికే 8.9 బిలియన్ డాలర్లు (రూ.56,900 కోట్లు) ఖర్చయింది. అయినా నిర్మాణాన్ని నిలిపి వేయాలని కంపెనీ నిర్ణయించింది. ఇప్పుడు నిర్మాణాన్ని నిలిపివేస్తే కనీసం 7 బిలియన్ డాలర్లు (రూ.44,800 కోట్లు) తమకు మిగులుతుందని ఎస్‌సిఈ&జి అధికార ప్రతినిధి మీడియాకు వెల్లడించడం కొసమెరుపు. ఏ వెస్టింగ్‌హౌస్ ఏ.పి.1000 రియాక్టర్లను శ్రీకాకుళం జిల్లా కొవ్వాడలో నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయో అదే రియాక్టర్ల నిర్మాణాన్ని అమెరికాలో మధ్యంతరంగా నిలిపివేశారు. ఇప్పటికైనా మన ప్రభుత్వాలు పునరాలోచించుకోవడం అవసరం.

**కరోలినా రియాక్టర్ల కథా కమామిషు**

దక్షిణ కరోలినా రాష్ట్రంలో కొలంబియా నగరానికి 32 కిలోమీటర్ల దూరంలోని జెన్‌కిన్స్‌విల్లే వద్ద ఒక్కొక్కటి 1200 మెగావాట్ల సామర్థ్యంతో రెండు ఏ.పి.1000 అణు రియాక్టర్లను నిర్మించాలని ఎస్‌సిఈ&జి 2008 మార్చి 27న అమెరికా ప్రభుత్వ న్యూక్లియర్ రెగ్యులేటరీ కమిషన్‌కు (ఎన్ఆర్‌సి) దరఖాస్తు చేసింది. సుదీర్ఘ ప్రక్రియ అనంతరం 2012 మార్చిలో నిర్మాణానికి అనుమతి లభించింది. రియాక్టర్లు 2017 నాటికి విద్యుదుత్పత్తి ప్రారంభిస్తాయని ఆనాటి అంచనా. అణు రియాక్టర్ల నిర్మాణాన్ని 2013 మార్చి 9న ప్రారంభించారు. రెండు రియాక్టర్లకు కలిపి 5.1 బిలియన్ డాలర్ల అంచనా వ్యయం. కానీ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది. ప్రధానంగా ఫుకుషిమా అణు విద్యుత్ ప్రమాదంలో జరిగిన వైఫల్యాలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన సాంకేతిక, నిర్మాణ చర్యల విషయంలో ఎన్ఆర్‌సి ఆదేశించిన విధంగా చేయడం కంపెనీకి కష్టతరమైపోయింది. అంతేగాక రోజులు గడుస్తున్న కొద్దీ, అదనపు భద్రతా చర్యలు చేపట్టేందుకు నిర్మాణ వ్యయం పెరుగుతూ వచ్చింది. ఈ నాలుగేళ్ళలో 8.9 బిలియన్ డాలర్లు ఖర్చయినా నిర్మాణం కేవలం 37 శాతం మాత్రమే పూర్తయింది. మిగిలిన పని పూర్తి కావడానికి మరో 11-12 బిలియన్ డాలర్లు (సుమారు రూ.76 వేల కోట్లు) అవసరమవుతుందని అంచనా వేశారు. అంటే ప్రాజెక్టు వ్యయం నాలుగు రెట్లు అదనంగా అవుతోంది. అణు విద్యుత్ రియాక్టర్ల నిర్మాణం కోసం ఆ కంపెనీ అక్కడి ప్రజల నుండి ఇప్పటికే 1.4 బిలియన్ డాలర్లు (రూ.8,960 కోట్లు) వసూలు చేసింది. ఆ డబ్బు ఏమవుతుందో చూడాలి.

అలాగే 2017కి విద్యుదుత్పత్తి ప్రారంభమవుతుందని అంచనా వేసుకున్నదల్లా 2022 ఫిబ్రవరి నుండి 2023 మార్చి మధ్యలో కావొచ్చునని తాజా అంచనా. నిర్మాణ వ్యయం పెరగడమేగాక మరోవైపు ఉత్పత్తి ఆలస్యం కావడం ఎస్‌సిఈ&జికి "గోడ దెబ్బ - చెంప దెబ్బ"లా అయ్యింది. అణు విద్యుత్



వ్యయం పెరుగుతుండగా ప్రపంచమంతటా సౌర, పవన విద్యుత్ చౌకగా లభిస్తోంది. అంతేగాక అమెరికా లోని ఇంధన విధాన చట్టం (2005) ప్రకారం అణు విద్యుత్‌కు భారీ సబ్సిడీలు ప్రభుత్వం ఇస్తోంది. ఆ రాయితీ 2025తో ముగిసిపోతుంది. కాబట్టి అణు విద్యుదుత్పత్తిలో ఎస్‌సిఈ&జికి లాభాలు రావు సరికదా నష్టాలు మూటగట్టుకోవాలి. అందుకనే అణు రియాక్టర్ల నిర్మాణాన్ని మధ్యంతరంగా నిలిపివేసింది. అమెరికా కంపెనీ వ్యాపారతత్వం అలాంటిది మరి! ఇప్పుడు నిర్మాణాన్ని నిలిపివేస్తే అయిదు వేల మందికి ఉపాధి పోతోందని, వారికి భృతి చెల్లించడం కష్టమవుతుందని ఆ రాష్ట్ర ప్రభుత్వం వాపోతోంది. దక్షిణ కరోలినా అనుభవం ఇది కాగా జార్జియా రాష్ట్రంలో ఇప్పటికి 44 శాతం నిర్మాణం పూర్తయిన మరో రెండు ఏ.పి.1000 అణు రియాక్టర్ల పరిస్థితి డోలాయమానంలో ఉంది. వాటి నిర్మాణం జరిపిస్తే 3.68 బిలియన్ డాలర్లు (రూ.23,550 కోట్లు) ఇస్తామని వెస్టింగ్‌హౌస్ మూల సంస్థ తోషిబా ఇప్పటికే ఆఫర్ చేసింది. అయినప్పటికీ అవి కూడా నిలిచిపోవచ్చునని నిపుణుల అభిప్రాయం.

**ఇక్కడ ఏం జరుగుతోంది?**

మన్మోహన్ - ఒబామా కుదుర్చుకున్న భారత అమెరికా అణు ఒప్పందాన్ని ఆనాడు వ్యతిరేకించిన మోడీ, చంద్రబాబు తాము అధికారానికి వచ్చాక మరింత వేగంగా అమలు చేస్తున్నారు. తొలుత గుజరాత్ లోని మితివిర్థిలో ఏర్పాటు చేయాలనుకున్న వెస్టింగ్‌హౌస్ అణు రియాక్టర్లను అక్కడి ప్రజల వ్యతిరేకించడంతో మోడీ ప్రభుత్వం దాన్ని ఆంధ్రప్రదేశ్‌కు బదలాయించింది. ప్రమాదకరమైన ఆ ప్లాంటు నిర్మాణాన్ని చంద్రబాబు ప్రభుత్వం నెత్తికెత్తుకుంది. గుజరాత్ ప్రజలు వ్యతిరేకించిన ప్లాంటు మన రాష్ట్రానికి మాత్రం నష్టకరం కాదా అన్న కనీస యోచన కూడా చేయలేదు. 'మీ కోసం' పాదయాత్ర సందర్భంగా రణస్థలం వచ్చిన చంద్రబాబు అణు విద్యుత్ కేంద్రం నిర్మాణాన్ని వ్యతిరేకించిన విషయం ఆయన ఒకవేళ మర్చిపోయినా ప్రజలకు ఇంకా గుర్తుంది. ప్రస్తుత రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి ఎచ్చెర్ల నియోజక వర్గానికి (కొవ్వాడ దాని పరిధిలోనే వుంది) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన ఎన్నికల ప్రచారంలో అణు విద్యుత్ కేంద్ర వ్యతిరేకత ఒక ప్రధాన అంశం. కానీ ఇప్పుడు 'కొవ్వాడ' నిర్మాణం పట్ల వల్లమాలిన శ్రద్ధ పెడుతున్నారు.

సి.టి స్కాన్ యంత్రం వంటి అణు ధార్మిక పరికరాల ఏర్పాటుకు సైతం ఎటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్‌బి) నుండి అనుమతి పొందాలి. అలాంటిది కొవ్వాడలో నిర్మించ తలపెట్టిన భారీ అణు విద్యుత్ ప్లాంటుకు ఇప్పటి వరకు ఏఈఆర్‌బి అనుమతి లేదు. కేంద్ర ప్రభుత్వ అటవీ పర్యావరణ శాఖ నుండి పర్యావరణ అనుమతి పొందలేదు. కనీసం సూత్రప్రాయ (ఇన్ ప్రిన్సిపుల్) అనుమతి కూడా లభించలేదు. అణు విద్యుత్ ప్లాంటు ప్రతిపాదిత గ్రామాలకు సంబంధించి భూసేకరణ చట్టం (2013) ప్రకారం సామాజిక ప్రభావ మదింపు, ఇతర నిబంధనలు అమలు చేయడం లేదు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూసేకరణతో సహా అనేక చర్యలను చేపట్టడం చట్ట విరుద్ధం, రాజ్యాంగ ఉల్లంఘన అవుతుంది. వెస్టింగ్‌హౌస్ కంపెనీ దివాళా ప్రకటించింది. ఎపి 1000 రియాక్టర్ల సాంకేతికతపై హక్కులు ఎవరికి బదలాయిస్తారో ఇంకా తేలలేదు. కొవ్వాడలో నిర్మించనున్న ప్లాంటుకు అణు రియాక్టర్లను ఎవరు సరఫరా చేస్తారు? అంచనా వ్యయం ఎంత? వంటి ప్రాథమిక వివరాలు కూడా ఇంకా ఖరారు కాలేదు. అయినా 'ఆలూ లేదు, చూలూ లేదు...' చందంగా కొవ్వాడలో ఎన్‌పిసిఐఎల్‌కు రాష్ట్ర ప్రభుత్వం 475 ఎకరాల భూమిని అప్పగించింది. నిర్వాసితులకు కాలనీలు కట్టిస్తానని ప్రభుత్వం హడావుడి చేస్తోంది. రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరం 12 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ మిగులు ఉందని విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ మార్చిలోనే నిర్ధారించింది. నెల్లూరు థర్మల్ ప్లాంటు లోని కొన్ని యూనిట్లతో సహా చాలా ప్లాంట్లలో విద్యుదుత్పత్తి నిలిపివేయడం లేదా నియంత్రించడం జరుగుతోంది. మిగులు విద్యుత్‌తో సమస్యలున్నాయని చెబుతున్న ప్రభుత్వం ఇంత భారీ అణు విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకోవడం ప్రజలను మోసగించడమే.

**ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయ్?**

సుమారు రూ.57 వేల కోట్లు ఖర్చు చేసినా అమెరికన్ కంపెనీ అణు రియాక్టర్ల నిర్మాణాన్ని నిలిపివేసిన నేపథ్యంలో తెలివిగలవారెవరూ ఆ దండగమారి అణు రియాక్టర్లను ఏర్పాటు చేయరు. కానీ బిజెపి ప్రభుత్వం, దానికి లొంగుబాటుగా వ్యవహరిస్తున్న తెలుగుదేశం ప్రభుత్వం కొవ్వాడ అణువిద్యుత్ ప్లాంటు నిర్మాణానికి ఉవ్విళ్ళూరడం అవివేకం.... కాదు కాదు అమెరికాకు దాసోహం కావడమే. కొవ్వాడలో అణువిద్యుత్ ప్లాంటు నిర్మించేది భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా. రియాక్టర్లను అమ్మేది అమెరికాకు చెందిన వెస్టింగ్‌హౌస్ కంపెనీ. కొవ్వాడలో అణు విద్యుత్ ప్లాంటు నిర్మిస్తే వెస్టింగ్‌హౌస్ రియాక్టర్లు అమ్ముడు పోతాయి కనుక వారికి లాభాలు వస్తాయి. కానీ నష్టాలొస్తే వాటిని ఎన్‌పిసిఐఎల్ అంటే భారత ప్రభుత్వం భరించాలి. మన ప్రజా ధనాన్ని అమెరికన్ కంపెనీకి అప్పనంగా అప్పగించే 'పవిత్ర' కర్తవ్యాన్ని మోడీ-బాబు జంట నిర్వర్తిస్తోందన్నమాట. కాదు... ఎన్‌పిసిఐఎల్ నష్టపోకూడదంటే ఎక్కువ ఖరీదు పెట్టి ప్రజలే అణువిద్యుత్‌ను కొనుగోలు చేసి జేబుకు చిల్లు పెట్టుకోవాలి. ఏది ఎలా వున్నా అమెరికన్ కంపెనీ లాభాలకు ఏమాత్రం ఢోకా రాదు. బిజెపి, టిడిపి ప్రభుత్వాలు ప్రజల ప్రయోజనాలకు, ప్రజా ధనానికి ముప్పు కలిగిస్తున్నాయన్నది ముమ్మాటికీ నిజం.

కొవ్వాడలో అణు విద్యుత్ ప్లాంటు నిర్మిస్తే అటు ఒరిస్సా లోని ఛత్రపూర్ మొదలు ఇటు కాకినాడ వరకు అణుధార్మిక ప్రమాదం వుంటుందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రమాదకరమైన అణు కుంపటి ఏర్పాటును ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. దక్షిణ కరోలినా, జార్జియా అనుభవాల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'అణు' పాఠం నేర్వడం అవసరం. 'కొవ్వాడ'ను విరమించుకోవడం అవశ్యం. ★

అర్ధరాత్రి...చండీఘడ్ నగరం... ఓ యువతిని ఇద్దరు యువకులు వెంబడిస్తున్నారు... తాగిన మత్తులో ఆ యువకుల ప్రవర్తనలో తనను అత్యాచారం చేయాలనే తలంపు ఉందని ఆమెకు అర్థమయ్యింది. ఆ క్షణంలో ఆమె మస్తిష్కం తాను నడుపుతున్న కారు కంటే వేగంగా ఆలోచించింది. తనను తాను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని దారుల్నీ ప్రయత్నించింది. ఎలాగైతేనేమి చివరికి ఆ విపత్తు నుండి బయటపడింది. అయితే ఆ క్షణం ఆమెను కదిలించింది.. ఓ ఐఏఎస్ కూతురిగా ఈ ఘటనని ఎదుర్కొని, బయటపడగలిగింది.. కానీ ఆ పరిస్థితులను ఓ సామాన్య స్త్రీ ఎదుర్కోలేదని అర్థం చేసుకున్న ఆమె జరిగిన ఘటనను సామాజిక మాధ్యమం ద్వారా ప్రపంచానికి బహిర్గతం చేసింది. ఆ సంఘటనలో ఆమె వేదనతో పాటు కొన్ని పాఠాలనూ నేర్చుకుంది. అదే అందరి అమ్మాయిలకూ చెప్తోంది...




# కాలనాగులు

అప్పటికి సమయం అర్ధరాత్రి 12.15 గంటలు కావస్తోంది. చండీఘడ్ నగరంలో శనివారపు ఛాయలు అలుముకుంటున్న వేళ... ఐఏఎస్ అధికారి కూతురైన వర్ణిక కుస్దు కారులో ఇంటికి వెళ్తోంది. ఆ దారిలోనే హర్యానా రాష్ట్ర బిజెపి ముఖ్య నాయకుని కుమారుడు వికాస్ బరాలా, అతని స్నేహితుడు ఆశిష్‌కుమార్ ఆమెను వెంబడిస్తున్నారు. ఇష్టారాజ్యంగా కారు నడుపుతూ ఆమెను వెంటాడుతున్నారు. వర్ణిక తప్పించుకోవడానికి ప్రయత్నించిన ప్రతిసారీ తమ కారుతో ఆమెను అడ్డగిస్తున్నారు.. అంతేకాకుండా అవకాశం దొరికితే ఆమె కారులో చొరబడటానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. ప్రాణభయంతో కంపించిపోతున్న ఆమె మొదట తల్లిదండ్రులకు ఫోన్ చేసింది.. తాను ఏ పరిస్థితుల్లో ఉందో వాళ్లకు తెలియజేసింది. ఆ తర్వాత రక్షణ కోసం 100కు ఫోన్ చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకునే సమయానికి అక్కడ పరిస్థితి విషమించే స్థాయికి చేరుకుంది. వర్ణికను అడ్డగించిన ఆ యువకులు ఆమె కారులోకి జొరబడటానికి కారు డోర్ తెరిచే ప్రయత్నం చేస్తున్నారు. అప్పుడే అక్కడికొచ్చిన పోలీసులు వెంటనే ఆ యువకుల్ని అరెస్ట్ చేశారు. ఐపిసి సెక్షన్ 354 డి, మోటారు వాహనచట్టం 185 కింద కేసు నమోదు చేసుకున్నారు. అయితే ఇక్కడా న్యాయం చతికిలబడింది. వెంటనే ఆ యువకులిద్దరూ బెయిల్‌పై బయటకి వచ్చేశారు.

**సంఘటన తర్వాత..**

వర్ణిక ఇంటికి చేరింది కానీ ఆమె ఎదుర్కొన్న సంఘటన నుంచి బయటకు రాలేకపోయింది. భయంతో ఆమె చేతులు పట్టుతప్పాయి. వెన్నులో వణుకు మొదలయ్యింది. సగం దేహం కన్నీటి పర్యంతమైతే మరో సగం తికమకలో తల్లడిల్లింది. ఎందుకంటే, ఈ రాత్రి ఆమె ఇంటికి చేరుకుంటుందో లేదో తెలియని పరిస్థితి. అలా తాను అనుభవించిన నరకయాతన ఫేస్‌బుక్ ద్వారా బహిర్గతం చేయాలనే సంకల్పంలో ఆ రాత్రంతా గడిచింది. ఆమె ఒక ఉన్నతాధికారి కూతురు గనుక ఆ ప్రమాదకర పరిస్థితి గురించిన సమాచారం పోలీసు ఉన్నతాధికారులకు చేరి, క్షణాల్లో వారు స్పందించారు. కానీ అందరికీ తనలాంటి అవకాశం ఉండదు. "ఒక సామాన్యుడి కూతుర్నైతే పరిస్థితి చేయి దాటిపోయేదేమో..." అన్న ఆమె అనుమానంలో నిజం లేకపోలేదు. ఎందుకంటే ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్న ఎందరో సామాన్య యువతుల మానప్రాణాలు ఛిద్రమైన సంఘటనలు కోకొల్లలు.

**ఈ ప్రశ్నల్లో న్యాయమెంత..?**

అయితే ఇలాంటి సంఘటనల్లో బాధిత స్త్రీనే విమర్శించడం ఈదేశంలో కొత్తేమీ కాదు. అందుకే వర్ణిక రాత్రి సమయంలో కారులో ఎందుకు ప్రయాణం చేస్తోంది? పక్కన ఎవ్వరూ రక్షణకు లేకుండా ఒంటరిగా ఎందుకు బయటకొచ్చింది? ఆమె మద్యం సేవించి ఉందా, లేదా? రాజకీయంగా సంబంధాలున్న ఆమె తండ్రి ఈ సందర్భాన్ని ఉపయోగించుకుని స్వప్రయోజనాన్ని పొందాలని అనుకుంటున్నాడేమో? తనను వెంబడించిన వారు వర్ణికకు పరిచయస్తులే..!? తన ఫేస్‌బుక్ ఫోటోల్లో ముద్దాయిలతో వర్ణిక దిగిన ఫోటోలు ఉన్నాయ్ కదా? వంటి అసందర్భ ప్రేలాపనలు ముందుకొచ్చాయి. జరిగిన సంఘటనలో తప్పుని కప్పిపుచ్చడానికి చాలా మస్తిష్కాలు పనిచేస్తుంటాయి. అయితే నెటిజన్లు అంతే ధీటుగా సమాధానాలు ఇవ్వడంతో సదరు పోస్టులు తొలగింపబడ్డాయి.


అయితే వర్ణిక ఇలాంటి వాటికి ముందుగానే స్పందించింది. "ఇకపై నేను మరింత జాగ్రత్తగా ఉంటాను. తిరిగి నా తల్లిదండ్రులకు ఇలాంటి పరిస్థితి కలగనివ్వను. ఎందుకంటే ఇకపై నా గురించి నాకంటే ఎక్కువగా వాళ్లే ఆలోచిస్తారు. అయితే ఇకముందూ నాకు నచ్చిన విధంగానే జీవిస్తాను. కేవలం ఇలాంటి ఆకతాయిల కోసం నా జీవితాన్ని చీకటిగదిలో బంధించుకోలేను. నేను రాత్రిళ్లు బయటకి వెళ్లాలనుకుంటే వెళతాను... అది నా ఇష్టం. స్త్రీవాదం కూడా చెప్పేది ఇదే... ఎందుకు నా జీవితాన్ని నేను అనుభవించకూడదు? నేను రాత్రిళ్లు ఎందుకు బయటకెళ్లానో అందరికీ నేనెందుకు చెప్పాలి? నేను ఎక్కడున్నానో నా తల్లిదండ్రులకు తెలుసు.." అంటూ ధైర్యంగా సమాధానం చెప్పింది.

**ఇదొక విషసంస్కృతి**

చాటుమాటున స్త్రీలపై దాడిచేసే సంస్కృతి పురాతన కాలం నుంచీ ఈ దేశంలో కనిపిస్తున్నదే. అది నిజజీవితంలో కావచ్చు.. లేదంటే సైబర్ స్పేస్‌లో కావచ్చు. లైంగికపరమైన హాని కలిగించే ఉద్దేశంతో ఇలాంటి దాడులు నిత్యకృత్యం కావడం దాచేస్తే దాగని సత్యం. ఇటువంటి సంఘటనలకు మొదటి ముద్దాయిగా సినిమా ప్రభావాన్ని చూపించడం పరిపాటిగా మారింది. ఎందుకంటే ఇక్కడ ప్రేమ, వ్యామోహాలకు ప్రతిస్పందించే విపరీత ధోరణులను సమర్థించే సంస్కృతి ప్రచారంలో ఉంది. 2015 లెక్కల ప్రకారం దేశ రాజధాని ఢిల్లీలో 1124 మంది ఐపిసి 354డి కింద ఫిర్యాదులు ఇచ్చారు. ఇవి దేశం మొత్తంమీద నమోదైన కేసుల్లో 18 శాతం. అంటే అన్ని కేంద్రపాలిత ప్రాంతాల నుంచి నమోదైన ఇలాంటి ఫిర్యాదుల్లో 97 శాతం వంతు దేశ రాజధాని నుంచే కావడం జీర్ణించుకోలేని కఠిన వాస్తవం. స్త్రీలపై వ్యామోహంతో కొంతకాలం వారిని అనుసరించడం.. అవకాశం చిక్కినప్పుడు వారి మానప్రాణాలతో ఆడుకోవడం.. ఇలాంటి సంఘటనలు ఇటీవల మరింత పెరిగిపోతున్నాయి. అయితే లైంగిక వాంఛల్ని తీర్చుకునే క్రమంలో దొంగతనంగా స్త్రీలను అనుసరించడం మూడేళ్లకు ముందు భారతదేశంలో పెద్ద నేరంగా పరిగణించలేదనే చెప్పాలి. 2013 ఫిబ్రవరిలో నిర్భయ కేసు అనంతరం పరిస్థితి మారింది.

**- జీవన డెస్క్**

## తండ్రిగా ఓడిపోను!




వర్ణిక తండ్రి కూడా ఈ సంఘటనపై సామాజిక మాధ్యమంలో స్పందించాడు. "ఇలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడే గూండాలు పలుకుబడి ఉన్న కుటుంబాలకు సంబంధించిన వాళ్లయితే చాలా సందర్భాల్లో వారిపై కేసులే నమోదుకావు. ఒకవేళ నమోదైనా వాళ్లకు శిక్షపడదు. పరపతి ఉన్నోళ్లను ఎదుర్కోవడానికి చాలా మంది ముందుకు రాకపోవడం కూడా ఈ పరిస్థితుల్ని కల్పిస్తాయి. అంతేకాదు నాలాంటి ఉన్నతస్థాయి అధికారులూ ఇలాంటివారిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండరు. కానీ ఈ పరిస్థితుల్లో నేను నా కూతురికి అండగా లేకపోతే, ఒక తండ్రిగా నేను ఓడిపోయినట్లే..!" అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.

**- వీరేంద్ర సింగ్ కుస్దు**

## ఇదే నా సలహా!



వర్ణిక తానెదుర్కొన్న సంఘటన నుంచి బయటపడలేకపోతున్నా, తనలాంటి పరిస్థితి ఏర్పడినప్పుడు స్పందించాల్సిన మార్గాలను తెలియజేసింది. "స్త్రీలంతా తమ రక్షణ గురించి జాగురూకులై ఉండాలి. మిమ్మల్ని వెంబడిస్తున్న వాహనం నెంబరు నోట్ చేసుకోవాలి. మొదటి క్షణంలోనే భయపడకుండా పోలీసులకు సమాచారాన్ని అందించాలి. మీ తల్లిదండ్రులకు కాల్ చేసి, మీరు ఎక్కడ ఉన్నదీ, ఎలాంటి పరిస్థితిల్లో ఉన్నదీ తెలియజేయాలి. సాధ్యమైనంత వరకూ అక్కడి నుండీ తప్పించుకుని, మిమ్మల్ని మీరు రక్షించుకునే దిశవైపు దృష్టిపెట్టాలి. నీ జీవితమే అత్యున్నతమైంది! దాన్ని కాపాడుకునే క్రమంలో చేతికి దొరికిన ఎలాంటి వస్తువునైనా బలమైన ఆయుధంగా ఉపయోగించాలి. సాధ్యమైనంత వరకూ ఏదో ఒక ఆయుధాన్ని మీతో ఉంచుకోవడంలో చాలా భద్రత ఉంటుందని గమనించండి.." అని స్త్రీలకు సలహా ఇస్తోంది.



## మనసులో మాట!



అమ్మాయికైనా అబ్బాయికైనా వారి బెస్ట్‌ఫ్రెండ్స్ తల్లిదండ్రులే. మన మనసులోని భావాలను కూడా వారు తెలుసుకోగలరు. అలాంటివారి దగ్గరా కొన్ని విషయాలను దాచిపెడుతుంటాం. అలా దాచిపెట్టిన విషయాలను ధైర్యంగా బయటపెట్టండి అంటున్నారు కొందరు. అందుకు 'క్వారా' పేరుతో ఉన్న ఓ వెబ్‌సైట్ వేదికైంది. అలాంటి విషయాలను తల్లిదండ్రులకు షేర్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఇంతవరకు ఎవరికీ తెలియకుండా దాచిన విషయాలు, ఎవ్వరికీ చెప్పలేని రహస్యలను క్వారా వెబ్‌సైట్ ద్వారా పంచుకోవచ్చు.

**నా వంతుగా..!**

ఈరోజు ఎవరి రహస్యాన్ని అయితే ముందుకు తెచ్చామో అతని పేరు షవన్ చౌదరి. ఆయన ఓ క్వారా యూజర్. మనసును హత్తుకున్న ఆయన జీవిత అనుభవాలు మనతో పంచుకున్నారు. 'మా అమ్మ ఎప్పుడూ నన్ను అడుగుతూ ఉంటుంది. భవిష్యత్తు కోసం ఏమైనా సేవింగ్స్ చేస్తున్నావా? అని. మా నాన్న నాకెప్పుడూ ఓ సలహా ఇస్తుంటారు. మధ్యతరగతి కుటుంబానికి సేవింగ్స్ అనేవి చాలా ముఖ్యమైనవి. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఆ సేవింగ్స్ మనకి ఉపయోగపడతాయని చెబుతుంటారు. నేను ఏడాదిగా జాబ్‌చేస్తున్నాను. కానీ, నెలచివరిలో జేబులో ఒక్కరూపాయి ఉండడం లేదు. నిజంగానే నెల చివరి రోజుల్లో భవిష్యత్ కోసం నా దగ్గర ఎటువంటి సేవింగ్స్ లేవని గుర్తుకొస్తూ ఉంటుంది. అనవసరమైన వాటికి నేను డబ్బు ఖర్చు చేస్తుంటానని నా తల్లిదండ్రులు అనుకుంటుంటారు. కానీ, నాకు ఎలాంటి చెడు అలవాట్లూ లేవు. గతేడాది నుంచి నేను నా మనసుకు నచ్చిన పనికోసం కొంత డబ్బును ఖర్చు చేస్తున్నాను. ' దగ్గరలోని స్లమ్ ఏరియాలో ఉండే చాలామంది పిల్లలు స్కూల్‌కు వెళ్లడం లేదన్న విషయం తెలియగానే నేను చాలా ఆశ్చర్యానికి గురయ్యాను. అక్కడి పిల్లలు స్కూల్‌కి వెళ్లాలనేది నా కోరిక' అంటున్నారు షవన్.

**ఏడుపే ఎక్కువగా ఉంది**

అందులో భాగంగా అక్కడి పిల్లలను షవనే స్వయంగా స్కూల్‌లో జాయిన్ చేయించాడు. వారి స్కూల్ ఫీజులను కూడా తనే కడుతున్నాడు. వారికోసం స్టేషనరీ ఐటమ్స్ అన్నీ కొనిస్తున్నాడు. ఇలాచేయడం వలన తనెంతో సంతోషంగా ఉన్నానని అంటున్నాడు షవన్. ఈ విషయం గురించి షవన్ తన తల్లిదండ్రులకుగానీ, కుటుంబసభ్యులకుగానీ చెప్పలేదు. షవన్ తన శాలరీతో ఆ పేదపిల్లలకు డబ్బులు ఖర్చుచేస్తున్నాడని తన తల్లిదండ్రులకు చెప్పాలనుకుంటున్నాడు. ఈ పోస్టు పెట్టడానికి ముందే తను చదివించే పిల్లల్లో ఒకరి తల్లి షవన్‌కు ఫోన్ చేసింది. "షవన్ అన్నా..! నా కూతురు సదియా క్లాసులో ఫస్టు వచ్చింది" అని చెప్పింది. సదియా తల్లి తన కూతురు ఫస్ట్ వచ్చిన విషయం షవన్‌తో ఏడుస్తూ ఫోన్లో చెప్పింది. ఆమె మాటలకంటే ఏడుపే ఎక్కువగా వినిపించింది షవన్‌కి. ఆ విషయం వినగానే షవన్ కొద్దిసేపు అలాగే మౌనంగా ఉండిపోయాడు. ఎందుకంటే, తన సంతోషాన్ని ఎవరితో పంచుకోవాలో అర్థం కాలేదు. "ఆ సందర్భంలో నేనెంత సంతోషంగా ఉన్నానంటే మాటల్లో చెప్పలేను" అని అంటున్నాడు.

**అమ్మానాన్న.. నన్ను క్షమించండి!**

ఆ సంతోషంతోనే రూమ్‌కి బయలుదేరాడు. ఓ కప్పు చాయ్ తాగుతూ బాల్కనీ నుంచి కిందికి చూశాడు. ఓ నాలుగైదు సంవత్సరాల పాప చెత్త ఏరుకుంటూ, బిచ్చమెత్తుకుంటూ కనిపించింది. ఆ పాప బట్టలు చాలా మురికిగా, చినిగిపోయి ఉన్నాయి. చెప్పులు కూడా వేసుకోకుండా అలాగే నడుస్తుంది. నిజం చెప్పాలంటే పిల్లలు బొమ్మలతో ఆడుకుంటూ బిజీగా గడపాల్సిన వయసది. కానీ, ఆ పాప తన పొట్ట నింపుకోవడం కోసం పడుతోన్న కష్టం చూడలేకపోయాడు. ఒక్కపూట తినడానికి తిండి లేని పిల్లలు స్కూల్‌కు ఎలా వెళతారు? అనే ప్రశ్న మళ్లీ షవన్ మదిలో మెదిలింది. అంత చిన్న పాపను అలాంటి పరిస్థితుల్లో చూసి షవన్ మనసు చలించిపోయింది.



"అమ్మానాన్న! నన్ను క్షమించండి. కేవలం నా భవిష్యత్తు కోసం మాత్రమే ఆలోచించే బాధ్యత గల వ్యక్తిగా నేను ఎప్పటికీ కావాలని అనుకోవడం లేదు. నాకు నచ్చిన ఈ పయనాన్ని కొనసాగిస్తాను" అంటూ షవన్ పెట్టిన ఈ చిన్న పోస్టు ద్వారా ఓ మంచి సందేశాన్ని ఈ ప్రపంచానికి చేరవేశాడు.

మనదేశంలో ఆకలిమంటలు, నిరక్షరాస్యత పెరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి ఉరుకుల పరుగుల జీవితంలో, ఇతరుల కంటె ముందుండాలనే రేస్‌లో పాల్గొనడమే అందరికీ సరిపోయింది. ఇక, ఇలాంటి పిల్లల్ని ఎవరు పట్టించుకుంటారు చెప్పండి? కానీ, దేశభవిష్యత్తు అంధకారంలో పోతుందన్న విషయం మాత్రం ఎవరికీ పట్టడం లేదు. దేశంలోని ప్రతి ఒక్క యువకుడు ఒక పేదపిల్లవాడి బాధ్యతను తీసుకుంటే రేపటి ఉజ్వల భవిష్యత్తును చూస్తామేమో అనిపిస్తుంది. దాంతో పాటు అక్షరాస్యత దేశాన్నీ చూడొచ్చు.

**- అమల తిలారు**

**(రాశీ, గజబ్ పోస్ట్ ఆధారంగా..!)**

## జీవన సౌరభం

**ఇచ్చింది మర్చిపోవడం.. పుచ్చుకున్నది జ్ఞాపకం ఉంచుకోవడమే నిజమైన స్నేహం..**



## మీ కోసం

**కొత్తిమీరలో ఉండే 'కె' విటమిన్ వయసు మళ్లిన తరువాత వచ్చే మతిమరుపు వ్యాధి నియంత్రణలో కీలకంగా పనిచేస్తుంది. కొవ్వును కరిగించే విటమిన్లూ, యాంటీ ఆక్సిడెంట్లూ దీనిలో అధికంగా లభిస్తాయి.**

సెన్సెక్స్ ▼ 52 32,273 | నిఫ్టీ ▼ 09 10,057 | రూపాయి ▼ 22 పైసలు ఒక అమెరికా డాలరుకు రూ. 63.80

## అమర రాజాకు వ్యయ భారం

### క్యూ1 లాభాల్లో 24% క్షీణత

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ బ్యాటరీల తయారీ కంపెనీ అమర రాజా బ్యాటరీస్ 2017 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో నిరుత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ముడి సరుకుల భారంతో పాటు ఇతర వ్యయం కూడా పెరగడంతో లాభాల్లో తగ్గుదల చోటు చేసుకుంది. దీంతో కంపెనీ లాభాలు 23.58 శాతం తగ్గి రూ.99.85 కోట్లుగా నమోదయ్యాయి. 2016 ఇదే త్రైమాసికంలో ఏకంగా రూ.130.53 కోట్ల లాభాలు సాధించింది. క్రితం క్యూ1లో కంపెనీ మొత్తం ఆదాయం 15 శాతం పెరిగి రూ.1,686.96 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,465.28 కోట్ల ఆదాయం ఆర్జించింది. గత జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ మొత్తం వ్యయం కూడా 20.37 శాతం ఎగిసి రూ.1,534.24 కోట్లకు చేరింది. గతేడాది ఇదే క్యూ1లో రూ.1,274.53 కోట్ల వ్యయం చోటు చేసుకుంది. క్రితం త్రైమాసికంలో ముడి సరుకుల ధరలు కూడా 25 శాతం పెరిగాయి. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వల్ల తమ మార్కెట్ వాటా మరింత పెరగనుందని అమర రాజా బ్యాటరీస్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ఛైర్మన్ జయదేవ్ గల్లా విశ్వాసం వ్యక్తం చేశారు. సోమవారం బిఎస్‌ఇలో అమర రాజా బ్యాటరీస్ షేర్ ధర 2.10 శాతం పెరిగి రూ.822.55 వద్ద ముగిసింది.

## నాట్కో ఫార్మాకు లాభాలు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ప్రముఖ ఔషద ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మా 2017-18 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గత క్యూ1లో ఈ కంపెనీ లాభాలు రెట్టింపై రూ.93.7 కోట్లకు చేరాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.47.5 కోట్ల లాభాలు నమోదు చేసుకుంది. క్రితం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ 30 శాతం పెరిగి రూ.448.7 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.345.5 కోట్ల రెవెన్యూ ఆర్జించింది.కాగా 2017-18కి గాను మధ్యంతర డివిడెండ్ కింద ప్రతీ రూ.2 ముఖ విలువ కలిగిన షేర్‌పై రూ.1.25 మధ్యంతర డివిడెండ్ అందించడానికి ఆ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. అదే విధంగా కంపెనీ ఇండిపెండెంట్ డైరెక్టర్ బిఎస్ బజాజ్ రాజీనామాను ఆమోదించింది. ఆర్అండ్‌డి ప్రెసిడెంట్, డైరెక్టర్ ఎకెఎస్ వ్యక్తిగత కారణలతో వైదొలిగినట్లు ఆ కంపెనీ తెలిపింది. సోమవారం బిఎస్‌ఇలో నాట్కో ఫార్మా షేర్ 1.22 శాతం పెరిగి రూ.960.80 వద్ద ముగిసింది.

## మహీంద్రా ఛైర్మన్ వేతనంలో 16% పెంపు

**ముంబయి :** ప్రముఖ దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర వేతనం భారీగా పెరిగింది. 2015-16తో పోలిస్తే గతేడాది మహీంద్రా జీతం 16.38 శాతం పెరిగి ఏడాదికి దాదాపు రూ.8 కోట్లకు చేరింది. 2016-17లో 7.67 కోట్ల రూపాయల జీతం తీసుకున్నారని ఆ కంపెనీ పేర్కొంది. తమ మధ్యస్థ ఉద్యోగుల వేతనాల కంటే ఇది 108.27 శాతం ఎక్కువ అని పేర్కొంది. ఇక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పవన్ గోయెంకా రూ.7.39 కోట్లు వేతనం అందుకున్నారు. పవన్ వేతనం 15.86 శాతం పెరిగింది. 2016-17లో సంస్థ ఉద్యోగుల సగటు వేతనం రూ.7.08 లక్షలు. ఈ ఆర్థిక సంవత్సరంలో, ఉద్యోగుల సగటు వేతనం లో 0.43 శాతం పెరిగింది.

# ఎటిఎంల విస్తరణకు చెల్లు..!

- నోట్ల దెబ్బతో తగ్గిన ఏర్పాటు
- నగదు కొరతతో పాత వాటిపైనే దృష్టి




**ముంబయి :** మోడీ సర్కార్ ముందు చూపు లేకుండా తీసుకున్న పెద్ద నోట్ల రద్దు చర్య వల్ల కొత్త ఎటిఎం కేంద్రాల ఏర్పాటు భారీగా తగ్గిపోయింది. గతేడాది నవంబర్ 8న కేంద్రం తీసుకున్న రూ.500, రూ.1000 నోట్ల రద్దు నిర్ణయం వల్ల ఏర్పడిన నగదు కొరత వల్ల ఎటిఎంల విస్తరణపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా బ్యాంకు ఆవరణలో (ఆన్‌సైట్) ఉండే ఎటిఎంలతో పోల్చితే ఇతర ప్రదేశాల్లో (ఆఫ్ సైట్) ఏర్పాటు చేసే ఎటిఎంల సంఖ్య భారీగా తగ్గిందని ది హిందూ ఒక కథనంలో వెల్లడించింది. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గణంకాల ప్రకారం జూన్ 2017 నాటికి ఆఫ్ సైట్ ఎటిఎం సంఖ్య 98,092కు పడిపోయింది. 2016 ఇదే కాలం నాటికి ఈ సంఖ్య 99,989గా ఉంది. కాగా ఆన్‌సైట్ ఎటిఎంల సంఖ్య మాత్రం స్వల్పంగా పెరి గింది. ఈ ఏడాది జూన్ నాటికి ఆన్‌సైట్ ఎటిఎంల సంఖ్య 1,10,385కి చేరింది. గతేడాడాది ఈ సంఖ్య 1,01,346గా ఉంది.

**నగదు కొరత దెబ్బ..**

నోట్ల రద్దు తర్వాత బ్యాంకులు పెద్దఎత్తున నగదు సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. మరోవైపు ఉన్న ఎటిఎంల్లోనూ ఇప్పటికీ డబ్బులు లేకపోవడం గమనార్హం. ఈ ప్రభావం ఎటిఎం కేంద్రాల విస్తరణపై తీవ్రంగా పడింది. నోట్ల రద్దు వల్లే ఈ పరిస్థితి చోటు చేసుకున్న విషయం వాస్తవమేనని ఓ బ్యాంకు సీనియర్ అధికారి పేర్కొన్నారు. ప్రస్తుత నగదు కొరత వల్ల ఉన్న వాటిపైనే దృష్టి సారిస్తున్నామన్నారు. నవంబర్ నుంచి నగదు సరఫరా తగ్గడంతో కొత్త ఎటిఎంల ఏర్పాటును తగ్గించాలని నిర్ణయించుకున్నామన్నారు. జూన్ 2016 నుంచి జూన్ 2017 మధ్య దాదాపుగా 7,000 కొత్త ఎటిఎంలను ఏర్పాటు చేశారు. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో ఏకంగా దాదాపు 16,000 ఎటిఎం కేంద్రాలను నెలకొల్పారు. ఇంతకంటే ముందు ఏడాది ఏకంగా 18,500 కొత్త ఎటిఎం కేంద్రాలను అందుబాటులోకి తెచ్చాయి. జూన్ 2017 ముగింపు నాటికి భారత్‌లో మొత్తంగా 2,08,477 ఎటిఎం కేంద్రాలకు పెరిగాయి. గతేడాది ఇదే కాలం నాటికి దేశంలో 2,01,335 ఎటిఎం కేంద్రాలున్నాయి.

**ఎస్‌బిఐ మాత్రమే..**

గతేడాది కాలంగా ప్రముఖ ప్రయివేటు రంగ బ్యాంకులు ఐసిఐసిఐ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుల ఆఫ్‌సైట్ ఎటిఎం కేంద్రాల సంఖ్యలో తగ్గుదల చోటు చేసుకుంది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆఫ్‌సైట్ ఎటిఎం కేంద్రాలు 6,391 నుంచి 5,845కు తగ్గాయి. ఐసిఐసిఐ బ్యాంకు ఎటిఎంలు 9,274 నుంచి 8,639కి కుదించబడ్డాయి. కాగా భారత్‌లో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎస్‌బిఐలో మాత్రం ఎటిఎంల సంఖ్య పెరిగింది. భారతీయ మహిళా బ్యాంక్ సహా ఇతర అనుబంధ బ్యాంకులను ఎస్‌బిఐలో వీలినం చేయడమే ఇందుకు కారణం.

**కావాలనే..!**

కేంద్ర ప్రభుత్వం డిజిటల్ లావాదేవీలకు ప్రాధాన్యత పెంచాలన్న లక్ష్యంలో భాగంగా ఎటిఎం కేంద్రాల్లో నగదు కొరతను సృష్టిస్తున్నారని నిపుణులు పేర్కొంటున్నారు. ఇదే కోణంలో బ్యాంకులు కూడా ఎటిఎంల విస్తరణను తగ్గుముఖం పట్టించాయి. ఇదే విషయాన్ని ఓ బ్యాంకు అధికారి కూడా నిర్ధారించారు. మరోవైపు తక్కువ వినిమయం కలిగిన పలు ఎటిఎం కేంద్రాలను ఇతర ప్రాంతాలకు తరలించారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత నగదు లభ్యత పడిపోయిందని ఎటిఎంల తయారీ కంపెనీ ఎన్‌సిఆర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నవ్‌రోజ్ దస్తూర్ పేర్కొన్నారు. ఈ ప్రభావం మార్కెట్‌పై తప్పకుండా పడిందన్నారు. దేశంలోని బ్యాంకులకు దాదాపుగా సగం వరకూ ఎటిఎంలను ఈ కంపెనీనే అందిస్తుంది. ఇప్పుడున్న అత్యధిక ఎటిఎం మిషన్లను గత ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసినవేనని దస్తూర్ పేర్కొన్నారు. వీటి టెక్నలాజీకి కాలం చెల్లిపోతుందన్నారు.

| ఎటిఎంల విస్తరణ | జూన్ 2014 | జూన్ 2015 | జూన్ 2016 | జూన్ 2017 |
|---|---|---|---|---|
| ఆన్‌సైట్ | 87,925 | 92,200 | 1,01,346 | 1,10,385 |
| ఆఫ్‌సైట్ | 78,969 | 93,284 | 99,989 | 98,092 |
| మొత్తం | 1,66,894 | 1,85,484 | 2,01,335 | 2,08,477 |
| తేడా | | 18,590 | 15,851 | 7,142 |

## లగ్జరీ కార్లపై సెస్సు పెంపు

**న్యూఢిల్లీ :** స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్(ఎస్‌యువి), మధ్యస్థాయి, లగ్జరీ కార్లపై ప్రస్తుతం 15 శాతం సెస్సు అమల్లో ఉండగా, దీన్ని 25 శాతానికి పెంచడానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. జిఎస్‌టి భాగంలో కొత్త పన్నుల విధానంలో కార్లపై 28 శాతం పన్ను విధించారు.

జిఎస్‌టి అమల్లోకి తెచ్చిన తొలుత ఈ కార్లపై సెస్‌తో కలుపుకుని 43 శాతం పన్ను అమల్లో ఉంది. దీన్ని తాజాగా 53 శాతానికి పెంచినట్లయ్యింది. 'ఆగస్టు 5న జరిగిన జిఎస్‌టి 20వ కౌన్సిల్ సమావేశంలో మోటార్ వాహనాలపై సెస్సు పెంచాలన్న ప్రతిపాదనకు ఆమోదం లభించింది.

## రూ.799కే విమానయానం




**ముంబయి :** ప్రముఖ విమానయాన సంస్థ విస్తారా 'ఫ్రీడం సేల్' పేరుతో భారీ డిస్కౌంట్లతో రెండు రోజుల అమ్మకాలను ప్రకటించింది. ఎంపిక చేసిన ప్రాంతాలకు ప్రారంభ ధర రూ.799 నుంచి విమానయానం అందిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని పేర్కొంది. అయితే ఇది ఒక వైపు వెళ్లడానికి (వన్ వే) మాత్రం వర్తిస్తుందని షరతు విధించింది. ఆగస్టు 8-9 తేదీల్లో ఈ బుకింగ్ సదుపాయం అందుబాటులో ఉంటుంది. కాగా ఆగస్టు 23 నుంచి ఏప్రిల్ 19 మధ్యకాలంలో ప్రయాణించేందుకు ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఎకానమీ క్లాస్ టికెట్‌ను కేవలం రూ. 799లకు, ప్రీమియం ఎకానమీ టికెట్లను రూ. 2,099 ధరల్లో అందిస్తోంది. ఈ పథకంలో భాగంగా గోవా, పోర్ట్ బ్లెయిర్, లడఖ్, జమ్మూ, శ్రీనగర్, కొచ్చి, గౌవతి, అమత్సర్, భువనేశ్వర్, ఢిల్లీ, కోల్‌కతా, ముంబయి, హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల మధ్య ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు ఆ కంపెనీ పేర్కొంది. ముందు బుక్ చేసుకున్న వారికి తొలి ప్రాధాన్యత ఆధారంగా టికెట్లను కేటాయిస్తామని స్పష్టం చేసింది.


## టాటా స్టీల్‌కు డిజిన్వెస్ట్‌మెంట్ దన్ను

**ముంబయి :** టాటా స్టీల్ 2017 జూన్‌తో ముగిసిన త్రైమా సికంలో భారీ లాభాలను గడించింది. కంపెనీ నికర లాభాలు ఏకంగా రూ.921 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో ఏకంగా రూ.3,183 కోట్ల నష్టాలు చవి చూసింది. కాగా అధిక ఉత్పత్తి, ఏకకాల డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా లాభాలు అమాంతం పెరిగాయి. క్రితం త్రైమాసికంలో కంపెనీ అమ్మకాలు 19 శాతం పెరిగి రూ.30,803 కోట్లకు చేరాయి. టాటా మోటార్స్‌లోని తన వాటాను రూ.3,778 కోట్లకు టాటా స్టీల్ విక్రయించడంతో ఈ స్థాయి లాభాలు నమోదయ్యాయి.

---

గ్రూప్స్, ఇతర పోటీపరీక్షల ప్రత్యేకం

ఉపాధి






ఎవిపి.రాజు,
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

# అలెగ్జాండర్ రాజకీయ గురువు ?

## భారతదేశ చరిత్ర



1. ఏ పురావస్తు శాస్త్ర శాఖాధిపతి సారధ్యంలో హరప్పా నాగరికత తవ్వకాలు నిర్వహించారు ? **- సర్‌జాన్‌మార్షల్ (క్రీ.శ 1921 సంవత్సరంలో)**
2. సింధూ నాగరికతకు హరప్పా నాగరికత అని ఎవరు పేరుపెట్టారు ? **- సర్‌జాన్‌మార్షల్**
3. హరప్పా - మొహంజదారో నాగరికతలు కనుగొన్న విషయాన్ని సర్-జాన్ మార్షల్ ఎక్కడ ప్రకటించారు ? **- లండన్‌లో**
4. హరప్పా 'అండ్ ది ఇండస్ సివిలైజేషన్' పుస్తక రచయిత ఎవరు ? **- సర్‌జాన్ మార్షల్**
5. 'సింధు నాగరికత' అనే పదాన్ని ఉపయోగించిన తొలి పురావస్తు శాస్త్రవేత్త ? **- సర్‌జాన్ మార్షల్**
6. భారత చరిత్రను శాస్త్రీయంగా పునర్నిర్మించడానికి మొదట పూనుకున్న సంస్థ ? **- ఆసియాటిక్ సొసైటీ (దీనిని క్రీ.శ 1784లో విలియం జోన్స్ కోల్‌కతాలో స్థాపించాడు)**
7. ఆసియాటిక్ సొసైటీ ఎవరి కాలంలో స్థాపించారు ? **- వారన్‌హేస్టింగ్స్**
8. కాళిదాసు శాకుంతలమును, మనుస్మృతిని ఆంగ్లంలోకి ఎవరు అనువదించారు ? **- విలియంజోన్స్**
9. మన దేశం అంతటినీ సర్వేక్షణ చేసి పటాలు తయారు చేయడానికి 'భారతదేశ సర్వేక్షణ శాఖ'ను ఏర్పాటు చేశారు. దీనికి సర్వేయరు జనరల్‌గా నియమితులైనవారు ? **- జేమ్స్ రెన్నెల్ (సర్వే ఆధారంగా తయారైన భారతదేశపు మొట్టమొదటి పటాలను అతడు ఎప్పుడు తయారు చేశాడు - క్రీ.శ 1776 సంవత్సరంలో).**
10. వేదాలను ఆంగ్లంలోకి అనువాదం చేసినవారు ? **- మాక్స్‌ముల్లర్**
11. క్రీ.శ 1875లో సింధు నాగరికతకు చెందిన ఎద్దు బొమ్మతో ఉన్న ఒక ముద్ర గురించి వ్యాసం రాసిన పండితుడు ? **- అలెగ్జాండర్ కన్నింగ్‌హోమ్**
12. మొట్టమొదటిసారిగా సింధునాగరికతా లిపిని ఎప్పుడు గుర్తించారు ? **- 1853 సంవత్సరంలో**
13. సింధు లిపిని కనుగొన్నవారు ? **- జేమ్స్‌ప్రిన్సెప్**
14. గుర్రం అవశేషాలు ఎక్కడ కనుగొన్నారు ? **- సుర్కోటాడా (సౌరాష్ట్ర)**
15. భూమిని దున్నిన గుర్తులు ఎక్కడ కనుగొన్నారు ? **- కాళీభంగన్ (రాజస్థాన్)**
16. బార్లీ ఆవాలు ఎక్కడ బయటపడ్డాయి ? **- బెన్వాలీ (హర్యానా)**
17. టెర్రకోట అనగానేమి ? **- కాల్చినమట్టి (సింధు ప్రజలు దీనితో ముద్రికలు, బొమ్మలు, పాత్రలు తయారుచేసేవారు)**
18. కాళిభంగన్ అనగానేమి ? **- నల్లటిగాజులు**
19. ప్రపంచంలోనే తొలి 'టైడల్ సీ పోర్ట్' (పోటురేవు పట్టణం) ? **- లోథాల్ (ఈ ఓడరేవు బొగావో, సబర్మతి నదుల మధ్య కేంద్రీకృతమైంది, అతిపెద్ద డాక్ యార్డు ఇక్కడే ఉంది)**
20. వరిధాన్యం పండించిన ఆధారాలు ఎక్కడ లభించాయి ? **- లోథాల్, రంగపూర్**
21. 'రావి' నది ఒడ్డున కేంద్రీకృతమై ఉన్న సింధు నాగరికత స్థావరం ? **- హరప్పా**
22. నాట్యగత్తె కాంస్య విగ్రహం ఎక్కడ బయల్పడింది ? **- మొహంజుదారో**
23. మొహంజుదారో అనగానేమి ? **- మృతులపురం లేదా దిబ్బ (లోథాల్ అనగా కూడా ఇదే)**
24. పంజాబ్‌కు పంచనదీ పరీవాహక దేశంగా పేరు కల్పించిన నదులు ? **- జీలం, చినాబ్, రావి, బియాస్, సట్లెజ్ నదులు. (ఇవి ప్రాచీన వేద సాహిత్యంలో వరుసగా వితస్త, అసికిని, చంద్రభాగ, ఏరూష్ణి, విపాశ, శతుద్రి నదులుగా వ్యవహరించేవారు).**
25. 'ది ఆర్కిటిక్ హోమ్ ఇన్ వేదాస్' గ్రంథ రచయిత ఎవరు ? **- బాలగంగాధర్ తిలక్**
26. గాయిత్రి మంత్రం ఏ వేదంలో ఉన్నది ? **- రుగ్వేదం**
27. నిష్క అనగా ? **- రుగ్వేద కాలం నాటి బంగారు నాణెం**
28. 'యుద్ధం వ్యక్తుల ఆలోచనలో ప్రారంభమవుతుంది. (వార్ బిగిన్స్ ఇన్ ద మైండ్ ఆఫ్ మ్యాన్) అనే వేదసామ్యం ఎందులో రాసి వుంది ? **-అదర్వణవేదం**
29. 'ప్రపంచమే భగవంతుడు, భగవంతుడేనా ఆత్మ' అనే భావాన్ని వ్యక్తం చేసినది ? **- బ్రహ్మసూత్రాలు (దా వరల్డ్ ఈజ్ గాడ్ అండ్ గాడ్ ఈజ్ మై సోల్)**
30. వేదకాలంలో రాజులు ప్రజల వద్ద నుంచి వసూలు చేసిన పన్ను ? **- బలి**
31. వైదిక ఆర్యులు పండించిన ముఖ్యమైన ధాన్యం రకం పేరు ? **- యవ**
32. ప్రప్రథమంగా రాజాధికారం లేదా రాచరిక వ్యవస్థ గురించి ప్రస్తావించిన గ్రంథం ? **- ఐతరేయ బ్రాహ్మణం**
33. వర్ణవ్యవస్థ గురించి రుగ్వేదంలో మొదటిసారిగా ఎక్కడ కనిపించింది ? **- పురుషసూక్తం**
34. వ్యవసాయ కార్యకలాపాల గురించి ఏ వేదంలో ఉంది ? **- అదర్వణవేదం**
35. జైనమతంలో ఎంతమంది తీర్థంకరులు ఉన్నారు ? **- 24 మంది (మొదటి తీర్థంకురుడు - రుషభనాధుడు, 23వ వాడు పార్శ్వనాథుడు, 24వ తీర్థంకరుడు - వర్థమాన్ మహావీరుడు)**
36. జైనులు తమ సందేశాన్ని ఏ భాషలో ప్రచారం చేశారు ? **- ప్రాకృతభాషలో (అర్థమాగధిభాష)**
37. బౌద్ధమత గ్రంథాలు ? **-త్రిపిటకాలు (పాలి భాషలో ఉన్న త్రిపీటకాలు అనగా వినయపిటక, సుత్తపిటక, అభిదమ్మపిటక)**
38. వినయ పిటక ? **- బౌద్ధ సంఘనియమ నిబంధనలు**
సుత్త పిటక - బుద్ధుని బోధనలు
అభిదమ్మ పిటక - బౌద్ధదమ్మ వేదాంతం
39. స్తూపం - **బుద్ధుని అవశేషాలపై నిర్మించిన అర్థగోళాకారపు కట్టడాలు**
చైత్యం - బౌద్ధమతస్థుల ప్రార్థనాస్థలం
విహారం - బౌద్ధ సన్యాసుల విశ్రాంతి మందిరం
జాతకకథలు - బుద్ధుని పూర్వజన్మ వృత్తాంతాలు
40. మహాభారతానికి ఉన్న ఇతర పేర్లు ? **- జయసంహిత, పంచమవేద, సంహిత**
41. గ్రీకులు, భారతీయ శిల్పరీతుల సమ్మిళిత ఫలితంగా ఏర్పడిన కళ ? **- గాంధారశిల్పకళ (కనిష్కుడు కాలంలో)**
42. గుప్తుల కాలంలో ఆరు హిందూ ఫిలాసఫీలు వాటిని ప్రతిపాదించినవారు ?
**ఎ. న్యాయ - గౌతమ**
**బి. వైశేషిక - కణాద**
**సి. సాంఖ్య -కపిల**
**డి. యోగ - పతంజలి**
**ఇ. మీమాంస - జైమిని**
**ఎఫ్. వేదాంత - బాదరాయణ**
43. బౌద్ధమతం - మహాసభలు (సంగీతిలు) (సభ అధ్యక్షుడు - రాజు - స్థలం)
**ఎ. మొదటి మహాసభ - మహాకాశ్యపుడు - ఆజాతశత్రువు - రాజగృహం (క్రీపూ 483)**
**బి. రెండో మహాసభ - సభకామి - కాలశోక - వైశాలి (క్రీపూ.383)**
**సి. మూడో మహాసభ - మొగలిపుత్తతిస్య - అశోకుడు - పాటలీపుత్రం (క్రీపూ 250)**
**డి. నాల్గో మహాసభ - వసుమిత్రని - కనిష్కుడు - కుందనవనం (కాశ్మీర్)**
44. భారతదేశంపై దండెత్తిన మొదటి విదేశీరాజు ? **- డేరియస్ -1 (పర్షియా)**
45. 16 జనపదాలలో మొట్టమొదటి మహాసామ్రాజ్యంగా రూపొందిన జనపదం ? **- మగధ**
46. అలెగ్జాండర్ రాజకీయ గురువు ? **- అరిస్టాటిల్**
47. అశోకుని శాసనాలను మొదటిగా చదివి వినిపించినది ఎవరు ? **- 1837 సంవత్సరంలో ఈస్టిండియా కంపెనీకి చెందిన జేమ్స్ ప్రిన్సెప్**
48. మౌర్యులు ఏ తెగకు చెందినవారు ? **- మోరియా**
49. బిందుసారుని ఆస్థానంలో ఉన్న సిరియా దేశపు రాయబారి ? **- డైమోకస్ (సిరియాను ఏంటియోకస్ పరిపాలిస్తున్నాడు)**
50. గుప్తుల కాలంనాటి సంస్కృత వ్యాకరణాలు
**ఎ. పాణిని - అష్టాధ్యాయి**
**బి. పతంజలి - మహాభాష్యం**
**సి. అమరసింహుడు - అమరకోశం**
**డి. చంద్రగోమయ్ - చంద్రవ్యాకరణం**
51. చంద్రగుప్తుడి మంత్రి అయిన కౌటిల్యుడు రాసిన అర్థశాస్త్రం అన్న పుస్తకం చాలా ముఖ్యమైనది. చంద్రగుప్తుని ఆస్థానంలోని గ్రీకు రాయబారి మెగస్తనీస రాసిన మరో ముఖ్యమైన పుస్తకం ? **- ఇండికా**
52. 'అశోక పియదర్శి' అనే పేరున్న శాసనం ఎప్పుడు దొరికింది ? **- 1915 (మస్కి - కర్ణాటక)**
53. అన్ని మతాలనూ గౌరవించాలని అశోకుడు ఏ శిలాశాసనంలో పేర్కొన్నాడు ? **- 12వ శిలాశాసనం**
54. మౌర్యులు సామ్రాజ్యాన్ని నాలుగు రాష్ట్రాలుగా విభజించారు. అవి ఏవి ? **- తక్షశిల, ఉజ్జయిని, తోసలి, సువర్ణగిరి (టియుటిఎస్)**
55. ఫిరోజ్‌షా తుగ్లక్ ఢిల్లీకి తరలించిన అశోకుని శిలాశాసనాలు ఏవి ? **- మీరట్ శాసనం, తోపార శాసనం**
56. అశోకుడు ప్రజలందరూ నాబిడ్డలు (ఆల్ మెన్ ఆర్ మై చైల్డ్) శాసనం పేరు ? **- ధౌళిశాసనం**
57. పదం - వివరణ
**ఎ. మహాభినిష్కమణం - భవబంధాల నుంచి బయటపడి ఇంటి నుంచి నిష్క్రమించడం**
**బి. మహాపరినిర్వాణం - బుద్ధుని మరణం**
**సి. ధర్మచక్రపరిప్రవర్తనం - బుద్ధుని మొదటి ఉపదేశం**
**డి. ఉపనిషత్ - సమీపంగా లేక దగ్గరగా కూర్చోడం**
**ఇ. తీర్థంకరులు - మార్గం చూపేవారు**
58. మతాలు - స్థాపకులు
**ఎ. అద్వైతం - ఆదిశంకరాచార్య**
**బి. విశిష్టాద్వైత - రామానుజ**
**సి. ద్వైత - మాధ్యాచార్యులు**
**డి. ద్వైతద్వైత - నింబార్కుడు**
**ఇ. వీరశైవమతం - బసవేశ్వరుడు**
**ఎఫ్. ద్వైతవధ - మాధవాచార్య**
**జి. శుద్వైద్వైత - వల్లభాచార్య**
**హెచ్. శివద్వైత - శ్రీకంఠాచార్య**
**ఐ. అచింత్యబౌద్ధవాధ - చైతన్య**
**జె. రామవత్ సంప్రద - రామానంద**
59. శ్రీలంకలో బౌద్ధమతాన్ని వ్యాపింపజేయడంలో అశోకుని పాత్ర గురించి తెలిపే సిలోన్ శ్రీలంక గ్రంథాలు ? **- దీపవంశ, మహావంశ, దివ్యవదన్**
60. **గ్రంథం - రచయిత**
ఎ) తొలక్కప్పీయం - తొల్కప్పియార్ (వ్యాకరణం)
బి) అగత్తీయం - అగత్తీయర్
సి) శిలప్పధికారం - ఇలంగో అడిగల్
డి) మణిమేఖలై - సత్తనార్
ఇ) కురళ్ - తిరువళ్లువర్
61) మౌర్యుల సమాజంలో ఏడు రకాల తరగతులవారు ఉన్నారని మెగస్తనీస్ తెలిపాడు. వారెవరు ? - **తత్వవేత్తలు, రైతులు, సైనికులు, పశుకాపరులు, చేతివృత్తులవారు, న్యాయాధికారులు, పరిపాలనా సభ్యులు.**

63. **వంశం - స్థాపకులు - రాజులు**

| వంశం | స్థాపకులు | రాజులు |
|---|---|---|
| ఎ)హర్యంక వంశం | - బింబిసారుడు | - అజాతశత్రువు, ఉదయనుడు |
| బి) శిశునాగవంశం | - శిశునాగుడు | - కాలశోకుడు |
| సి)నంద వంశం | - పద్మ నందుడు | - ధన నందుడు |
| డి)మౌర్య వంశం | - చంద్రగుప్తుడు | - బిందుసారుడు, అశోకుడు, బృహద్రధుడు |
| ఇ)శుంగ వంశం | - పుష్యమిత్ర శుంగుడు | - అగ్ని మిత్రుడు |
| ఎఫ్) కణ్వ వంశం | - వాసుదేవ కణ్వుడు | - సుశర్మ |
| జి) శాతవాహనులు | - శ్రీముఖుడు | - కృష్ణుడు, మొదటి శాతకర్ణి, కుంతల, శాతకర్ణి, గౌతమీపుత్ర శాతకర్ణి, హాలుడు, యజ్ఞశ్రీ శాతకర్ణి |
| హెచ్) కుషానులు | - మొదటి కాడ్‌ఫైసెస్ | - కనిష్కుడు |
| ఐ) చేది వంశం (కళింగ) | - ఖారవేలుడు | |
| జె) గుప్త వంశం | - శ్రీగుప్తుడు | - మొదటి చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు, స్కంధగుప్తుడు |

62.'సంగం' అనగా ? **- మధురై పట్టణంలోని ప్రాచీన కవి పండిత పరిషత్**
64. కాశ్మీర్‌ను గురించి తెలిపే 'రాజతరంగిణి' రచించినది ? **- కల్హణుడు**
65. **గ్రంథాలు - రచయిత**
ఎ) విశాఖదత్త - ముద్రారాక్షసం, దేవీ చంద్రగుప్తం
బి) హాలుడు - గాథాసప్తశతి
సి) ఆర్యభట్టు - సూర్య సిద్ధాంత, ఆర్యభట్టీయం
డి) వరాహమిహురుడు - బృహత్సంహిత, పంచ సిద్ధాంతిక
ఇ) బ్రహ్మ గుప్తుడు - బ్రహ్మ స్ఫుట సిద్ధాంతం, ఖండఖాద్యకం
ఎఫ్)శూద్రకుడు - మృచ్ఛకటికం
జి) అమరసింహ - అమరకోశ
హెచ్) అశ్వఘోషుడు - బుద్ధచరితం
ఐ) చరకుడు - చరక సంహిత
జె) మయూరుడు - సూర్య శతకం
కె) బాణుడు - స్వప్న వాసవదత్త
ఎల్) విష్ణుశర్మ - పంచతంత్రం
66) సంస్కృత సాహిత్యాన్ని అభివృద్ధి చేసిన 'నవరత్నాలు' అనే కవులు ఎవరి ఆస్థానంలో ఉండేవారు. వారెవరు? **- రెండో చంద్రగుప్తుని ఆస్థానంలో ఉన్న కాళిదాసు, అమరసింహుడు, శంకు, ధన్వంతరి, క్షిపణికుడు, భేతాళభట్టు, ఘటకర్పకుడు, వరరుచి, వరాహమిహురుడు.**
67. శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులు ? **- అల్లసాని పెద్దన, నంది తిమ్మన, మాదయ్యగారి మల్లన, దూర్జటి, అయ్యలరాజు రామభద్రుడు, తెనాలి రామకృష్ణ, పింగళి సూరన, రామరాజభూషణుడు**
68. విదేశీ యాత్రీకులు ఏ రాజుల కాలంలో భారత్‌ని సందర్శించారు?

| | |
|---|---|
| **ఎ) మెగస్తనీస్** | **- చంద్రగుప్త మౌర్యుడు** |
| **బి) డైమాకస్** | **- బిందుసారుడు** |
| **సి) పాహియాన్** | **- రెండవ చంద్రగుప్తుడు** |
| **డి) హుయాన్‌త్సాంగ్** | **- హర్షుడు** |
| **ఇ) హుయాన్‌త్సాంగ్** | **- రెండవ పులకేశి** |
| **ఎఫ్) హుయాన్‌త్సాంగ్** | **- మొదటి నరసింహవర్మ** |
| **జి) సులేమాన్** | **- అమోఘవర్షుడు** |
| **హెచ్) సులేమాన్** | **- మిహిరభోజుడు** |
| **ఐ) నికోల్‌కాంటి (ఇటలీ)** | **- మొదటి దేవరాయ** |
| **జె) అబ్దుల్‌రజాక్ (అరేబియా)** | **- రెండవ దేవరాయ** |
| **కె)డొమింగోపేస్( పోర్చుగీసు)** | **- శ్రీకృష్ణదేవరాయలు** |
| **ఎల్) ఎడ్వర్డ్ బర్బోసా (పోర్చుగీసు)** | **- శ్రీకృష్ణదేవరాయలు** |
| **ఎమ్) న్యూనిజ్ (పోర్చుగీసు)** | **- అచ్యుత దేవరాయలు** |

★

## డిసెంబరు నాటికి 28 ప్రాజెక్టులు పూర్తి చేయాల్సిందే

### అధికారులకు సిఎం ఆదేశం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలోని 28 సాగు నీటి ప్రాజెక్టుల్ని ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 'నీరు-ప్రగతి' పనుల పురోగతిపై ఆయన తన నివాసం నుంచి అధికారులతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల్లో ప్రాజెక్టులు పూర్తయితే సాగునీటి సమస్యలుండవన్నారు. ఆల్మట్టి నుంచి నీరు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈనెల 9 నుంచి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా మరోమారు రుతుపవనాల రాకతో వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. సాధారణ సాగు విస్తీర్ణంలో 43 శాతం మాత్రమే పంటలు వేశారన్నారు. సూక్ష్మపోషకాల పంపిణీ 61 శాతం మాత్రమే జరిగిందని, నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. గుంటూరు, విశాఖపట్టణం, విజయనగరం జిల్లాల్లో సేంద్రీయ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. వర్షాభావ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. చెక్ డ్యామ్‌లు 5వేలు నిర్మించారని, మిగిలిన 6వేల డ్యామ్‌ల నిర్మాణం సీజన్‌లోపు పూర్తి చేయాలన్నారు. సెర్ఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అవెన్యూ ప్లాంటేషన్ పనులకు కూలీల కొరత ఉన్న దృష్ట్యా ఉపాధి కూలీలను మళ్ళించాలన్నారు. పండ్ల తోటల పెంపకంలో అటవీ, ఉద్యాన, సెర్ఫ్ సమన్వయంతో పని చేయాలన్నారు. శ్రావణ మాసంలో ఇళ్ళ పనులు ప్రారంభించేందుకు లబ్ధిదారులు ఆశక్తిగా ఉన్నారని, వారికి కావాల్సిన వనరులు సమకూర్చి ప్రోత్సహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రల నిర్మాణం, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ ఏడాదిలోగా ఐదు జిల్లాల్ని ఓడిఎఫ్‌గా ప్రకటించాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జలవనరుల శాఖ, గ్రామీణాభివృద్ధి, ఉద్యాన, మత్స్య శాఖల కార్యదర్శులు శిశిభూషణ్, జవహర్‌రెడ్డి, చిరంజీవి, రాంశంకర్‌నాయక్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయశాఖల కమిషనర్‌లు రామాంజ నేయులు, హరి జవహర్‌లాల్, హౌసింగ్ ఎండి కాంతిలాల్ దండే తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెకు సిద్ధమవుతున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు

**ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)**

రాష్ట్రంలో విద్యుత్‌రంగంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మెకు సిద్ధం కావాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి పిలుపునిచ్చారు. విజయవాడలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల తరపున ఆగస్టు 16న ప్రభుత్వానికి కార్మిక సంఘాలు సమ్మె నోటీసు ఇవ్వనున్నట్లు చెప్పారు. సమ్మె నోటీసు ఇస్తున్న సందర్భంగా విద్యుత్ రంగంలోని కాంట్రాక్టు కార్మికులు, కార్మిక సంఘాలతో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరిస్తామని సిఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

## ట్రిపుల్ ఐటిల్లో అదనంగా 366 సీట్లు

### మంత్రి గంటా శ్రీనివాసరావు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రాతినిధ్యం లేని మండలాలకు అవకాశం కల్పించే దిశగా ట్రిపుల్ ఐటిల్లో కొత్తగా 366 సీట్లకు అనుమతి లభించిందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. 122 మండలాల నుంచి ఒసి, బిసి, ఎస్సీ, ఎస్టీలకు ఒక్కొక్కటి చప్పున మొత్తం 336 సీట్లు కేటాయించామన్నారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులొస్తాయన్నారు. ట్రిబుల్ ఐటిలు మరింత మెరుగైన సాంకేతిక విద్యను విద్యార్థులకు అందించాలని, ఈ క్రమంలో ఎలాంటి అవినీతికి తావివ్వొద్దని ఉన్నతాధికారులకు సూచించారు. ట్రిబుల్ ఐటిల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై మంత్రి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆర్జీయూకెటి, ట్రిబుల్ ఐటి డైరెక్టర్లు, ఆ శాఖ ఉన్నతాధికారులతో విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకోసారి ట్రిబుల్ ఐటి డైరెక్టర్లతో సమావేశం కావాలని నిర్ణయించారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్జీయుకెటి వైస్ చాన్సలర్ రామచంద్రరాజు, కళాశాల, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ పాండాదాస్, ట్రిబుల్ ఐటి డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కంచికచర్లలో మహిళల ధర్నా

**ప్రజాశక్తి-కంచికచర్ల**

జనవాసాల మధ్య గుడి, బడికి సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మద్యం షాపులు ఎత్తివేయాలని కోరుతూ కృష్ణాజిల్లా కంచికచర్లలోని జుజ్జూరు రోడ్డులో మహిళలు పెద్దఎత్తున ధర్నా చేశారు. ఉదయం 10 గంటలకు జుజ్జూరు రోడ్డు, వసంత కాలనీ మహిళలు ఎక్సైజ్ సిఐ కార్యాలయం వద్దకు చేరుకుని మద్యం షాపులు ఎత్తివేయాలంటూ నినాదాలు చేస్తూ బైఠాయించారు. 2 గంటల అనంతరం అక్కడికొచ్చిన సిఐని చుట్టుముట్టిన మహిళలు నాలుగురోజుల్లో మద్యం షాపులు తొలగించకపోతే సామాగ్రిని ధ్వంసం చేస్తామని హెచ్చరించారు.

**ప్రజ్ఞ**

**జవాబులు**

1. ఎనిమిది
2. 329 మిలియన్ డాలర్లు
3. రాజీవ్ కుమార్
4. అంకుర్ మిట్టల్
5. ధీరేంద్ర స్వరూప్

# కదం తొక్కిన నిరుద్యోగులు

- నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్
- డివైఎఫ్ఐ ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు



డివైఎఫ్ఐ అధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్న

**ప్రజాశక్తి- యంత్రాంగం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి రూ.2 వేలు చెల్లించాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నిరుద్యోగులు కదంతొక్కారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా తిరుపతిలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరుద్యోగులు ధర్నా చేశారు. ఈ ధర్నాలో ముఖ్య అతిథిగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల పోస్టుల్ని, టిటిడిలోని ఆరు వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరుతూ సబ్‌కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవాడలో లెనిన్ సెంటర్లో నిరసన ప్రదర్శన జరిగింది. కేంద్రంలో 14.5లక్షలు, రాష్ట్రంలో 2.21లక్షల పోస్టుల్ని తక్షణమే భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం సూర్యారావు డిమాండ్ చేశారు. ఎవరూ అడగకుండానే నిరుద్యోగభృతి ఇస్తామన్న చంద్రబాబు మూడేళ్లుగా భృతి ఇవ్వకుండా నిరుద్యోగుల్ని మోసం చేశారని విమర్శించారు. చలో కలెక్టరేట్ కార్యక్రమంలో భాగంగా గుంటూరులో కలెక్టరేట్ వద్ద నిరుద్యోగులు ధర్నా చేశారు. విజయనగరం పట్టణంలో నిరుద్యోగులు అర్ధనగ్న ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎపిపిఎస్‌సి ద్వారా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, నిరుద్యోగులకు మోడీ, చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో కలెక్టరేట్ వద్ద నిరుద్యోగులు ధర్నా చేశారు. కడప నగరంలో ర్యాలీ, చలో కలెక్టరేట్ నిర్వహించారు. అనంతరం డిఆర్ఒకు వినతిపత్రం అందజేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిరుద్యోగ యువత ధర్నా చేసింది. కర్నూలు జిల్లాలో ఉపాధి ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలని వక్తలు డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిరుద్యోగులు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పలు ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.విశాఖ నగరంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిరుద్యోగులు ధర్నా చేశారు. విశాఖ జిల్లా అనకాపల్లిలో ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట యువతీ, యువకులు ధర్నా నిర్వహించారు. నిరుద్యోగులందరికీ ఉద్యోగాలివ్వాలని, లేకుంటే నిరుద్యోగ భృతి చెల్లించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు విస్మరించారన్నారు.

# కొనసాగుతున్న నిర్బంధం

- 'వంశధార' నిర్వాసితులకు నోటీసులు
- నిర్వాసిత గ్రామాల్లో డిఐజి సిహెచ్.శ్రీకాంత్ పర్యటన

**ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి/హిరమండలం**

శ్రీకాకుళం జిల్లా వంశధార నిర్వాసిత గ్రామాల్లో రెండో రోజూ పోలీసుల నిర్బంధం కొనసాగింది. పనులను అడ్డుకునేందుకు వచ్చే నిర్వాసితు లను అరెస్టులు చేసేందుకు పోలీసు వాహనాలను సిద్ధం చేశారు. అవసరమైతే భాష్పవాయుగోళాలను ప్రయోగించేందుకు వజ్ర వాహనాన్ని అందుబాటులో ఉంచారు. గ్రామాల్లోని పరిస్థితులపై డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఇనుప ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. గతంలో పలు సందర్భాల్లో చేపట్టిన ఉద్యమాలు, ఆందోళనల్లో భాగస్వాములై కేసులు ఎదుర్కొంటున్న వారికి పోలీసులు నోటీ సులు జారీ చేశారు. అందుబాటులో లేని నిర్వాసితుల ఇళ్లకు ఈ నోటీసులను అంటించారు.

**నిర్వాసిత గ్రామాల్లో డిఐజి పర్యటన**

వంశధార నిర్వాసిత గ్రామాల్లో సోమవారం విశాఖపట్నం రేంజ్ డిఐజి సిహెచ్. శ్రీకాంత్ పర్యటించారు. తులగాం, పాడలి, దుగ్గుపురం గ్రామాల రహదారు లను పరిశీలించారు. అనంతరం దుగ్గుపురం గ్రామ నిర్వాసితులతో మాట్లాడారు. నిర్వాసితులు టి.పోలినాయుడు, తిరుపతి రావు, రామారావు తదితరులు మాట్లాడుతూ నిర్వాసిత కుటుంబాల్లో చాలామందికి ప్యాకేజీలు ఇవ్వలేదని, పునరావాసం, పరిహారం సమస్యలు చాలా ఉన్నాయని డిఐజికు వివరించారు. పునరావాస కాలనీల్లో కనీస సౌకర్యాలు లేవని, అక్కడ తాము ఎలా ఉండగలమని ప్రశ్నించారు. అందుకే తాము గ్రామాల్లోనే ఉంటున్నామని, పునరావాస కాలనీల్లోనే రేషన్, పింఛన్లు ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని వాపోయారు. పోలీసు బలగాలను పెట్టి భయభ్రాంతులు సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డిఐజి వెంట ఎస్‌పి త్రివిక్రమవర్మ, పాలకొండ ఇన్‌ఛార్జి డిఎస్‌పి వి.సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.


దుగ్గుపురం నిర్వాసితులతో మాట్లాడుతున్న డివిజి శ్రీకాంత్

**చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు : డిఐజి**

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి తప్ప, చట్టాన్ని చేతుల్లో తీసుకుంటే చర్యలు తప్పవని నిర్వాసితులను డిఐజి శ్రీకాంత్ హెచ్చరించారు. నిర్వాసిత గ్రామాల్లో పర్యటన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. రిజర్వాయర్ నిర్మాణ పనులను అడ్డుకుంటే చర్యలు తప్పవన్నారు. నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నానని, సమస్యలు కొంతమేర ఉన్నాయని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

# మున్సిపల్ కార్మికుల రిలే దీక్షలు


రిలే దీక్షలో పాల్గొని సంఘీభావం తెలుపుతున్న నాయకులు

**ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)**

తమ ఉపాధిని దెబ్బతీసేలా ఉన్న జిఒలు 279, 159, 160లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో మున్సిపల్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మున్సిపల్ వర్కర్స్ జెఎసి ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని ధర్నాచౌక్ వద్ద సోమవారం ఈ దీక్షలను మాజీ శాసనమండలి సభ్యులు కెఎస్.లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం మున్సిపల్ వర్కర్లను కార్పొరేట్ సంస్థల ద్వారా పనిచేయించాలని చూస్తోందన్నారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా ప్రయివేటు వ్యక్తులు చెప్పినట్లు కార్మికులు పని చేసేలా చేయటం సబబుకాదన్నారు. వారికి పిడిఎఫ్ ఎంఎల్‌సిల ఫోరం తరుపున మద్దతు తెలిపారు. సిఐటియు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 279 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కేటగిరీల జీతాలు చెల్లించాలన్నారు. విజయవాడ, విశాఖ నగరాలకు 010 ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అవసరమైతే నిరవధిక నిరాహార దీక్షలకు దిగుతామన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ కార్మికుల ఉద్యమాలను పోలీసులతో అణచాలని చూస్తే సహించేది లేదన్నారు. కార్మికుల పర్మినెంట్ వారికి హెల్త్‌కార్డులు ఇవ్వాలని కోరారు. స్కూల్ స్వీపర్లను ఫుల్‌టైమ్ వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రోజుకొక జిల్లాకు చెందిన మున్సిపల్ కార్మికులతో ఈ నెల 22వ తేదీ వరకూ రిలే నిరాహార దీక్షలు కొనసాగు తాయని జెఎసి నాయకులు తెలిపారు. సిఐటియు రాష్ట్ర నాయకులు ధనలక్ష్మీ, జెఎసి నాయకులు రంగనాయకులు, డేవిడ్, మధు పాల్గొన్నారు.

## త్వరితగతిన అభివృద్ధి పనులు

### కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు

**ప్రజాశక్తి- విజయనగరం కంటోన్మెంట్**

విజయనగరం జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి పి.అశోక్ గజపతిరాజు అధికారులను ఆదేశించారు. ఇందుకు అధికారుల మధ్య సమన్వయం అవసరమని అన్నారు. సోమవారం విజయనగరం కలెక్టరేట్‌లో పలు శాఖల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలన్నారు. నంద్యాల ఉపఎన్నికలో ఎవరు గెలుస్తారని విలేకర్లు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ, తాను జ్యోతిష్యుడ్ని కాదని, జాతకాలు చెప్పడం తన పనికాదన్నారు. రూ.కోట్లు అవినీతి చేసి బెయిల్‌పై బయటకొచ్చిన వారిని పట్టించుకునేవారు ఎవరూ లేరని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇటీవల వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన 22 మంది వారసులకు ఆపద్బంధు పథకం కింద చెక్కులు అందజేశారు. రాష్ట్ర గనుల శాఖ మంత్రి సుజయ రంగారావు, కలెక్టర్ వివేక్‌యాదవ్ పాల్గొన్నారు.

# సెజ్ పేరుతో భూ దోపిడీ

### కలెక్టరేట్ వద్ద ధర్నాలో సెజ్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

**ప్రజాశక్తి - కాకినాడ**

సెజ్ పేరుతో భూదోపిడి జరుగుతోందని కాకినాడ సెజ్ వ్యతిరేక పోరాట కమిటీ నేతలు విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ సోమవారం ధర్నా నిర్వహించారు. కాకినాడ ప్రత్యేక ఆర్థికమండలి పేరుతో 12 ఏళ్లుగా 10 వేల ఎకరాల భూదోపిడీ జరుగుతోందన్నారు. కాకినాడ సీపోర్ట్సు లిమిటెడ్‌కు సెజ్‌ను ఏర్పాటు చేసేందుకు 2002 ఏప్రిల్ 23న ప్రభుత్వం జిఒ 196ను జారీ చేసిందన్నారు. అనంతరం కాకినాడ సీపోర్ట్సు లిమిటెడ్ అదే ఏడాది ఆగస్టు 2న సెంట్రల్ సెజ్ బోర్డుకు లేఖ ఇచ్చిందన్నారు. నవంబరు 27న ప్రిన్సిపల్ అప్రూవల్ వచ్చిందన్నారు. అప్పటి నుంచి సెజ్ నిర్వహకులు 2005 వరకు ఎటువంటి పనీ చేయలేదన్నారు. అప్పటికే గడువు ముగియడంతో 2005 జూన్ 24న 2006 జూన్ 30వరకు పెంచారని వివరించారు. అప్పటిలోగా పూర్తి ప్రాజెక్టు వివరాలతో వస్తే ఫార్మల్ అప్రూవల్ ఇస్తామని చెప్పినట్లు వివరించారు. అనంతరం 2007 ఏప్రిల్ 23న సెంట్రల్ కామర్స్ డిపార్టుమెంటు జిల్లాలోని కాకినాడ సమీపంలో వున్న రమణక్కపేట, ఎవి.నగరం గ్రామాల్లో వెయ్యి హెక్టార్లలో మల్టీ ప్రొడక్ట్ ఏర్పాటుకు సెజ్ భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చారని చెప్పారు. అనంతరం కలెక్టర్ కార్తికేయమిశ్రాకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సెజ్ వ్యతిరేకపోరాట కమిటీ నాయకులు చింతా సూర్యనారాయణమూర్తి, బావిశెట్టి నారాయణస్వామి, సిపిఎం జిల్లా కార్యదర్శి దువ్వా శేషబాబ్జితోపాటు సెజ్ ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.


కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

# చేనేతలను మోసగించిన చంద్రబాబు

- టిడిపిలో కంత్రీ మంత్రులు
- వైసిపి ఎమ్మెల్యే రోజా విమర్శ

**ప్రజాశక్తి - మంగళగిరి/విజయవాడ సిటీ**

తమకు ఓటేస్తే అనేక పథకాలను అమలు చేస్తానని హామీనిచ్చి అధికారంలోకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేనేత కార్మికులను మోసం చేస్తున్నారని రాష్ట్ర వైసిపి నాయకురాలు, నగరి ఎమ్మెల్యే ఆర్‌కె.రోజా విమర్శించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని చిల్లపల్లి నాగేశ్వరరావు కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. చేనేత రంగానికి రూ.వెయ్యి కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తానని ఎన్నికల ముందు సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారని, వాటిని అమలు చేయమంటే, గజినిలాగా మరిచిపోయినట్లు నాటకమాడుతున్నారని, చేనేత కార్మికులు తమ హక్కుల కోసం ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటం చేయాలన్నారు. చేనేతకు అంబాసిడర్‌గా ఉంటానని చెప్పిన పవన్‌కళ్యాణ్.. ఇంతవరకు జిఎస్‌టిపై స్పందించలేదని విమర్శించారు. వైసిపి అధికారంలోకొస్తే చేనేత కార్మికులకు అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. మైనార్టీల ఓట్ల కోసమే ఆయేషా కేసును ప్రభుత్వం పునర్విచారణకు ఆదేశించిందని ఆరోపించారు. సమావేశంలో చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీలక్ష్మి, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి ఎమ్మెల్యే రోజా

చంద్రబాబు మంత్రివర్గంలో మహిళా ఐఎఎస్‌లను వేధిస్తున్న కంత్రీ మంత్రులు ఉన్నారని, వారిని బర్తరఫ్ చేయలేని ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తోందని వైసిపి ఎంఎల్ఎ ఆర్‌కె రోజా విమర్శించారు. విజయవాడలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేశామని సిఎం చంద్రబాబు చెప్పుకుంటున్నారని, ఆయన పాలనలో మహిళలు ఒంటరిగా తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయని రోజా విమర్శించారు. నాగార్జున యూనివర్శిటీ విద్యార్థిని రిషితేశ్వరి ర్యాగింగ్ కేసులో ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోకుండా ముఖ్యమంత్రే ఆయనను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థినులు హాస్టళ్లలో కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని కోరితే వారిని పోలీసులతో కొట్టించారన్నారు. మహిళలపై అత్యాచారాల గురించి ఓ జాతీయ సర్వే సంస్థ చేసిన సర్వేలో నలుగురు మంత్రులున్నట్లు తేలితే అందులో ఇద్దరు చంద్రబాబు మంత్రివర్గంలో ఉండటం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో విజయవాడ నగర పాలక సంస్థలో వైసిపి ఫ్లోర్‌లీడర్ బి.పుణ్యశీల తదితరులు పాల్గొన్నారు.

**మగ్గాలను పరిశీలించిన రఘువీరారెడ్డి**

మంగళగిరిలోని చేనేత మగ్గాలను పరిశీలించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి మాట్లాడారు. వ్యవసాయం తరువాత చేనేత పరిశ్రమపై ఎక్కువమంది ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారని, ఎన్నికల ముందు సిఎం చంద్రబాబునాయుడు, ప్రధాని మోడీ చేసిన వాగ్దానాలు అమలు చేయలేదని విమర్శించారు. చేనేత వస్త్రాలపై జిఎస్‌టి విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


చలో ఢిల్లీకి వెళ్తున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులకు విజయవాడ రైల్వేస్టేషన్‌లో మద్దతు తెలుపుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు, తదితరులు

## స్టీల్‌ప్లాంట్ల ప్రయివేటీకరణకు నిరసనగా 9న ధర్నా

### ఢిల్లీకి పయనమైన కార్మికులు

**ప్రజాశక్తి-విశాఖపట్నం**

సేలం, భద్రావతి, దుర్గాపూర్ స్టీల్‌ప్లాంట్ల ప్రయివేటీకరణకు నిరసనగా ఢిల్లీలో ఈ నెల 9న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నాయి. ఈ నేపథ్యంలో ధర్నాలో పాల్గొనేందుకు విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి సుమారు వెయ్యి మంది ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు సోమవారం ఉదయం స్వర్ణజయంతితో సహా పలు రైళ్లలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. సిఐటియు స్టీల్‌ప్లాంట్ నాయకులు ఎన్.రామారావు, జె.అయోధ్యరాం, వైటి దాస్, సిఐటియు నగర నాయకులు ఎం.సూరీడు ఆధ్వర్యంలో వారంతా దేశ రాజధానికి పయనమయ్యారు. ఢిల్లీ వెళ్లిన ఉద్యోగులకు విశాఖ రైల్వే స్టేషన్‌లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింగరావు, నగర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నగర నాయకులు బి.గంగారావు, పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు.

## కొవ్వాడ అణుపార్కును రద్దు చేయాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి

**ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ**

దేశ ప్రయోజనాలకు, ఉత్తరాంధ్ర ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే కొవ్వాడ అణు విద్యుత్కేంద్రాన్ని రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని సుందరయ్య భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొవ్వాడ అణువిద్యుత్‌కు రియాక్టర్లు సరఫరా చేసే వెస్టింగ్‌హౌస్ కంపెనీ దివాళా తీసిందని తెలిపారు. రియాక్టర్లను దిగుమతి చేసుకోవడానికి అటువంటి సంస్థతో మోడీ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమేనన్నారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉందని, పవన, సోలార్ విద్యుత్ చౌకగా లభిస్తుండడంతో థర్మల్ విద్యుత్ సంస్థలతో ఒప్పందాలు రద్దు చేసుకున్నామని ఇటీవల ఇంధన శాఖ కార్యదర్శి ప్రకటించారని గుర్తు చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కళా వెంకట్రావు... కొవ్వాడ అణుపార్కును నిర్మించి తీరుతామని చెప్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అమెరికా మెప్పు కోసం దేశ ప్రజలకు ద్రోహం చేసేందుకు మోడీ, చంద్రబాబు వెస్టింగ్‌హౌస్‌తో ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. సొంత దేశంలోనే రియాక్టర్లు సరఫరా చేయలేక ఖర్చు భారమై ఒప్పందం నుంచి వెస్టింగ్‌హౌస్ కంపెనీ వెనక్కి తగ్గిందన్నారు. అదే పరిస్థితి కొవ్వాడలో పునరావృతమైతే రూ.లక్షల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం కానుందని తెలిపారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు పాల్గొన్నారు.


ఆర్‌డిఒకు సమస్యలు వివరిస్తున్న వైవి, అక్కినేని వనజ తదితర నాయకులు

## అక్రమ చెరువులను ధ్వంసం చేస్తాం

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

### ఆర్‌డిఒ కార్యాలయం వద్ద దొండపాడు దళితుల ధర్నా

**ప్రజాశక్తి - గుడివాడ (కృష్ణా)**

చట్టాలను ఉల్లంఘించి తవ్విన చెరువులను వెంటనే ధ్వంసం చేయకపోతే తామే ఆ పని చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వై.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం కృష్ణా జిల్లా గుడివాడ ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట దొండపాడు దళితులపై దాడికి నిరసనగా వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో నాయకులు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైవి మాట్లాడుతూ చట్టాన్ని కాపాడాల్సిన అధికారులే చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్నారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్విన చెరువులను ధ్వంసం చేయాలని డిమాండ్ చేశారు. గుడివాడ ఆర్‌డిఒ చక్రపాణికి రహదారి వెంబడి ఉన్న రొయ్యల చెరువులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అనేక మార్లు సమస్య తీవ్రతను ఆర్‌డిఒ దృష్టికి తీసుకొచ్చినా చేద్దాం.. చూద్దాం అనే ధోరణిలో మాట్లాడడం శోచనీయమన్నారు. మహాధర్నా అనంతరం వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన వారిపై ఆర్‌డిఒ నోటిదురుసుతో మాట్లాడడాన్ని వామపక్ష నాయకులు ఆక్షేపణ తెలిపారు. సిఐలు ఎం.వి దుర్గారావు, జి.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఐదుగురు ఎస్‌ఐలు, ఎఎస్‌ఐలు, 50 మంది కానిస్టేబుల్స్, 10 మంది మహిళా కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించారు.

## నంద్యాల ఎన్నికల్లో ప్రలోభాలను అరికట్టాలి

### భారత ఎన్నికల సంఘం మాజీ సలహాదారుడు కెజె.రావు

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

నంద్యాల ఉప ఎన్నికల్లో అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా అరికట్టాలని భారత ఎన్నికల సంఘం మాజీ సలహాదారుడు కెజె.రావు పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ ఎస్.సత్యనారాయణను కెజె.రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్న అభ్యర్థులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల వ్యవస్థ ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన 'ఓటర్లు ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి' అంశంపై ముద్రించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## టిడిపి, వైసిపి ఇంటింటి ప్రచారం

**ప్రజాశక్తి - నంద్యాల**

నంద్యాలలో టిడిపి, వైసిపి నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నూనెపల్లెలోని వాసవీ కళ్యాణ మండపం నుంచి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన టిడిపి ఇంటింటి ప్రచారంలో రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్, పార్టీ జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిజి వెంకటేష్ మాట్లాడుతూ.. నేడు జరిగేది ఉప ఎన్నికలు మాత్రమేనని, టిడిపిని ఆదరిస్తే రాబోయే రెండు సంవత్సరాల్లో నంద్యాలలో అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని పేర్కొన్నారు. అలాగే పట్టణంలోని 29వ వార్డులో నంది పరిశ్రమల ఎండి సజ్జల శ్రీధర్‌రెడ్డి, 27వ 28వ వార్డులో నంది పరిశ్రమల డైరెక్టర్ సజ్జల సుజల, గుంతకల్లు ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్, 30వ వార్డులో ఎస్పీవై రెడ్డి రెండవ కుమార్తె అరవింద విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నంద్యాల నియోజకవర్గ పరిధిలోని గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి అఖిలప్రియ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి ముందు గ్రామంలోని దేవాలయంలో పూజలు నిర్వహించి, అనంతరం గ్రామంలో పర్యటించారు. టిడిపి అభ్యర్థి భూమాబ్రహ్మానందారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. పట్టణంలోని 5వ వార్డులో వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి కోడలు శిల్పా నాగినిరెడ్డి, కౌన్సిలర్ చాంద్‌బీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

## కేరళీయుల ఆయుర్ధాయం 11 ఏళ్లు ఎక్కువ

**న్యూఢిల్లీ :** భారతదేశంలో అత్యధిక, అత్యల్ప ఆయుర్ధాయం కలిగి ఉన్న రాష్ట్రాలో సగటు ఆయుర్ధాయంలో దశాబ్ధ కాలం కంటే ఎక్కువ వ్యత్యాసం ఉన్నట్లు నివేదికలు తెలియజేస్తున్నాయి. కేరళలో ఆయుర్ధాయం అభివృద్ధి చెందిన దేశాలు, యూరోపియన్ దేశాల కంటే తక్కువగా ఉంది. ఇక అస్సాం సగటు ఆయుర్ధాయం మాత్రం ఆఫ్రికా దేశాలతో పోటీ పడుతోంది. దేశంలో సగటు ఆయుర్ధాం 75 ఏళ్లతో కేరళ ముందు వరసలో ఉండగా, అస్సాం అత్యల్పంగా 64 సంవత్సరాల ఆయుర్ధాయాన్ని కలిగి ఉంది. కేరళ ఆయుర్ధాయం, చైనా, శ్రీలంక, ఇరాన్ టర్కీలకు సమానంగా ఉంది. ఇక అస్సాం ఆయుర్ధాయం సూడన్, టాంజానియా, నమీబియా, రువాండాలతో సమానంగా ఉంది. భారతదేశం సగటు ఆయుర్ధాయం కన్నా కేరళలో వ్యక్తి సగటున ఏడేళ్లు ఎక్కువ కాలం బతుకుతున్నాడు. ఇక అస్సాంలోని వ్యక్తి నాలుగేళ్లు తక్కువ కాలం బతుకుతున్నాడు. అత్యధిక ఆయుర్ధాయం ఉన్న రాష్ట్రాల్లో కేరళ, ఢిల్లీ, జమ్ముకాశ్మీర్‌లు తొలి మూడుస్థానాల్లో ఉండగా, అట్టడుగున అస్సా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లున్నాయి.

## రజనీకాంత్‌తో పూనమ్ మహాజన్ భేటీ



**చైన్నై :** ప్రముఖ సినీ నటుడు రజనీకాంత్‌తో బిజెపి యువ మోర్చా జాతీయ అధ్యక్షురాలు పూనమ్ మహాజన్ సమావేశమవ్వడంలో ఎలాంటి రాజకీయం లేదని బిజెపి అధిష్టానం స్పష్టం చేసింది. తమిళనాడు పర్యటనలో వున్న పూనమ్ మహాజన్ ఆదివారం రజనీకాంత్‌తో సమావేశమయ్యారు. ఈ విషయాన్ని ట్విటర్ ద్వారా ఆమె వెల్లడించారు. రజనీకాంత్‌ను కలుసుకోవడం చాలా ఆనందంగా వుందని అన్నారు. ఇటీవల కాలంలో రజనీకాంత్ రాజకీయాల్లో ప్రవేశిస్తారని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రజనీకాంత్-పూనమ్ మహాజన్ భేటీపై అనేక ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. రజనీకాంత్‌ను బిజెపిలోకి ఆహ్వానించడానికే పూనమ్ మహాజన్ సమావేశమయ్యారని వార్తలు వస్తున్నాయి. అయితే ఇందులో ఎలాంటి రాజకీయం లేదని బిజెపి వర్గాలు తెలిపాయి. ఇటీవల 'సరైన సమయంలో యుద్ధా నికి సిద్ధంగా వుండండి' అని రజనీకాంత్ తన అభిమానులకు పిలుపునిచ్చారు. 'రజనీకాంత్ చాలా ఉత్తమమైన మనిషి, అతన్ని రాజకీయాల్లోకి ఆహ్వానిస్తున్నాం' అని గతంలో బిజెపి అధ్యక్షులు అమిత్‌షా అన్నారు.

## గెలుపుపై అహ్మద్ పటేల్ విశ్వాసం



**అహ్మదాబాద్ :** మంగళవారం జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో గుజరాత్ నుంచి బరిలో వున్న కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ తన గెలుపుపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఆరవసారి రాజ్యసభకు వెళ్లడానికి సభ్యులు తనకు మద్దతుగా నిలుస్తారని అన్నారు. అలాగే 'రేపు ఎవరైనా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని' కూడా పటేల్ హెచ్చరించారు. బిజెపి నుంచి ముప్పు వస్తుందనే భయంతో 44 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఇక్కడి ఆనంద్ టౌన్‌లోని ఒక రిసార్ట్‌లో వుంచారు. రిసార్ట్‌కు వెలుపల విలేకరులతో అహ్మద్ పటేల్ మాట్లాడారు. 'మా ఎమ్మెల్యేలను బిజెపి ఒత్తిడిలకు గురి చేస్తోంది. కానీ వారంతా కాంగ్రెస్‌కు కట్టుబడి వున్నారు' అని అహ్మద్ పటేల్ అన్నారు. గుజరాత్ పిసిసి అధ్యక్షుడు భరత్సిన్హా సోలంకి మాట్లాడుతూ 'రేపు బిజెపి నుంచి క్రాస్ ఓటింగ్ జరుగుతుందనే నమ్మకం వుంది' అని అన్నారు. ఒక వారానికి పైగా బెంగళూరులోని రిసార్ట్‌లో వున్న 44 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సోమవారం గుజరాత్‌కు తిరిగివచ్చారు. వీరిని ఆనంద్ టౌన్‌లోని ఒక రిసార్ట్‌లో వుంచారు. 'రక్షాబంధన్ రోజున కూడా మా ఎమ్మెల్యేలు తమ ఇంటికి వెళ్ళాలని కోరుకోలేదు. సైనికులు మాదిరిగా పార్టీకి పనిచేస్తున్నారు. రేపు గాంధీనగర్‌లో జరిగే ఓటింగ్‌లో పాల్గొంటారు' అని కాంగ్రెస్ చీఫ్ విఫ్ సైలేష్ పర్మార్ తెలిపారు. అహ్మద్ పటేల్ విజయం సాధించాలంటే కనీసం 45 మంది ఎమ్మెల్యేల మద్దతు వుండాలి.

**కాంగ్రెస్‌కు ఎన్‌సిపి మద్దతు**

గుజరాత్‌లో కీలకమైన రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్‌సిపి తన మద్దతును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అహ్మద్ పటేల్‌కు ఇస్తున్నట్లు ప్రకటిచింది. ఎన్‌సిపి నుంచి తనకు మద్దతు తెలుపుతున్నట్లు సందేశం అందిందని పటేల్ సోమవారం ప్రకటించారు. ఆ పార్టీకి ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు ఉంది. ఒక జెడి(యు) ఛోటు బాయ్ వాసవ కూడా మద్దతు తెలిపినట్లు అహ్మద్ పటేల్ ప్రకటించారు.

## బిజెపిలో చేరిన తృణమూల్ ఎమ్మెల్యేలు

**అగర్తల :** త్రిపురలో ఆరుగురు తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సోమవారం బిజెపి పార్టీలో చేరారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో భేటీ అయిన తరువాత రోజే ఎమ్మెల్యేలు బిజెపిలో చేరారు. అమిత్ షాతో కలిసినప్పుడే బిజెపిలో చేరాలని ఎమ్మెల్యేలు కోరిక వ్యక్తం చేశారని బిజెపి నార్త్ ఈస్ట్ డెమొక్రటిక్ అలియన్స్ (ఎన్‌ఈడిఎ) కన్వీనర్ హిమాంత బిస్వా శర్మ తెలిపారు. కాగా, బిజెపిలో చేరిన ఆరుగురు తృణమూల్ ఎమ్మెల్యేలు సుదిప్ రాయ్ బర్మన్, అషిష్ కర్ షా, దిబా చంద్ర హ్రాంఘ్వల్, బిస్వా బంధు సేన్, ప్రంజిత్ సింగ్ రాయ్, దిలిప్ సర్కార్ ఇటీవల రాష్ట్రపతి ఎన్నికల్లో మమతా బెనర్జీ ఆదేశాలను ధిక్కరించి ఎన్‌డిఎ అభ్యర్థికి ఓటు వేశారు.

## గోవా కాసినోలపై బిజెపి ద్వంద్వ వైఖరి

- మూసివేస్తామంటూ ప్రభుత్వ ప్రకటన
- కొనసాగిస్తామంటున్న సిఎం

**పనాజి :** గోవా బీచ్‌లలో కాసినోల మూసివేతపె బిజెపి ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అనుసరిస్తోంది. సముద్ర తీరంలో కాసినోలను మూసివేసేందుకు చర్యలు తీసుకుంటామని ఇటీవల ప్రకటించిన ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ తాజాగా వీటికి సంబంధించి భిన్న మైన వైఖరిని ప్రకటించారు. కాసినోలను వేరే ప్రాంతానికి తరలించుకోవడానికి ప్రభుత్వం అనుమతిస్తుందని తెలిపారు. గోవాలో తమ వ్యాపారాన్ని కొనసాగించాలనుకుంటే మూడేళ్ళలోగా తీర ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి తరలి వెళ్ళాలని తెలిపారు. గతంలో కాసినోలను వ్యతిరేకించిన బిజెపి ఇప్పుడు వాటికి అనుకూలంగా వ్యవహరిస్తూ అనుమతించడం పట్ల నిరసనలు వ్యక్తమవుతున్నాయి. తన నిర్ణయం సరైనదేనని పేర్కొంటూ కాసినోలు వల్ల ఉద్యోగాలు వస్తున్నాయని, ఆదాయంతో పాటు రాష్ట్ర పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతోందన్నారు. వాటిని రద్దు చేసి పెట్టుబడిదారుల మనోభావాలను గాయపరచలేమని చెప్పారు. ప్రస్తుతం గోవా తీరంలో ఆరు కాసినోలు, వేరే ప్రాంతలో పది కాసినోలు తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అత్యధిక వాటాలతో జూదమాడే వారిని నౌకలపై ఉన్న కాసినోలకు మాత్రమే అనుమతిస్తారు. అక్కడ ఈ వ్యాపారానికి సంబంధించిన లైసెన్స్‌లను రెన్యువల్ చేయడం, బదిలీ చేయడం చేస్తారు. గోవాలో నిర్వహించే కాసినో వ్యాపారంలో జేదేవ్ మోడీకి చెందిన డెల్టా కార్పొరేషన్ లిమిటెడ్ అతి పెద్దది.

## పారిశుధ్య కార్మికుల మృతి పట్ల సిపిఎం దిగ్భ్రాంతి

**న్యూఢిల్లీ, ఇండియా న్యూస్ నెట్‌వర్క్ :** మురుగు కాల్వను శుభ్రం చేస్తూ ఊపిరి అందక దక్షిణ ఢిల్లీలోని లాజ్‌పేట్‌లోని జల విహార్ ప్రాంతంలో ముగ్గురు కార్మికులు మృతి చెందిన ఘటన పట్ల సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. నెల రోజుల వ్యవధిలో ఇలాంటి ఘటన జరగడం ఇది రెండోసారి. ఇంతకుముందు ఘితోర్నిలో ఇలాంటి సంఘటనలోనే నలుగురు కార్మికులు మృతి చెందారు. ఈ రెండు ప్రాంతాలు కూడా దక్షిణ ఢిల్లీ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. కాంట్రాక్టర్, ఢిల్లీ జల్ బోర్డ్ జూనియర్ ఇంజనీర్ ఆదేశాలతోనే ఒప్పంద కార్మికులు ఈ ప్రాణాంతక పనికి పూనుకొన్నట్లు వార్తలు వస్తున్నాయి. మురుగు కాల్వలను మనుషులు శుభ్రపర్చడాన్ని నిషేధించినప్పటికీ ఢిల్లీలో ఇది సర్వసాధారణంగా మారిందని సిపిఎం విమర్శించింది. పైగా కార్మికులకు గమ్‌బూట్స్, గ్లోవ్స్, మాస్క్.. వంటి రక్షణ పరికరాలు కూడా ఇవ్వడం లేదని తెలిపింది. మురుగు కాల్వలను మనుషులతో శుభ్రం చేయించడం మరణాలను ఆహ్వానించడమేనని పేర్కొంది. మృతుల కుటుంబాలకు 10 లక్షల రూపాయిల నష్టపరిహారం ఇవ్వాలని, మాన్యువల్ క్లీనింగ్ స్థానంలో యంత్రాలను ప్రవేశపెట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ విషాదానికి జూనియర్ ఇంజనీర్, కాంట్రాక్టర్, దక్షిణ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు బాధ్యత వహించాలని, వారిని డిస్‌మిస్ చేసి వారిపై ఐపిసి సెక్షన్ల కింద హత్యకేసు నమోదు చేయాలని డిమాండ్ చేసింది.

## స్వయం ప్రతిపత్తిని

# నిర్వీర్యం చేసేందుకే ..!



**న్యూఢిల్లీ :** రాజ్యాంగంలోని ఆర్టికల్ 35ఎను నిర్వీర్యానికి బిజెపి ప్రయత్నాలు జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హోదాపై దాడి చేయడమేనని పలువురు నేతలు, చరిత్ర కారులు పేర్కొంటున్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని "శాశ్వత నివాసులు" పదాన్ని నిర్వచించేందుకు జమ్మూ కాశ్మీర్ శాసన సభను అనుమతించేందుకు ఆర్టికల్ 35 ఎ తోడ్పడుతుంది. ఓటు హక్కు పొందేందుకు, రాష్ట్ర ప్రభుత్వం కోసం పనిచేసేందుకు, సొంత భూమి పొందేందుకు ఎవరు అర్హులు అనే విషయాన్ని ఆర్టికల్ 35 ప్రాతిపదికగా రాష్ట్ర అసెంబ్లీ నిర్ణయిస్తుంది. ఈ నిబంధనను మార్పు చేయాలన్నది బిజెపి ఎన్నికల హామీలలో ఒకటి. రాష్ట్ర జనాభాకు సంబంధించిన అంశాలను మార్పు చేయడంలో ఏర్పడిన ఘర్షణలకు ముగింపు పలికేందుకు సంఘ్ ప్రతిపాదించిన విధానం. సుప్రీం కోర్టులో ఒక కేసు నేపథ్యంలో ఈ విషయం మళ్ళీ వెలుగులోకి వచ్చింది.

ఆర్టికల్ 35ఎను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీకి చెందిన "ఉయ్ ద సిటిజన్స్" స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆర్టికల్ 35 ఎ రాజ్యాంగ విరుద్ధంగా ఉందని పేర్కొంది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరుపున కోర్టుకు హాజరైన అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్ తన వాదనను వినిపిస్తూ ఇది సున్నిత స్వభావం కలిగిన అంశమని, దీనిపై విస్తృత చర్చ జరపాలని కేంద్రం కోరుతున్నదని ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనానికి విన్నవించారు. ఈ అంశంలో రాజ్యాంగ పరమైన విషయాలు ఇమిడి ఉన్నందును మరో పెద్ద ధర్మాసనం పరిశీలనకు పంపాలని ఆయన కోరారు. దీనికి కోర్టు అంగీకరించింది. ముగ్గురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఆరు వారాల్లోగా దీనిపై విచారణ జరుపుతుందని తెలిపింది. ఈ నెలాఖరుకు విచారణ పూర్తి చేస్తామని పేర్కొంది.

**ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ ఖండన**

దీనిపై నేషనల్ కాన్ఫరెన్స్ నేత, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ ఆర్టికల్35ఎ చట్టబద్ధతపై చర్చ జరిగే పక్షంలో విలీన అంశంపై కూడా చర్చ జరపాలన్నారు. భారత సమాఖ్యలో జమ్మూ కాశ్మీర్ విలీనం, దాని ప్రత్యేక హోదాలు ఒకే నాణానికి రెండు వైపుల వంటి అంశాలన్నారు. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఎపై జమ్మూ కాశ్మీర్, భారత ప్రభుత్వం మధ్య చర్చ జరిగిందని ఆయన చెప్పారు.

పిడిపి నాయకురాలు, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ ఆర్టికల్ 35ఎను నిర్వీర్యం చేసే ప్రయత్నం రాష్ట్రంలోని భారత జాతీయ వాదులకు పెద్ద దెబ్బ అని పేర్కొన్నారు. ఆర్టికల్ 35ఎను ఎవరు, ఎందుకు సవాల్ చేస్తున్నారని జులై నెలాఖరులో ఢిల్లీలో ముఫ్తీ ప్రశ్నించారు. సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకూడదన్న ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయంపై ముఫ్తీ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై కేంద్రం స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకుంటుందని భావిస్తున్నట్లు పిడిపి నాయకుడు, రాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రి నయీమ్ అఖ్తర్ తెలిపారు.

**సమర్థించిన బిజెపి**

మెహబూబా వ్యాఖ్యలను బిజెపి ఖండించింది. ఆర్టికల్ 35ఎను ముట్టుకోకూడదనడానికి అది పవిత్రమై గోవు లాంటిది కాదని రాష్ట్ర బిజెపి శాఖ వ్యాఖ్యానించింది. ఆర్టికల్ 35ఎ, 370లు రెండు కూడా తాత్కాలికమైనవేనని పేర్కొంది.

ఆర్టికల్ 35ఎ రాజ్యాంగ విరుద్ధమైనదని స్వచ్ఛంద సంస్థ పిటిషనల్‌లో పేర్కొనడాన్ని చరిత్రకారులు కూడా ప్రశ్నించారు. ఆర్టికల్ 35ఎను రాజ్యాంగ సవరణ ద్వారా అందులో చేర్చక పోయినంత మాత్రాన అది చట్ట విరుద్ధమైందని పేర్కొనడం సరికాదన్నారు. స్వాతంత్ర్యా నంతరం కాశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా ఈ ఆర్టికల్స్‌ను రూపొందించడం జరిగిందని చరిత్రకారులు పేర్కొంటున్నారు.

## జడ్జిల నియామకంపై

# కేంద్రం విజ్ఞప్తికి కొలీజియం నో!

**న్యూఢిల్లీ :** సుప్రీం కోర్టు, హై కోర్టులలో న్యాయ మూర్తుల నియామకానికి సంబంధించి తమ వైఖరిని సమీక్షించుకోవాలన్న కేంద్ర ప్రభుత్వం అభ్యర్ధనను తిరస్కరించాలని సుప్రీం కోర్టు కొలిజియం నిర్ణయించింది. ఈ విషయమై కొలిజియంలోని ఐదుగురు సభ్యులు ఏకాభిపాయం తెలిపినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తుది నిర్ణయాన్ని రిజర్వు చేసేందుకు కొలిజియం తన అధికారాన్ని వినియోగించబోదని, ఇది చర్చించే విషయం కాదని, నేరుగా న్యాయ వ్యవస్థ స్వతంత్రకు సంబంధించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది మార్చి నెలలో కొలిజియం ప్రభుత్వానికి పంపిన మెమోరాండం ఆఫ్ ప్రొసీడ్యర్ (ఎంఒపి) తుది ముసాయిదాలో మార్పులు చేయకూడదని ఇటీవల జరిగిన సమావేశంలో న్యాయమూర్తులు అభిప్రాయ పడినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఎంఒపి తాజా ముసాయిదాపై తమ వైఖరిని పున: పరిశీలించుకునే అవసరం లేదని కొలిజియం భావిస్తున్నట్లు కోర్టు సెక్రటరీ జనరల్ ద్వారా ప్రభుత్వానికి తెలియచేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. న్యాయమూర్తులు జె చలమేశ్వర్, రంజన్ గగోయ్ కూడా ఈఅభిప్రాయాన్ని అంగీకరించారు. జులై నెలో ఈ ఇద్దరు న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పుతో ఎంఒపి ముసాయిదాపై మూడో సారి, తుదిసారి సమీక్షించాలని కోరే అవకాశం ప్రభుత్వానికి లభించింది. గత నెలలో కోర్టు ధిక్కార నేరం కింద జస్టిస్ కర్ణన్‌కు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పిన సందర్భంలో దేశంలో న్యాయ నియామకాల వ్యవస్థ మరింత లక్ష్యాత్మకంగా ఉండాలని పేర్కొన్నారు.

సుప్రీం కోర్టు, హైకోర్టులలో న్యాయమూర్తులను సమగ్రత, సమర్థతల ఆధారంగా నియిమంచాలని వారు ప్రత్యేంగా ఇచ్చిన తీర్పులో పేర్కొన్నారు. తగిన ప్రమాణాలతో న్యాయమూర్తులను నియమించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం అన్ని నియామకాలు కొలీజియం సిఫార్సులపైనే జరుగుతున్నాయి. ప్రభుత్వానికి కొన్ని అభ్యంతరాలు ఉన్నప్పటికీ నియామకంపై తన తుది నిర్ణయాన్ని కొలీజియం రిజర్వు చేసుకుంటుంది. దీంతో నేషనల్ జ్యుడిషియల్ అపాయింట్ మెంట్స్ కమిషన్ (ఎన్‌జెఎసి) ద్వారా న్యాయమూర్తులను నియమించే విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో సుప్రీం కోర్టు న్యాయమూర్తులతో పాటు, న్యాయ శాఖ మంత్రి, మరో ఇద్దరు ప్రముఖ వ్యక్తులు సభ్యులుగా ఉండి న్యాయమూర్తుల నియామక ప్రక్రియను నిర్వహిస్తారు. అయితే ఎన్‌జెఎసి రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు ప్రకటించింది. ప్రస్తుతమున్న వ్యవస్థ ద్వారా న్యాయమూర్తుల నియామకంలో మరింత పారదర్శకత తెచ్చేందుకు తగిన మార్పులతో కొత్త ఎంఒపిని తెస్తే సరిపోతుందని తెలిపింది.

## పన్నీరు వైపు కత్తితో దూసుకొచ్చిన వ్యక్తి..

- తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌లో ఘటన
- అడ్డుకున్న భద్రతా సిబ్బంది

**చెన్నై :** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీరు సెల్వం వద్దకు తిరుచ్చి విమానాశ్రయంలో ఒక వ్యక్తి కత్తితో దూసుకురావడం కలకలం రేపింది. ఉదయం 11 సమయంలో సెల్వం తిరుచ్చి విమానాశ్రయానికి చేరుకున్న సెల్వం పాత్రికేయులతో మాట్లాడుతూ ఉండగా, గుర్తు తెలియని వ్యక్తి ఆయనవైపుగా దూసుకొచ్చాడు. ఇది గమనించిన కేంద్ర పారిశ్రామికదళం భద్రతా అధికారి ఆయన్ను అడ్డుకున్నాడు. అయితే ఆ కుదుపులో అతని ధోతిలో దాచిన కత్తి కిందపడింది. దీన్ని గమనించిన సెల్వం అనుచరులు ఆ వ్యక్తిని చితక బాదారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగింది. ఈ ఘటనలో నిందితుడు సోలైరాజు (48)గా పోలీసులు గుర్తించారు. ఘటనపై నిందితుడు సోలైరాజన్ వాగ్మూలం ఇస్తూ 30 ఏళ్లగా ఆయనకు అన్నా డిఎంకె సభ్యత్వం ఉందన్నారు. ఎంజిఆర్ మండ్రం స్థానిక శాఖ నాయకుడిగా పన్నీరు సెల్వానికి తాను వీరాభిమానిగా ఉన్నట్లు తెలిపారు.. సెల్వంతో సెల్ఫీ దిగి దాన్ని కుమార్తె వివాహ వేడుకల్లో బ్యానర్‌గా కట్టడానికి ఆయన వద్దకు వెళ్లినట్లు తెలిపారు. అయితే పాలకేంద్రం వద్ద తాళపు గుత్తితో పాటు ఉన్న కత్తిని నడుముకు కట్టుకోవడంతో ఈ ఘటన జరిగిందని వాపోయాడు.

## అణ్వాయుధ నిషేధ ఒప్పందానికి కట్టుబడం : పాక్

**ఇస్లామాబాద్ :** అణ్వాయుధాల నిషేధంపై ఇటీ వల కుదుర్చుకున్న ఒప్పందానికి తాము కట్టుబడి ఉండమని పాకిస్తాన్ సోమవారం తెలిపింది. భాగస్వాముల అందరి ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవడంలో అది విఫలమైందని పేర్కొంది. ఈ మేరకు పాక్ విదేశాంగ కార్యాలయం ప్రకటించింది. జులై 7న ఓటు ద్వారా ఆమోదం పొందిన అణ్వాయుధాల నిషేధ ఒప్పందం అటు విషయ పరంగాను, ఇటు విధానపరంగాను ముఖ్యమైన షరతులను నెరవేర్చడంలో విఫలమైందని ప్రకటన పేర్కొంది. తాము ఆ చర్చల్లో పాల్గొన లేదని, ఒప్పందంలో భాగస్వాములం కావడం లేదని తెలిపింది. అణ్వాయుధాలను నిషేధించేందుకు ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ఒక అంతర్జాతీయ ఒప్పందంపై ఐక్యరాజ్య సమితిలోని 120కి పైగా దేశాలు ఓటు వేశాయి. చర్చల్లో అమెరికా, చైనాలతో పాటు 8 అణ్వాయుధ దేశాలు పాల్గొనలేదు. "ఈ ఒప్పందాలు భాగస్వాముల అందరి ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా వాటి లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమయ్యాయి. ఈ ఒప్పందంలో పొందుపరచ బడిన బాధ్యతలకు కట్టుబడి ఉండే అంశాన్ని పాకిస్తాన్ పరిగణనలోకి తీసుకోదు" అని ఆ ప్రకటన పేర్కొంది.

## చరిత్ర పాఠాల్లో ముగిసిన మొగల్ శకం

- అక్బర్ చరిత్ర మూడు వాక్యాలే!
- పాఠ్యపుస్తకాల్లో నుండి తొలగింపు

**న్యూఢిల్లీ :** రాజస్థాన్ యూనివర్శిటీ తన సిలబస్‌లోని ఒక పుస్తకంలో అక్బర్‌ను మహారాణా ప్రతాప్ ఓడించినట్లు పేర్కొనగా, తాజాగా మహారాష్ట్ర ఎడ్యుకేషన్ బోర్డు మాత్రం మొగల్ చక్రవర్తిని మూడులైన్లకు కుదించేసింది. ఆ మేరకు మహారాష్ట్ర ఎడ్యుకేషన్ బోర్డు ఏడు, తొమ్మిది తరగతుల చరిత్ర పాఠ్యాంశాల్లో మార్పులు చేసినట్లు ముంబయి మిర్రర్ నివేదిక పేర్కొంది. ఆ నివేదిక ప్రకారం మొగల్ పాలనా కాలం నాటి ప్రాధాన్యతాంశాలను తొలగించి ఆ స్థానంలో మరాఠా సామ్రాజ్య స్థాపకుడు శివాజీకి ప్రాధాన్యత ఇచ్చారు. అక్బర్‌కు సంబంధించిన పాఠ్యాంశాల్లో గతేడాది 'అక్బర్ ఉదారంగా, సహనంగా వ్యవహరించే కార్యదక్షుడు' అని ఉందనీ, అయితే ఈ ఏడాది మాత్రం భారత్‌ను 'ఏక కేంద్ర పరిపాలన కిందుకు తేవాలి అని చూశాడని నివేదిక తెలిపింది. గత పాఠ్యపుస్తకాల్లో అక్బర్‌ను 'ప్రజల రాజు' అని కీర్తించారు. అయితే ఈ ఏడాది మాత్రం 'ఆదర్శవంతమైన పాలకుడు' అని ఉందన్నారు. మధ్యయుగాల చరిత్రలో శివాజీ కుటుంబ సభ్యులు, మరాఠాకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత నిచ్చారు. ఏడవ తరగతి చరిత్ర పుస్తకాల్లో ముస్లిం పాలకుల ప్రాధాన్యతను తగ్గించారు. రజియా సుల్తాన్, మహ్మద్ బీన్ తుగ్లక్‌ల గురించిన అంశాలను విస్మరించారు. 'రుపాయి'ని ఆఫ్ఘన్ వ్యాపారులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఇక మరో వైపు బోఫోర్స్ కుంభకోణం, ఎమర్జన్సీ కాలం నాటి అంశాలను కూడా పాఠ్యపుస్తకాల్లో పొందుపరిచారు. ఢిల్లీని పాలించిన తొలి మహిళ రజియా సుల్తానా పేరు పాఠ్యాంశాల్లో లేదు.

హుమామూన్‌ను షేరా షా సూరి బలవతంగా భారతదేశం నుంచి పంపించారని పేర్కొన్నారు. దీనిపై చరిత్ర పాఠ్యపుస్తకాల మార్పుల కమిటీ సభ్యులు బాపుసాహెబ్ షిండే మాట్లాడుతూ ఆధునిక చరిత్ర వచ్చే కొద్ది పాత చరిత్రను మార్చడం సాధారణమేనన్నారు. ఆధునిక చరిత్రను తెలియజేయడానికి మధ్య యుగాల చరిత్రకు ప్రాధాన్యత తగ్గించామన్నారు. రివిజన్ సిలబస్‌ను మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి వినోద్ తవేదీ పర్యవేక్షించారు. దీనిపై స్వతంత్ర పరిశీలకుడు కిషోర్ దరక్ మాట్లాడుతూ చరిత్ర పాఠ్యపుస్తకాలపై కాషాయ జెండాలు ప్రచురించారని, హిందూ సామ్రాజ్య ఉనికి అనే అంశాన్ని ముందుకు తెచ్చారని అభ్యంతరం వ్యక్తం చేశారు.

## సిసిటివి ఫుటేజ్ లేదు

రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేత ఎం. అఫ్జల్ డిమాండ్ చేశారు.

**వర్ణిక కుందుకు తండ్రి ప్రశంసలు**

కాగా వర్ణిక తండ్రి వీరేందర్ కుందు తన కుమార్తెకు ఎదురైన ఈ సంఘటన ఆమెకు కఠిన పరీక్ష లాంటిదని ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. ఈ కేసును ఎదుర్కొనే విషయంలో ఆమెకు ఎంతో ధైర్యాన్ని నూరి పోశారు. ఈ సంఘటనలో నింది తులు సమాజంలో పేరు పొందిన కుటుంబాలకు చెందిన వారని ఆయన చెప్పారు. పలు వేధింపుల కేసులో ఫిర్యాదులుండవు, శిక్షలు ఉండవన్న సంగతి తెలిసిందేనన్నారు. పలుకుబడి గల కుటుంబాలకు చెందిన నిందితులపై ఫిర్యాదు చేసేందుకు ఎవరూ సాహసించరన్నారు. అయితే తమ లాంటి కుటుంబా లకు చెందిన కొంత మందైనా నేరాలకు ఎదురొడ్డి నిలవాలని కుమార్తెకు ధైర్యాన్ని చెప్పారు. వీరేందర్ కుందు హర్యానాలో ఐఎఎస్ అధికారిగా పనిచేస్తున్నారు.

**సుభాష్ బరాల ప్రతిష్టను దెబ్బతీసేందుకే : కుటుంబ సభ్యులు**

అంతకుముందు శనివారం హర్యానా బిజెపి అధ్యక్షుడు సుభాష్ బారాల ప్రతిష్టను దెబ్బతీసేందుకే ప్రతిపక్షాలు ఈ ఘటనను తప్పుదో పట్టిస్తున్నాయంటూ వికాస్ బరాల కుటుంబ సభ్యులు విమర్శించారు. బాధితురాలిని వికాస్ కుటుంబం సామాజిక మాధ్యమంలో అవమానించింది. బరాల కుటుంబ సభ్యులలో ఒకరైన కులదీప్ బరాల ఇద్దరు వ్యక్తులతో కలిసి ఉన్నట్లున్న బాధితురాలి ఫొటోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. ఇప్పుడా పోస్ట్‌ను ఫేస్‌బుక్ నుంచి తొలగించారు. సంఘటన జరిగిన సమయంలో ఆమె తాగిన స్థితిలో ఉందంటూ కులదీప్ ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. మరొక వ్యక్తి వర్ణిక కుందు ఆల్కహాల్ గ్లాసులతో ఉన్న ఫొటోను పోస్ట్ చేసి, ఆమె ప్రవర్తనపై ప్రశ్నలు లేవనెత్తేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటన విషయంలో పోలీసులు ద్వంద్వ వైఖరి అవలంభించారని ఆయన ఆరోపించారు. డిఎస్‌పి సతీష్ కుమార్ తొలుత మీడియాతో మాట్లాడుతూ నిందితులపై నాన్ బెయిలబుల్ అభియోగాలు నమోదయ్యాయని చెప్పారు. ఆ తరువాత నేరానికి తగిన విధంగా ఆ అభియోగాలు లేవంటున్నారని బరాల కుటుంబ సభ్యులు ఆరోపించారు. సీనియర్ బిజెపి నేత కుమారుడు వికాస్ బరాల, అతని స్నేహితుడ్ని పోలీసులు అరెస్టు చేసి వెంటనే బెయిల్‌పై విడుదల చేశారు. సుభాష్ బారాల కుమారుడు వికాస్ బరాల, అతని స్నేహితుడు అశిష్ కుమార్‌లు నగర వీధుల్లో తనను వేధించారంటూ వర్ణిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

## వాళ్ళే సిగ్గు పడాలి!

మొదటి పేజీ తరువాయి


వేధింపులకు గురిచేసినందుకు వారే సిగ్గు పడాలని ఆమె ఇక్కడ విలేకరులతో అన్నారు. వర్ణిక మీడియాకు దూరంగా ఉంటున్నారంటూ పత్రికలలో కథనాలు వెలువడిన నేపథ్యంలో వర్ణిక సోమవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కర్ణిక శుక్రవారం రాత్రి ఎదుర్కొన్న సంఘటనను ఆమె ప్రస్తావిస్తూ సమయానికి పోలీసులు వచ్చి కాపాడారని తెలిపింది. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపింది. బేటి బచావో అంటూ నినదించే నేతల కుమారులే ఇటువంటి సంఘటనలకు ఒడిగట్టడం విచారకరమన్నది. వర్ణిక తండ్రి, ఐఎఎస్ అధికారి మాట్లాడుతూ తన కుమార్తెను వేధింపులకు గురిచేసిన వారికి శిక్ష పడే వరకు నిద్రపోనని తెలిపారు. అయితే ఆయన విలేకరుల ఎదుట హాజరు కాలేదు. తల్లిదండ్రుల అండతో తాను కూడా న్యాయ పోరాటం చేస్తానని వర్ణిక చెప్పింది. ఏదో ఒక రోజు నిందితులకు శిక్ష పడుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఈ విషయమై సామాజిక మాధ్యమాల్లో తనకు ఊహించని మద్దతు లభిస్తోందని తెలిపింది.

**టాప్ 10 వార్తల్లో ....కర్ణిక కుందు**

ఐఎఎస్ కుమార్తె వర్ణికపై హర్యానా బిజెపి అధ్యక్షుని కుమారుడు సాగించిన దుశ్చర్య వార్త ఆదివారం సంచలనం సృష్టించింది. అప్పటికింకా బాధితురాలి పేరు తెలియకపోవడంతో లక్షలాది మంది నెటిజన్లు గూగుల్‌ను ఆశ్రయించారు. ఆమె పేరు కోసం ఈ ఘటనకు సంబంధించి వివిధ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలను ఆసక్తికరంగా వెతికారు. ఈ ఘటన ఆరోజు టాప్ 10 వార్తల్లో ప్రముఖంగా నిలిచింది.

## గ్యాస్ సబ్సిడీని తొలగించేది లేదు

### ప్రజల ఆందోళనతో దిగివచ్చిన ప్రభుత్వం



**అగర్తలా :** పేదలు గృహావసరాలకు ఉపయోగించే ఎల్‌పిజి సిలిండర్లపై సబ్సిడీని తొలగించేది లేదనీ కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ పేర్కొన్నారు. పేదలకు వినియోగించే కిరోసిన్, గ్యాస్‌లపై సబ్సిడీ కొనసాగుతుందని తెలిపారు. త్రిపుర రాజధాని అగర్తలలో ఉజ్వల యోజన పథకం కింద 20 మందికి గ్యాస్ కనెక్షన్‌లు అందజేసిన ఆయన మాట్లాడారు. బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ నుంచి త్రిపుర వరకు పైపులైన్లు వేస్తామనీ, తెలిపారు. దీనిపై ఇప్పటికే ప్రతిపాదన ఉందనీ, త్వరలో బంగ్లాదేశ్‌లో పర్యటించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పశ్చిమబెంగాల్‌లోని సిలిగురి నుంచి బంగ్లాదేశ్ పర్వతీపూర్‌కు డీజిల్ సరఫరాకు పైప్‌లైన్ వేయనున్నట్లు తెలిపారు. గ్యాస్‌పై రాయితీని తొలగిస్తామనీ, సిలిండెర్‌పై నెలకు రూ.4 చొప్పున పెంచుతామని కేంద్రం లోక్‌సభలో ప్రకటించిన తర్వాత ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ధర్మేంద్ర ప్రదాన్ ఈ విధంగా స్పందించారు.

## గో గూండాల దాడికి ప్రతిఘటన

**అహ్మద్‌నగర్ :** ఆవులను వధశాలకు తరలిస్తున్నారనే ఆరోపణలపై పోలీసు స్టేషన్‌కు చేరిన వారిపై గో గూండాలు దాడికి యత్నించగా, ప్రతిఘటించిన స్థానికులు గో గూండాలను చితక బాదిన సంఘటన మహారాష్ట్రలోని అహ్మద్ నగర్‌లో జరిగింది. పశువధ శాలకు ఆవులను తరలిస్తున్న వాహనాన్ని శనివారం రాత్రి దౌండ్-అహ్మద్‌నగర్ మధ్య పోలీసులు అడ్డుకున్నారు. ఆ వాహనం యజమానులు వాహిద్ షేక్, రాజు ఫన్నుభాయ్ షేక్‌లను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఇదే సమయంలో పూణేకు చెందిన శివశంకర్ రాజేంద్రస్వామి, 11 మంది గో సంరక్షకులు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. తాము 'అఖిల భారత కృషి గో రక్షక్ సంఘ్' కార్యకర్తలమని హడావిడి చేశారు. అక్రమంగా ఆవులను తరలించే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వంద కిలోమీటర్ల దూరంలోని పూణే నుంచి వీరు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వారు పోలీసు స్టేషన్‌కు వెలుపలకు రాగా, సాయుధులైన కొంత మంది వ్యక్తులు గోగూండాలపై దాడి చేశారు. ఈ ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి.

## అంబులెన్స్‌ను అడ్డగించిన బిజెపి కౌన్సిలర్

### రోగి మృతి

**చండీగఢ్ :** తన కారును ఢీ కొందన్న కారణంతో అంబులెన్స్‌ను సుమారు గంటన్నరకు పైగా బిజెపి కౌన్సిలర్ అడ్డగించడంతో అందులో వున్న రోగి మృతి చెందిన సంఘటన హర్యానాలో జరిగింది. వివరాల్లోకి వెళితే శనివారం నవీన్ సోని (42) అనే రోగిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకుని వెళుతున్నారు. దారిలో ఫతేహబాద్ కౌన్సిలర్ దర్శన్ నాగ్‌పాల్ కారును అంబులెన్స్ స్వల్పంగా ఢీకొంది. దీంతో అంబులెన్స్‌ను నాగ్‌పాల్ ఆపివేశాడు. తనకు జరిగిన నష్టానికి పరిహారం ఇవ్వాలని పట్టుపడ్డాడు. ఈ గొడవ కారణంగా గంటన్నర ఆలస్యంగా అంబులెన్స్ ఆసుపత్రికి చేరింది. అప్పటికే నవీన్ సోని మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కనీసం 15 నిమిషాలు ముందు తీసుకుని వస్తే నవీన్ సోని బతికేవాడని వైద్యులు తెలిపినట్లు రోగి బంధువులు అంటున్నారు. నాగ్‌పాల్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు వచ్చిందని, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఐదుగురు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్ :** జమ్ముకాశ్మీర్‌లోని మచిల్ సెక్టార్‌లో ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని భద్రతా దళాలు సోమవారం అడ్డుకున్నాయి. ఐదుగురు ఉగ్రవాదులు వాస్తవాధీన రేఖ దాటుతూ భద్రత దళాల చేతిలో హతమయ్యారు. వీరి వద్ద నుంచి ఐదు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు రక్షణ శాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో కూంబింగ్ ఇంకా కొనసాగుతోందని రక్షణ మంత్రిత్వశాఖ ప్రతినిధి కల్నల్ రాజేష్ కలియా చెప్పారు. ఈ ఏడాది కాలంలో వాస్తవాధీన రేఖ(ఎల్‌ఒసి) వద్ద చొరబాట్లుకు యత్నించిన 40 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు అధికారులు తెలిపారు.

## బిఇఎస్‌టి సమ్మె విజయవంతం

**ముంబయి :** బృహ్మన్‌బాయ్ ఎలక్ట్రికల్ సప్లై అండ్ టాన్స్‌పోర్టు (బిఇఎస్‌టి) కార్మికులు సోమవారం చేపట్టిన సమ్మె విజయవంతమైంది. సమ్మె ప్రభావంతో 3,800 బస్సులు రోడ్లపైకి రాకుండా నిలిచాయి. దీంతో లక్షలాది మంది ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో బిఇఎస్‌టితో పాటు బిఎంసి కార్మికులు ఐదురోజులుగా నిరసన తెలుపుతున్నారు. బిఇఎస్‌టి ఆధ్వర్యంలో మొత్తం 35,000 మంది కార్మికులుండగా వీరి ఆధ్వర్యంలో 483 రూట్లలో 3,800 బస్సులున్నాయి. ఈ సంస్థ నిత్యం రూ. రెండు కోట్ల నష్టాలను భరిస్తోందనీ, ఈ నేపథ్యంలో కార్మికులకు చెల్లింపులు సక్రమంగా చేయడం లేదనీ బిఇఎస్‌టి అధికారులు పేర్కొంటున్నారు. సమ్మెపై బిఇఎస్‌టి ఉద్యోగ సంఘ నాయకుడు శశాంకరావు మాట్లాడుతూ వేతనాలపై బిఎంసి అధికారుల నుంచి లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. అయితే హామీ లభించకపోవడంతో ఆదివారం నుంచి విధులకు హాజరుకాకుడదని నిర్ణయించినట్లు తెలిపారు.

# రష్యాతో విభేదాలను సర్దుబాటు చేసుకుంటాం

## అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్సన్

**మనిలా :** రష్యాతో వున్న విభేదాలను సర్దుబాటు చేసుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా వుందని అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్సన్ ప్రకటించారు. ఏవో కొన్ని విభేదాలున్నంత మాత్రాన సంబంధాలు తెగతెంపులు చేసుకుంటామనటం అర్థరహితమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం నాడు రష్యా విదేశాంగ మంత్రి సెర్జీ లెవరోవ్‌తో భేటీ అయిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇరుదేశాల మధ్య పీటముడిగా బిగిసిన ఉక్రెయిన్ విషయంలో విభేదాల పరిష్కారానికి రష్యా సంసిద్ధత వ్యక్తం చేసిందని ఆయన చెప్పారు. అమెరికా రష్యా సంబంధాలను తాము సానుకూల దృష్టితో పరిశీలిస్తున్నామని, సమస్యలేవైనా వుంటే పరిష్కరించుకోవచ్చని భావిస్తున్నామని ఆయన చెప్పారు. తమ దేశ ఎన్నికల్లో జోక్యం చేసుకోవటం అత్యంత తీవ్రమైన అంశంగా తాము పరిగణిస్తున్న



విషయాన్ని రష్యా అర్థం చేసుకోవాల్సిన అవసర ముందనిలెవరోవ్‌కు వివరించానన్నారు.

**ద.చైనా సముద్రంలో చైనా నిర్మాణాలపై విమర్శ**

దక్షిణ చైనా సముద్రంలోని దీవిలో చైనా భవన నిర్మాణాన్ని చేపట్టటం, ఆ దీవిని సైనికీకరణ చేస్తుండటంపై అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఈ సముద్ర ప్రాంతం ద్వారా దాదాపు 5 లక్షల కోట్ల డాలర్ల విలువైన నౌకా వాణిజ్యం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సముద్ర ప్రాంతం పై చైనా చేస్తున్న ప్రకటనలు అర్థరహితమని ఈ దేశాల విదేశాంగ మంత్రులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

## ఆఫ్ఘనిస్తాన్‌లో 50 మంది గ్రామీణుల ఊచకోత

**కాబూల్ :** ఆఫ్ఘనిస్తాన్ ఉత్తర ప్రాంతంలోని సరేపుల్ ప్రావిన్స్‌లో ఒక గ్రామంపై దాడి చేసిన కొందరు మిలిటెంట్లు మహిళలు, చిన్నారులతో సహా దాదాపు 50 మందిని ఊచకోత కోసినట్లు అధికారులు చెప్పారు. కొంతమంది విదేశీ ఉగ్రవాదులతో కూడిన ఈ మిలిటెంట్ల బృందం సయాద్ జిల్లా మీర్జా ఒలాంగ్ ప్రాంతంలోని సెక్యూరిటీ ఔట్‌పోస్ట్‌పై దాడి చేసిన అక్కడి దాదాపు 30 ఇళ్లను దగ్ధం చేసిందన్నారు. ఈ దాడిలో మిలిటెంట్లకు, గ్రామీణులకు మధ్య జరిగిన పోరులో దాదాపు 50 మంది వరకూ మహిళలు, చిన్నారులు, వృద్ధులు ప్రాణాలు కోల్పోయారని, వీరంతా షియా హజారా వర్గానికిచెందిన వారని ఆయన వివరించారు. మిలిటెంట్లు వారిని అత్యంత కిరాతకంగా, అమానుషంగా వధించారని ఆయన చెప్పారు. ఈ దాడిలో ఆఫ్ఘన్ భద్రతా దళాలకు చెందిన ఏడుగురు సభ్యులు, ఒక మిలిటెంట్ కూడా ప్రాణాలు కోల్పోయారన్నారు.



## వియత్నాంలో వరద బీభత్సం

### 26 మంది మృతి, 4.1 కోట్ల డాలర్ల ఆస్తినష్టం

**హనోయ్ :** గత వారం వియత్నాం ఉత్తర ప్రాంతంలో వరద బీభత్సం కారణంగా 26 మంది ప్రాణాలు కోల్పోయారని, వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయని, ప్రభుత్వ విపత్తు నిర్వహణా సంస్థ ప్రకటించింది. ఈ వరదల్లో దాదాపు 4.1 కోట్ల డాలర్ల విలువైన ఆస్తినష్టం సంభవించినట్లు అంచనా వేస్తున్నామని ఆ సంస్థ ఒక ప్రకటనలో వివరించింది. వరదల కారణంగా కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో రోడ్లకు భారీ నష్టం జరిగిందని, ఈ వరదల్లో గల్లంతయిన 15 మంది కోసం గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ప్రతికూల వాతావరణంతో కొనసాగలేదని వివరించింది. నాలుగు ప్రావిన్స్‌ల్లో సంభవించిన ఈ వరదల కారణంగా నీటి వ్యవస్థలు, వరిసాగు పొలాలు, పండ్ల తోటలు ధ్వంసమయ్యాయని, 200కు పైగా ఇళు పూర్తిగా ధ్వంసం కాగా మరో 400 ఇళ్లు పాక్షిక నష్టానికి గురయ్యాయని ఈ సంస్థ వెల్లడించింది.

## కొలంబియాలో ఐరాస కార్యాలయంపై దాడి

### పోలీసు అధికారికి గాయాలు

**బొగోటా :** కొలంబియాలో ఫార్క్ రెబల్స్ నిరాయుధీకరణ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఐరాస కార్యాలయంపై జరిగిన దాడిలో ఒక పోలీసు అధికారి గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. కొలంబియా నైరుతి ప్రాంతంలో వున్న కొలోటా పట్టణంలోని కాకా విభాగంలో ఫార్క్ రెబల్ గ్రూప్ ఆయుధాలు వుంచిన ప్రదేశంపై దుండగులు దాడి చేశారని పోలీసులు తెలిపారు. ఈ దాడికి మార్క్సిస్ట్ గ్రూప్ రెబల్స్ కానీ లేదా నేషనల్ లిబరేషన్ ఆర్మీ (ఇఎల్ఎన్)కు చెందిన మిలిటెంట్లు కానీ బాధ్యులని భావిస్తున్నట్లు అధికారులు చెప్పారు. అయితే కాకా పోలీసు అధికారి ఎడ్గర్ రోడ్రిగ్జ్ మాత్రం ఈ దాడికి ఇఎల్ఎన్ గ్రూపే కారణమని స్పష్టం చేస్తున్నారు. కొలంబియాలో ప్రస్తుతం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నది ఇఎల్ఎన్ గ్రూప్ ఒక్కటేనన్న విషయం తెలిసిందే. ఈ గ్రూప్ ఒకవైపు ప్రభుత్వంతో పోరాడుతూనే మరోవైపు, శాంతి చర్చల కోసం ప్రయత్నిస్తుండటం విశేషం. ఆదివారం ఉదయం జరిగిన ఈ దాడిలో కొలోటోలోని తమ పరిశీలకులు, నేషనల్ పోలీసు సిబ్బంది, మాజీ ఫార్క్ రెబల్స్ బాధితులుగా మారారని ఐరాస ఒక ప్రకటనలో వివరించింది.

## సైనిక స్థావరంపై దాడిని తిప్పికొట్టిన వెనిజులా

**వెలెన్షియా/కారకాస్ :** వెలెన్షియా నగర సమీపంలోని సైనిక స్థావరం పై దాడికి కొందరు అగంతకులు చేసిన ప్రయత్నాన్ని సైనికులు, స్థానిక పౌరులు తిప్పికొట్టినట్లు వెనిజులా అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో ఇద్దరు అగంతకులను సైనికులు మట్టుపెట్టారని అధికారులు వెల్లడించారు. ఆదివారం వేకువ జామున జరిగిన ఈ దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. సైనిక దుస్తుల్లో వున్న దాదాపు డజను మందికి పైగా దుండగులు ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం తాము ఈ దాడి చేస్తున్నట్లు నినాదాలు చేయటం ఈ వీడియోలో స్పష్టంగా కన్పిస్తోంది. ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో అధ్యక్షుడు మదురో నేతృత్వంలోని వెనిజులా సోషలిస్టు పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆయన దేశాన్ని నియంతపాలన దిశగా నడుపుతున్నారంటూ ప్రతిపక్షం విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే.



## ద.చైనా సముద్రంలో సైనికీకరణ వద్దు

### చైనాకు ఆసియాన్ దేశాల విజ్ఞప్తి

**మనిలా :** దక్షిణ చైనా సముద్ర ప్రాంత విషయంలో చైనాతో ఏర్పడిన వివాదాలను సర్దుబాటు చేసుకునే అంశంపై ఇక్కడ భేటీ అయిన ఆగ్నేయాసియా (ఆసియాన్) దేశాల కూటమి విదేశాంగ మంత్రులు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ ప్రాంతాన్ని సైనికీకరించే ప్రయత్నాలకు, అక్కడ దీవుల నిర్మాణానికి తెరదించాలని వారు చైనాకు విజ్ఞప్తి చేశారు. గత రెండు రోజులుగా ఇక్కడ జరిగిన ఆసియాన్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో చైనాతో సమస్యలను పరిష్కరించుకునే విషయంలో దౌత్యనీతి పాటించాలన్న అభిప్రాయం వ్యక్తమయింది. ఈ నేపథ్యంలోనే వారు దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో చైనా చేపట్టిన రక్షణ స్థావరాల విస్తరణ అంశాన్ని వారు నేరుగా ప్రస్తావించలేదని తెలుస్తోంది. ఆసియాన్ దేశాలు తమ విజ్ఞప్తిలో ప్రస్తావించిన ఏడు పగడపు దీవుల్లో మూడింటిలో రన్‌వేలు, యుద్ధ విమానాలకు అమర్చేందుకు ఉద్దేశించిన మిసైల్ బ్యాటరీలు, రాడార్లు వున్నాయని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.

## అమెరికా యుద్ధ విమాన జాడలు కనుగొన్న ఆస్ట్రేలియా నేవీ



**మెల్బోర్న్ :** శనివారం నాడు గల్లంతయిన అమెరికా నౌకాదళ యుద్ధ విమానం జాడలను తాము కనుగొన్నట్లు ఆస్ట్రేలియా నౌకాదళం ప్రకటించింది. శనివారం నాడు యుద్ధ విన్యాసాలు నిర్వహిస్తున్న సమయంలో రాక్హాంప్టన్ సమీపం లోని షోలార్ జల సంధిలో ఈ ఎంవి-22 తరహా యుద్ధ విమానం సముద్రంలో కూలిపోయింది. తమ నౌకాదళ బృందం ఈ యుద్ధ విమానం జాడలు కనుగొన్నదని సోమవారం నాడు ఆస్ట్రేలియా రక్షణ మంత్రి మారిస్ పెయిన్ చెప్పారు. రాయల్ ఆస్ట్రేలియన్ నావీకి చెందిన ఈతగాళ్ల బృందం అమెరికన్ నౌకాదళ సభ్యులతోకలిసి ఈ విమాన శిధిలాలను వెలికి తీసే ప్రణాళికను ఖరారు చేసినట్లు అమెరికా నౌకాదళ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఈ విమానం నుండి 26 మంది సిబ్బందిని రక్షించామని, ముగ్గురు నావికులు ఈ ప్రమాదంలో మరణించారని ఆయన వివరించారు.

## ఐరోపా వాతావరణానికి అనుకూలంగా అమెరికా యుద్ధ శిక్షణ



**నోవోసెలో శిక్షణా కేంద్రం (బల్గేరియా) :** ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి ఇస్లామిక్ ఉగ్రవాదులను తరిమికొట్టిన అమెరికా సేనలు ఇప్పుడు ప్రచ్ఛన్న కాలం నాటి యుద్ధ విద్యలపై పునశ్చరణ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ప్రస్తుతం వివిధ దేశాల నుండి పొంచి వున్న ముప్పు లను ఎదుర్కొనేందుకు ప్రారంభమైన ఈ పునశ్చరణ కసరత్తులో పాల్గొంటున్న వందలాది యుద్ధ ట్యాం కులు, సాయుధ శకటాలకు ఐరోపా వాతావరణానికి అనుగుణంగా రీపెయింటింగ్ చేస్తున్నారు. ఇరాక్-ఆఫ్ఘనిస్తాన్‌లలో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి స్థావరాల నుండి పోరుకు అలవాటు పడిన సైనికులు ఇప్పుడు అత్యాధునిక నిఘా డ్రోన్‌ల దృష్టిలో పడకుండా తప్పించుకునేందుకు చిన్న చిన్న గ్రూపులుగా విడిపోయి ఆత్మరక్షణ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇరాక్‌లో నదీ లోయ ప్రాంతాలలోనూ, ఆఫ్ఘనిస్తాన్‌లో పర్వత ప్రాంతాలలోనూ వ్యవహరించినట్లుగా ఇక్కడ భూ, గగనతల కార్యకలాపాలు చేపట్టేందుకు అమెరికన్ సేనలకు కష్టసాధ్యమవుతోంది.

ప్రస్తుతం ఐరోపాలో అన్ని దేశాల సరి హద్దుల్లో అమెరికన్ సేనల స్వేచ్ఛా సంచారానికి వెసులు బాటు లభించటం లేదు. గత శుక్రవారం అమెరికన్ ఆయుధ సరఫరా కాన్వాయ్ జర్మనీ నుండి రుమేనియాకు వెళ్తున్న సమయంలో ఆస్ట్రేలియా సరిహద్దు వద్ద అక్కడి సైన్యం నిలిపివేసింది.

## రన్‌వేపై ఢీకొన్న విమానాలు

### తృటిలో తప్పిన ముప్పు

**టొరంటో :** రెండు విమానాలు రన్‌వేపై ఒకదాన్ని ఒకటి ఢీకొన్న ఘటన టొరంటో అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం జరిగింది. రన్‌వేపై బోయింగ్ 787 విమానం టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న సమయంలో కెనడాకు చెందిన ఎయిర్ కెనడా విమానం ల్యాండ్ అయ్యి ముందుకు కదులుతోంది. దీంతో రెండు విమానాలు ఒకదానికి ఒకటి ఎదురుగా వచ్చి వాటి రెక్కలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు విమానాలు భాగా దెబ్బతిన్నప్పటికీ ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని విమానాశ్రయం అధికారులు తెలిపారు. ఒక్కో విమానంలో 200 మంది ప్రయాణికులు ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి

## దేవరపల్లి భూములు దళితులకే

కోసం రెండున్నర నెలలుగా పోరాడుతున్నారు. వారి పోరాటానికి సంఘీభావం తెలిపేందుకు దేవరపల్లి వెళ్లేందుకు సిద్ధపడిన ప్రతిసారీ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధును అరెస్టు చేశారు. ఆ విధంగా ఆయనను నాలుగుసార్లు అరెస్టు చేశారు. ఈ సంఘటనల పరంపరలోనే 15 రోజుల క్రితం రాత్రికి రాత్రి స్థానిక ఎమ్మెల్యే సాంబశివరావు ఆ భూముల్లో 40 పొక్లెయిన్లతో 22 ఎకరాలను చెరువుగా తవ్వేశారు. ఈ తవ్వకాలను వ్యతిరేకించేందుకు దేవరపల్లికి బయలు దేరిన సిపిఎం, వైసిపి, ఇతర పార్టీల నేతలను ఒంగోలులో అరెస్ట్ చేశారు. ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడంతో రాష్ట్రస్థాయిలో ఒక్కసారిగా పెద్ద దుమారం రేగింది. పదిరోజుల క్రితం సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు పర్యటించి..'చెరువును మీరు పూడ్చుతారా? లేక మమ్మల్ని పూడ్చమంటారా? మేము పుడ్చాల్సి వస్తే మిమ్మల్ని రాజకీయంగా పూడ్చడమే' అని తెలుగు దేశం నేతలను హెచ్చరించారు. దేవరపల్లి ఘటనపై మంత్రి నక్కా ఆనంద్‌బాబు సిఎం చంద్రబాబుకు వివరించారు. వెంటనే దళితులకు న్యాయం చేయాలని సిఎం ఆదేశించారు. దీంతో సోమవారం దేవరపల్లి వచ్చిన ఆనంద్‌బాబు దళితుల సమక్షంలోనే భూములు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. ఇది దళితులు ఐక్యంగా పోరాడి సాధించుకున్న ఫలితమని, సిపిఎం పోరాటానికి విజయమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ భూములు అప్పగింత కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు హాజరు కాలేదు.

**దళితుల భూముల నేపథ్యమిదీ..**

40 ఏళ్లుగా దళితులు సాగుచేసుకుంటోన్న 22 ఎకరాలను స్వాధీనం చేసుకొని, తవ్వకాలు జరపాలని స్థానిక నేతలు నిర్ణయించుకున్నారు. అప్పట్లో దళితులు ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ దళితులకు అనుకూలంగా నిర్ణయం వచ్చింది. అప్పటి నుంచీ సాగుకు ఇబ్బందులు రాలేదు. తెలుగుదేశం అధికారంలోకి రాగానే మళ్లీ దళితులకు ఇబ్బందులు వచ్చాయి. స్థానిక తెలుగుదేశం నేతలు ఈ భూముల్లో తవ్వకాలు చేపట్టాలని పావులు కదిపారు. వీరికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్ని విధాలా అండదండలు అందించారు. ఈ భూములను దక్కించుకునేందుకు దళితులు అన్ని పార్టీలను కలిశారు. సిపిఎం వీరికి అండగా నిలిచింది. పోరాటం ఉధృతమవడంతో తెలుగుదేశం నేతలు చేసిన తప్పిదాన్ని గుర్తించి దిద్దుబాటు చర్యకు దిగారు. దాని ఫలితమే సోమవారం నాటి మంత్రి పర్యటన.

## వాస్తవాల దర్పణం 'ప్రజాశక్తి'

అన్నారు. ప్రముఖ రచయిత సింగమనేని నారాయణ మాట్లాడుతూ ప్రతి పత్రికకు ఒక దృక్పథం ఉంటుందని, అందులో 'ప్రజాశక్తి'కి ఒక భిన్నమైన దృక్పథం ఉందని చెప్పారు. కథనాల్లో రాజకీయ కోణం ఉన్నప్పటికీ సామాజిక ప్రయోజనం ఉంటుందని కొనియాడారు. ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజరు ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ తెలుగులో ప్రింట్ అయిన తొలి పత్రిక 'ప్రజాశక్తి' అని తెలిపారు. 1948లోనే తెలుగులో ఈ పత్రిక ప్రింట్ అయిందని గుర్తుచేశారు. ఆ తరువాత విశాలాంధ్రగా, జనశక్తిగా మారి తిరిగి 1970 దశకంలో ప్రజాశక్తి దినపత్రికగా ఆవిర్భవించిందని అన్నారు. ఇప్పటికి 37 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. అటు తమిళనాడులోను, ఇటు కర్నాటకలోని తెలుగు ప్రజలకు చేరువకావాలన్న లక్ష్యంతో వెలువడుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, నగర మేయరు స్వరూప, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్, ప్రముఖ సాహితీవేత్త రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబుళు, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు సి.పెద్దన్న, డిసిసి అధ్యక్షులు కోటా సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రిజ్, బైక్ ఉంటే 'సంక్షేమం' కట్

ఉన్నట్లు తేలితే సంక్షేమ పథకాలు అందవని తాజాగా జరిగిన సాంఘిక ఆర్థిక సర్వేలో కమిటీ స్పష్టం చేసింది. ఇళ్లులేనివారు, పాలిథిన్ కవర్ల గుడిసెల్లో ఉండేవారు, ఎలాంటి ఆదాయం లేనివారికి మాత్రమే రాయితీలు అందనున్నట్లు కమిటీ స్పష్టం చేసింది. పట్టణ ప్రాంతాల్లో ఉండే 59 శాతం మంది సంక్షేమ పథకాలకు అర్హులని కమిటీ స్పష్టం చేసింది.

# పునరావాసంపై సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టులను రాబోయే మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు.

**2019కి పోలవరం పూర్తి**

2018కల్లా గ్రావిటీతో నీరందించాలని, 2019కల్లా పోలవరం పూర్తిస్థాయిలో పూర్తికావాలని సిఎం ఆదేశించారు. అధికారులతో సమీక్షా సమావేశం అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన సభలో సిఎం మాట్లాడారు. పదేళ్ల తర్వాత ఇంజినీరింగ్ విభాగంలో 518 మంది ఎఇలను కొత్తగా నియమించినట్లు తెలిపారు. పోలవరం ఆర్ అండ్ ఆర్, పునరావాసానికి రూ.32 వేల కోట్లు, ప్రాజెక్టుకు రూ.16 వేల కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. ఇప్పటివరకు రూ.12 వేల కోట్లు ఖర్చుపెట్టామన్నారు. రూ.3,500 కోట్లు విలువైన పనులు చేసి కేంద్రానికి బిల్లులు పంపించామని చెప్పారు. రూ.1000 కోట్లు త్వరలో కేంద్రం విడుదల చేయనుందన్నారు. జోరువానలోనే సిఎం తన పర్యటన ముగించుకుని విజయవాడ బయల్దేరి వెళ్లారు.

**పోలవరం నిర్వాసితులను తరలించలేదు**

పోలవరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులైన వారిని గ్రామాల నుంచి బలవంతంగా తరలించలేదని సిఎం చంద్రబాబు చెప్పారు. తొలుత ఆయన తూర్పుగోదావరి జిల్లా పురుషోత్తపట్నంలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించి, పనుల ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు మాదిరిగానే ఆర్అండ్ఆర్, పునరావాసంపైనా సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని ఈనెల 15న ప్రారంభిస్తామన్నారు. బిహెచ్‌ఇఎల్ నుంచి రెండు మోటార్లు రావాల్సి ఉందన్నారు. పురుషోత్తపట్నం ప్రాజెక్టు ద్వారా 1.6 కిలోమీటరు వరకూ 3,500 క్యూసెక్కుల నీటిని తోడుతామన్నారు. అక్కడి నుంచి 50 కిలోమీటర్లు కాలువ ద్వారా నీటిని తీసుకెళ్లి 1,400 క్యూసెక్కుల నీటిని ఏలేరుకు అందిస్తామని చెప్పారు. ఈ పథకం వల్ల 2.15 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తామని, విశాఖకు 10 టిఎంసిల నీటిని అందిస్తామని తెలిపారు. ఏలేరులో నిరంతరం 24 టిఎంసిల నీరు నిల్వ చేస్తామన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో అన్ని ఎకరాలకూ సాగునీరందిస్తామని చెప్పారు. మెట్ట ప్రాంతానికి లిఫ్ట్‌ల ద్వారా నీరు ఇస్తామన్నారు. ఈ సమావేశంలో మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు తదితరులు పాల్గొన్నారు.

**నిర్బంధాల నడుమ సిఎం పర్యటన**

రైతులు, ప్రజల నిర్బందాల నడుమ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా పురుషోత్తపట్నంలో సోమవారం పర్యటించారు. సీతానగరం నుంచి 10 కిలోమీటర్ల పొడవునా భారీగా పోలీసు వలయాన్ని ఏర్పాటు చేసి, సుమారు వెయ్యి మంది పోలీసులను మోహరింపజేశారు. ఆదివారం రాత్రి నుంచే రైతులను ఇళ్లలో నిర్బంధించారు. ఏటిగట్టు గ్రామాల్లో సోమవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ రైతులు, ప్రజలు రోడ్డుపైకి రాకుండా ఆంక్షలు విధించారు. టిడిపికి అనుకూలంగా ఉన్న ఓ రైతును సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు తీసుకెళ్లి సిఎంకు ఓ వినతిపత్రాన్ని టిడిపి నేతలు ఇప్పించారు. తమకు న్యాయం చేయాలని, తాము మీవెంటే ఉంటామంటూ ఆ వినతిపత్రంలో రాయించి టిడిపి నేతలే సిఎం వద్దకు రైతును పంపడాన్ని నిర్వాసిత రైతులు ఖండించారు.

**సిపిఎం నేత అరుణ్ అరెస్టు**

సిఎం పర్యటన సందర్భంగా బాధిత రైతులతో మాట్లాడేందుకు పురుషోత్తపట్నం బయలుదేరిన సిపిఎం నాయకులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. సిపిఎం రాజమహేంద్రవరం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ మూర్తి, రాజులోవను పోలీసులు పురుషోత్తపట్నం వెళ్లకుండా అడ్డుకున్నారు. ఓ పాత్రికేయుని సాయంతో అరుణ్ రామచంద్రపురంలోని రైతుల వద్దకు చేరుకున్నారు. ఇంతలో పోలీసులు ఆయనను చుట్టుముట్టి మీరు ఎవరు? మీ పేరేంటీ? అంటూ ప్రశ్నించారు. తాను ఊరిలోకి వెళ్లాలని అరుణ్ చెప్పినా పట్టించుకోలేదు. ఇంతలో రాజానగరం ఎస్ఐ అక్కడికి చేరుకున్నారు. 'మీరు అరుణ్ అని మాకు తెలుసు, మీరు జీపు ఎక్కండి' అంటూ కోరారు. ఆయన నిరాకరించడంతో పోలీసులు బలవంతంగా జీపు ఎక్కించి రాజానగరం పోలీస్‌స్టేషన్‌కు తరలించేయత్నం చేశారు. రాజానగరం పోలీస్ స్టేషన్‌కు ఎందుకని అరుణ్ ప్రశ్నించడంతో తిరిగి ఆయన్ను సీతానగరం పోలీస్ స్టేషన్‌కు తరలించి సిఎం వెళ్లిపోయిన రెండు గంటల తరువాత విడిచిపెట్టారు.

## 11 లక్షల పాన్ కార్డులు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

'నో యువర్ పాన్' క్లిక్ చేయాలి.

3 అక్కడ మీరు చేయాల్సిన పని. పేరు, పుట్టిన తేదీ, జెండర్, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌ను ఇవ్వాలి.

4 రిజిస్టర్ మొబైల్ నంబరుకు వన్ టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దీన్ని ఎంటర్ చేసి వ్యాలిడేట్ అనే బటన్ క్లిక్ చేస్తే సరిపోతుంది.

5 దీంతో పాన్ చెల్లుబాటులో ఉన్నట్టయితే రిమార్క్ కాలంలో 'యాక్టివ్' అన్న సందేశం వస్తుంది.

**ఎస్ఎంఎస్‌తోనూ..**

ఆదాయపన్ను శాఖ వెబ్‌సైట్ ద్వారానే కాకుండా 567678 లేదా 56161కు ఎస్ఎంఎస్ చేయడం ద్వారా పాన్ అనుసంధానం చేసుకోనే వీలుంది. ఈ ప్రక్రియకు గానూ యుఐడిపాన్ అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి 12 అంకెలు గల మీ ఆధార్ నంబర్ టైప్ చేసి స్పేస్ ఇచ్చి, మీ 10 అంకెల పాన్ నెంబర్ ఎంటర్ చేసి పైన తెలిపిన నెంబర్‌కు ఎస్ఎంఎస్ చేయాలి. దీన్ని నిర్ధారిస్తూ మొబైల్‌కు ఒక సందేశం వస్తుంది. దీంతో కీలకమైన ఆధార్‌తో పాన్ అనుసంధానం ముగుస్తుంది. ఆదాయ పన్ను దాఖలుకు ఆధార్‌తో పాన్‌కార్డు లింక్ తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 31లోపు ఆధార్‌తో లింక్ కానీ పాన్ కార్డులు రద్దవుతాయని ఆదాయ పన్ను శాఖ ఇది వరకే హెచ్చరించింది.

## సిపిఎంపై నిందలు వేయమని చిత్రహింసలు పెట్టారు

రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ పరామర్శించారు. అతడితో కొద్ది సేపు సంభాషించిన అనంతరం బాలకృష్ణన్ మీడియాతో మాట్లాడుతూ విష్ణు చేసిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. తాను 18 ఏళ్ల పాటు సేవలందించిన సంస్థ తన ఆత్మహత్యకు కారణం అంటూ ఆత్మాహుతి లేఖ రాయమని వత్తిడి చేసిందని విష్ణు వారికి వివరించాడు. ఇందుకోసం తనను దాదాపు నెలరోజుల పాటు నిర్బంధించి మానసికంగా చిత్రహింసలకు గురి చేశారన్నాడు. తాను ఆరెస్సెస్ సంస్థలో గత 18 ఏళ్లుగా పనిచేస్తున్నానని, అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆ సంస్థలో తీవ్ర మార్పులు చోటు చేసుకున్నాయని వివరించాడు. ధనరాజ్ హత్య కేసులో నిందితుడైన కన్నన్ జిల్లాలో ప్రచారక్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి తనకు సమస్యలు ఎదురయ్యాయన్నాడు. తనతో పాటు సంస్థలోని మరికొందరు నేతలు, కార్యకర్తలు చెప్పేది వినిపించుకోకుండా తనకు ఎదురులేనట్టు వ్యవహరించేవాడన్నాడు. కన్నన్ గురించి తాను పోలీసులకు సమాచారం అందించినపుడు ఆరెస్సెస్ సంస్థ తనపై ఆగ్రహించిందని విష్ణు చెప్పాడు. గత డిసెంబర్ 15న కొంతమంది ఆరెస్సెస్ కార్యకర్తలు ఒక కారులో తనను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారని చెప్పాడు. తనపై ఏదో జరుగుతోందని తెలుసుకున్నప్పటికీ తాను వారి నుండి బయటపడలేకపోయానన్నాడు. వాహనంలో సీటు వెనుకవైపు చేయి పెట్టినపుడు తనకు ఒక కత్తి కన్పించిందని అతడు వివరించాడు. తనను తిరువనంతపురంలో ఆరెస్సెస్ నేతల వద్దకు తీసుకెళ్లారని, అక్కడ కన్నన్ గురించి పోలీసులకు చెప్పావా? అని వారడిగినపుడు అవునని చెప్పానని వెల్లడించాడు. దీనితో వారు తనను నిర్దాక్షిణ్యంగా దాదాపు నాలుగైదు గంటలసేపు చిత్రహింసలకు గురి చేశారన్నాడు. తనను దాదాపు 86 గంటలసేపు నిద్రకూడా పోనివ్వకుండా చిత్రహింసలు పెట్టారని, తాను కళ్లు మూసుకున్నపుడు మీద నీరు పోసి మరీ తనను కొట్టారని విష్ణు వాపోయాడు. 'నువ్వసలు బతికుండటానికి వీలులేద'ంటూ తనను బెదిరించారన్నాడు. కొంత సమయం తరువాత తనను ఆత్మహత్యా పత్రం రాయాల్సిందిగా వత్తిడి చేశారని, జయరాజన్ తనను మానసికంగా చిత్రహింసలకు గురిచేయటంతో వాటిని భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని రాయమన్నారని చెప్పారు. వారి మనస్తత్వం తెలిసిన తాను దానిని తప్పించుకునేందుకు ప్రయత్నించానని చెప్పాడు. వారుతనను అనేక ఆరెస్సెస్ ఆఫీసులకు ఇళ్లకుతిప్పారని, చివరికి ఒక ప్రాంతంలో తనను ఒంటరిగా వదిలిన సమయంలో తాను వారి నుండి తప్పించుకున్నానని వివరించాడు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో బిజెపి జెండాలను బిజెపి-ఆరెస్సెస్ కార్యకర్తలే ధ్వంసం చేసి దానిని సిపిఎం పైకి నెట్టేవారన్నాడు. కొంత కాలం క్రితం తాను ఇతర ఆరెస్సెస్ కార్యకర్తలతో కలిసి అట్టింగల్ పెంతెకోస్తు చర్చిపై దాడి చేశామని, రంజాన్ సమయంలో ఎద్దులతో వచ్చిన వాహనాలను అడ్డుకున్నామని వివరించాడు. ఎందుకివన్నీ చేస్తున్నామని వారిని అడిగినపుడు వారి నుండి ఎటువంటి స్పందనా లేదన్నాడు. అనేక ప్రాంతాల్లో తాము బిజెపి జెండాలను ధ్వంసం చేసి దానిని సిపిఎంపైకి నెట్టేవారమని, అప్పుడు ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు ఏర్పడేవని చెప్పాడు. అయితే ఆరెస్సెస్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. విష్ణు తమ సంస్థలో కార్యకర్త కూడా కాదని, ఇదంతా సిపిఎం కుట్రేనని ఆ సంస్థ స్పష్టం చేసింది. విష్ణు చేసిన ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు కంట్రోల్ రూమ్ అసిస్టెంట్ కమిషనర్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కిడ్నాపింగ్, చిత్రహింసలు, అసాంఘిక కార్యకలాపాలు, దాడుల అభియోగాలతో కేసును నమోదుచేశారు.

## ఎపి ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్‌కు రూ.1600 కోట్లు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ అండ్ అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్(ఎపిఐఐఎటిపి)కి రూ.1,600 కోట్లు మంజూరుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంపోనెంట్ల వారీగా నిధులు కేటాయించి ఖర్చు చేయనున్నారు.


## బాబు పాలనలో దుర్భిక్షాంధ్ర

- మూడేళ్లుగా సాగు విస్తీర్ణం తగ్గుతోంది
- వైఎస్ఆర్ సిపి రైతు విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

చంద్రబాబు నాయుడు పాలనలో అన్నపూర్ణలాంటి ఆంధ్రప్రదేశ్ దుర్భిక్షాంధ్రగా మారిపోయిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.ఎస్ నాగిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, మూడేళ్లుగా సాగు విస్తీర్ణం రికార్డు స్థాయిలో తగ్గిపోతూ వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మూడేళ్ల కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే ఒక్క ఆలోచన కూడా చేయలేదన్నారు. కేబినెట్లో వ్యవసాయంపై పట్టున్న ఒక్క మంత్రి కూడా లేదని విమర్శించారు. ఎన్నికలపై ఉన్న ధ్యాస రైతులపై లేకుండా పోయిందని, పంటలు ఎండుతున్నా పట్టించుకునే నాధుడే లేడన్నారు. రెయిన్‌గన్‌లతో కరువును జయించానని, కరువు పారిపోయిందని చెప్పిన చంద్రబాబు ఇప్పుడా ఆ రెయిన్ గన్‌లను ఎక్కడ పెట్టారని ప్రశ్నించారు. 2016-17లో ఖరీఫ్, రబీ కలిపి 12 లక్షల హెక్టార్లలో సాగు విస్తీర్ణం తగ్గిందని ప్రభుత్వ లెక్కలు స్పష్టం చేస్తుంటే చంద్రబాబు మాత్రం వ్యవసాయ అనుబంధ రంగాల వద్ధి రేటు 14 శాతంగా ఉందని గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. లేని వృద్ధి రేటును చూపిస్తూ మోసం చేస్తున్నారన్నారు. రుణమాఫీ పేరుతో రైతులను నిండాముంచారని, రాష్ట్రంలో దాదాపు 40 లక్షల రైతుల అకౌంట్లు ఎన్‌పీఏగా మారిపోయాయన్నారు. కనీసం 50 లక్షల మందికి కూడా సంస్థాగత రుణాలు అందని పరిస్థితి నెలకొందన్నారు. నాలుగో ఖరీఫ్ సీజన్ ప్రరంభమైనా ఇంతవరకు మూడో విడత ఇన్‌స్టాల్‌మెంట్ విడుదల కాలేదని అన్నారు. విద్యుత్ మిగులులో ఉన్న రాష్ట్రంలో 7 గంటల విద్యుత్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు.

# 'జై లవకుశ'



ఎన్టీఆర్ త్రిపాత్రాభినయంలో తెరకెక్కుతున్న చిత్రం 'జై లవకుశ'. ఈ మూవీకి బాబి దర్శకుడు. ఎన్టీఆర్ బ్యానర్ పై కళ్యాణ్ రామ్ నిర్మిస్తున్నాడు. నివేథా థామస్, రాశీ ఖన్నా, నందితా నాయికలు. ఈ మూవీలో ఎన్టీఆర్ 'జై', 'లవ', 'కుశ' పాత్రలో నటిస్తున్నాడు. ఇటీవల 'జై' పాత్రకు సంబంధించిన టీజర్ విడుదల చేశారు. తాజాగా రాఖీ పౌర్ణమిని సందర్భంగా రెండో పాత్రయిన 'లవకుమార్'ని పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ విడుదల చేసింది చిత్ర యూనిట్. లవకుమార్‌గా సాఫ్ట్ వేర్ గెటప్‌లో తారక్ చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటున్నాడు. దసరాకి విడుదల కానున్న ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు.

# ప్రతి సినిమాలో ఆయన ప్రస్తావన వుండాల్సిందే

**నితిన్**

**"అందాల రాక్షసి', కృష్ణగాడి ప్రేమగాథ' చిత్రాలు చూశాక దర్శకుడు హను రాఘవపూడి టేకింగ్‌కు ముగ్ధుడిని అయ్యాను. అందుకే ఆయన కథ చెప్పిన వెంటనే అందులో కొత్తదనం, పాత్రలో నూతనత్వం, లవ్‌ట్రాక్‌లో వైవిధ్యం బాగా నచ్చాయని" కథానాయకుడు నితిన్ చెప్పారు. తాజాగా ఆయన నటించిన సినిమా 'లై'. 14 రీల్స్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనిల్ సుంకర నిర్మించారు. ఈనెల 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నితిన్ విలేకరులతో మాట్లాడారు.**

- 'లై' ట్రైలర్, పాటలు బాగున్నాయని పేరు వచ్చింది. అంచనాలు పెరిగాయి. ఖచ్చితంగా చాలా కొత్తగా వుంటుంది. దర్శకుడు హను కథను బాగా తెరకెక్కించారు. హాలీవుడ్ స్థాయిలో వుండాలని ట్రై చేశాం. నటీనటులు, కాస్ట్యూమ్స్‌పరంగా, గెటప్స్ కూడా ఆ స్థాయిలో వుంటాయి. ఇదంతా కేవలం కొత్తదనం కోసం చేసిందే.
- 'లై' అంటే అబద్దాలే. కథాపరంగా చాలా అబద్ధాలు ఆడతాను. హీరోయిన్ మేఘా ఆకాష్‌తో సాగే సన్నివేశాలు నిజాలుకూడా అబద్ధాలుగా చెప్పాల్సివస్తుంది. ఇదంతా చాలా సరదాగా కొత్తగా అనిపిస్తుంది.
- ఇక నాకు అర్జున్ మధ్య వుండే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. హీరో విలన్‌కు మధ్య మైండ్‌గేమ్ చాలా కొత్తగా వుంటుంది. ఇంతకుముందు 'శ్రీఆంజనేయం' ఆయనతో చేశాను. అప్పట్లో ఆయనతో నటించడమంటే భయపడేవాడిని. ఇప్పుడు అలవాటైపోయింది. ఇద్దరం సెట్లో కన్పించినప్పుడుల్లా 'శ్రీఆంజనేయం' అనే పలుకరించుకుంటాం. అప్పటికి ఇప్పటికీ ఆయన ఫిజిక్ అలాగే వుంది. ఆయన అంకితభావంతో పనిచేశారు. ఎడారిలో ఈదురుగాలులు వస్తున్నా... ఆయన దానికి నెరవకుండా యాక్షన్ సీన్లు చేశారు. అంత అంకితభావం వుండబట్టే ఇన్నాళ్ళు ఇండస్ట్రీలో వుండగలిగారు. ఆయన్నుంచి ఇలాంటి విషయాలు చాలా నేర్చుకున్నా.
- 'అ..ఆ' సినిమా తర్వాత రెండు నెలలపాటు ఎటువంటి సినిమా చేయాలో అర్థంకాలేదు. గందరగోళంలో వున్నాను. సాఫ్ట్‌గా వున్న పాత్ర చేశాక.. కొత్తగా ట్రై చేయమని అనిల్‌గారు చెప్పేవారు. అలా ఓసారి ఆయన ఆఫీసుకు వెళితే.. హను ఓ కథ చెప్పారు. అందులో నేను అనుకున్నంత కొత్తదనం కన్పించడంతో వెంటనే అంగీకరించాను.
- కథ ప్రకారం అమెరికా వెళితేనే వినూత్నంగా వుంటుందని భావించి నిర్మాతే చాలా ప్రాంతాలను పర్యటించారు. 'హార్ట్‌ఎటాక్' యూరప్‌లో చేశాను. అందుకే ఈసారి అమెరికాలో చేయాలనుకున్నాం. అమెరికాలో చాలా ప్రాంతాలు ఖర్చుకు వెరవకుండా నిర్మించిన నిర్మాతలకు హ్యాట్సాప్ చెప్పాల్సిందే. నా మార్కెట్‌కు తగినట్లే వారు ఖర్చు పెట్టారు. అక్కడ కాసినోవోలో ఓ సీన్ చేయడానికి 6గంటలకు 25లక్షలు వెచ్చించారు. ఇలా ఫైట్స్ సీన్స్‌కోసం బ్యాంకాంక్ నుంచి ప్రత్యేక ఫైటర్లతో చేయించారు. నేనూ అందుకు తగినవిధంగా తర్ఫీదు తీసుకుని చేశాను. ఈ సినిమా చాలా స్టయిలిష్‌గా వుంటుంది. అదే ప్రేక్షకుడికి నచ్చుతుందని భావిస్తున్నాం.
- కథగా చెప్పాలంటే.. ఆవారాగా వుండేవాడు యు.ఎస్.వెళ్ళి డబ్బున్న అమ్మాయిని పెళ్లిచేసుకుంటే డాలర్లేడాలర్లు అనుకుంటాడు. కానీ అక్కడ అతనికి ఎదురైన ఇబ్బందులే ఈ చిత్ర కథ.
- కెరీర్‌ను విశ్లేషించుకుంటే 'జయం'కు జనాలు నటుడిగా అంగీకరించారు. ఆ తర్వాత కొన్ని తప్పుడు నిర్ణయాలు తీసుకోవడంతో విజయాలు దక్కలేదు. అందుకే కొత్తగా వుండాలని 8ప్యాక్ చేసి సినిమాలు చేశాను. ఆ తర్వాత విజయాలు దక్కాక ఇప్పుడు దాన్ని కాపాడుకోవాలనే భయం వుంటుంది. అందుకే ఏడాది గ్యాప్ తీసుకుని సినిమా చేశా.
- మణిశర్మ నేపథ్య సంగీతం అనగానే.. చాలామంది ఫామ్‌లోనివాడు నీకు అవసరమా! అన్నారు. నేనూ ఒకప్పుడు ఫామ్‌లో లేను. ఎవరినీ తక్కువ అంచనావేయవద్దనేది నా పాలసీ. మణిశర్మగారు లెజెండ్.. కొన్నాళ్ళు విజయాలు దక్కకపోయినా.. ఆయన సంగీత ఘని.. ఈ సినిమాకు చాలా మంచి సంగీతం ఇచ్చారు. పాటలు ఇప్పటికే ప్రజాదరణ పొందాయి. రీరికార్డింగ్ హాలీవుడ్ స్థాయిలో ఇచ్చాడు.
- 'లై'లో పవన్ కళ్యాణ్ కన్పించే సీన్లు లేవు. అయితే ఆయన ప్రభావం నాపై చాలా వుంది. ఇంతకుముందు చాలామంది... తన పేరును వాడుకుంటున్నట్లు మాట్లాడేవారు. ఇప్పుడు ఫానిజాన్ని కమర్షియల్‌గా చూపిస్తున్నాను. నాకు ప్రతి సినిమాలో ఆయన పేరు రావాలని వుంటుంది. దీన్ని ఆయన ఎలా భావిస్తారో తెలీదు.
- నాకు ఏ కష్టం వచ్చినా త్రివిక్రమ్‌గారితో మాట్లాడి సలహాలు తీసుకుంటాను. ఆయన నా గురువు. ఓ జ్ఞాని.
- పూరిగారితో సినిమా అనేది పాత వార్త. దానిగురించి చర్చ అనవసరం.



# రాఖీ ఎందుకు కడతారో తెలుసా?



హీరో నాగచైతన్య 'రారండోయ్ వేడుక చూద్దాం' తర్వాత నటిస్తున్న చిత్రం 'యుద్ధం శరణం' దీనిద్వారా కష్ణ మరిముత్తు దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. లావణ్య త్రిపాఠి నాయికగా నటిస్తుండగా రేవతి, శ్రీకాంత్ కీలకపాత్రలలో కనిపించనున్నారు. రాఖి పౌర్ణిమ సందర్భంగా చిత్రంలోని 'ఎన్నో ఎన్నో భావలే' అనే సాంగ్ లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ పాటలో నాగచైతన్యకు.. తన ఇద్దరు చెల్లెళ్లు రాఖీ కడుతుండగా..'రాఖీ ఎందుకు కడతారో తెలుసా? అక్కాచెల్లి బాధ్యత.. అమ్మానాన్నల తర్వాత అన్నాదమ్ములదేనని ప్రతి నిమిషం గుర్తుచేయడానికి' అని రేవతి చెప్తున్న డైలాగ్ బాగుంది. ఈ చిత్రానికి సంగీతం వివేక్ సాగర్ అందించాడు. శ్రేష్ట రాసిన ఈ పాటను ప్రదీప్ కుమార్ ఆలపించాడు.. వారాహి చలన చిత్రం బ్యానర్‌పై సాయి కొర్రపాటి ఈ మూవీని నిర్మిస్తున్నాడు.



# ప్రభాస్ పెళ్లి గురించి చెల్లెళ్లు....!

ప్రభాస్ పెళ్లి అభిమానుల్లో ఎంతో ఆసక్తిని కలిగిస్తున్న సంగతి విదితమే. అయితే, ప్రభాస్ మాత్రం తన పెళ్లి గురించి ఏమీ చెప్పడం లేదు. 'బాహుబలి-2' తరువాత వివాహం గురించి ఏదో ఒకటి చెబుతానని గతంలో చెప్పాడు. ఈ నేపథ్యంలో రాఖీ పండుగ సందర్భంగా కష్ణంరాజు రెండో కుమార్తె సాయి ప్రకీర్తి మీడియాతో మాట్లాడింది. తాము ముగ్గురు అక్కాచెల్లెళ్లమని, తన అక్క పేరు సాయి ప్రసీద, చెల్లి పేరు సాయి ప్రదీప్తి అని చెప్పింది. ప్రతి రాఖీ పండుగకు అన్నయ్య ప్రభాస్‌కు తాము ముగ్గురమూ రాఖీలు కడతామని చెప్పింది.

ఆ వెంటనే అన్నయ్య ఏదో ఒక గిఫ్ట్ ఇస్తారని చెప్పింది. తామేదడిగినా అన్నయ్య కాదనడని తెలిపింది. అలాంటి అన్నయ్య... పెళ్లి ప్రస్తావన తెస్తే మాత్రం ఏదో ఒకటి చెప్పి దాటవేస్తాడని తెలిపింది. తామేమో అన్నయ్య పెళ్లి ఎప్పుడవుతుందా? అని ఎదురు చూస్తున్నామని చెప్పింది. అన్నయ్య పెళ్లిలో సందడి చేయాలని చూస్తున్నామని, అన్నయ్య పెళ్లి సంగీత్‌లో డాన్స్ వేసేందుకు ఇప్పటి నుంచే ప్లాన్ చేసుకుంటున్నామని తెలిపింది. అన్నయ్య పెళ్లిలో మంచి ఫుడ్ ఁటుందని, అంతా ఎంజాయ్ చేయొచ్చని సాయి ప్రకీర్తి ఊరించింది. అన్నయ్యకి పెళ్లి కుదిరితే తమకంటే సంతోషించేవారు మరొకరుండరని ఆమె తెలిపింది.

# 'ఆనందోబ్రహ్మ' అంటోన్న తాప్సీ



తాప్సీ పన్ను ప్రధాన పాత్రలో తెరకెక్కుతున చిత్రం 'ఆనందోబ్రహ్మ'. మహి వి.రాఘవ్ దర్శకుడు. 70 ఎం.ఎం. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మహి వి.రాఘవ్ మాట్లాడుతూ, హారర్ కామెడీ చిత్రమిది. ప్రతీపాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ రోజు తొలికాపీ సిద్ధం కావడంతో మా బందం ఈ చిత్రాన్ని చూసి ఎంతో సంతోషంగా ఉంది. విజువల్స్ చాలా కొత్తగా, విభిన్నంగా ఉంటాయి. దెయ్యాలు మనుషులకు భయపడితే ఎలా ఉంటుందన్న అంశంతో ఈ చిత్రాన్ని మలిచాం. తాప్సీతో పాటు శ్రీనివాసరెడ్డి, వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్, షకలక శంకర్‌లు తమ తమ పాత్రలలో ఎంతగానో ఒదిగిపోయారు. ఒకరిని మించి మరొకరు బాగా చేయాలని పోటీపడ్డారు. ప్రధానంగా నాలుగు పాత్రల చుట్టూ తిరిగే చిత్రమిది. కె. సంగీతం, అనీష్ కెమెరా పనితనం వంటివన్నీ చిత్రానికి బాగా కుదిరాయి' అని అన్నారు. నిర్మాతలలో ఒకరైన విజయ్ చిల్లా మాట్లాడుతూ, ఈ నెల 18న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకుని వస్తున్నామని చెప్పారు. హారర్ అంశం కంటే కామెడీ అంశం ఈ చిత్రంలో ఎక్కువగా ఉంటుందని అన్నారు.



# రాశేఖర్ సినిమా రానాకు?

రాజశేఖర్ కథానాయకుడిగా తాను 'అహం' అనే సినిమాను చేస్తున్నట్టుగా ఆ మధ్య దర్శకుడు తేజ చెప్పాడు. ఆ తరువాత ఈ సినిమా సెట్స్ పైకి వెళుతున్నట్టుగా కూడా చెప్పుకున్నారు. ఏమైందో తెలియదు కానీ ఈ ప్రాజక్టు పట్టాలెక్కలేదు. ఈ నెల 11వ తేదీన విడుదల కానున్న 'నేనే రాజు నేనే మంత్రి' సినిమా కథ వింటే గతంలో రాజశేఖర్‌తో తేజ చేయాలనుకున్నదేనని అర్థమవుతోందని ఫిలింనగర్‌లో వార్తలు విన్పిస్తున్నాయి. అందుకు కారణంలేకపోలేదు. ఈ చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఇటీవలే డి. సురేశ్ బాబు చెప్పిన మాటలే అందుకు నిదర్శనం. 'బాహుబలి', 'ఘాజీ'లో మంచి పేరు సంపాదించుకున్న రానాతో ఏ సినిమా చేయాలా! అని ఆలోచిస్తుండగా.. తేజ 'అహం' పేరుతో తమకి ఒక కథ వినిపించాడనీ, దానిని 'నేనే రాజు నేనే మంత్రి'గా మార్చామని ఆయన చెప్పారు. ఈ సినిమాను తమిళంలోనూ ఒకేసారి విడుదల చేయాలని ప్లాన్ చేసినా సెన్సార్ వల్ల సాధ్యపడలేదు. అయితే తమిళరాజకీయాలకు ఈ కథ అతికినట్లుంటుందని సురేష్‌బాబు చెప్పారు. ఈనెల 11న తెలుగులో విడుదలకానున్న ఈ చిత్రంపై వారంతా ఆశలతో వున్నారు.

# ఛాంబర్‌ను ప్రశ్నించిన వర్మ!



డ్రగ్స్ వ్యవహారానికి సంబంధించి ఫిలిం ఛాంబర్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు చెందిన ప్రముఖులు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఇటీవలే బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఆ లేఖలో డ్రగ్స్‌ను అరికట్టడానికి ముఖ్యమంత్రి చేస్తున్న కషిని కొనియాడిన సినీ ప్రముఖులు... ఒకరిద్దరి వల్లనే పరిశ్రమకు చెడ్డ పేరు వచ్చిందని తెలిపారు. అప్పటి ఛాంబర్ లేఖపై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ సోమవారంనాడు నిప్పులు చెరిగారు. అప్పటి లేఖద్వారా సినీ పరిశ్రమ నిజంగా సిగ్గుపడుతోందని మండిపడ్డారు. డ్రగ్స్ స్కాండల్ వల్ల పరిశ్రమకు చెడ్డ పేరు రాలేదని... ఫిల్మ్ ఛాంబర్ రాసిన లేఖ వల్లే సినీ పరిశ్రమకు తలవంపులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ బహిరంగ లేఖను రాశారు. దాన్ని ఆయన ఫేస్ బుక్ పేజ్ లో పోస్ట్ చేశారు. 'అసలు వాళ్లు చేసిన నేరమేమిటో, దానికి సంబంధించిన ఆధారాలు ఏమిటో కూడా చెప్పకుండా వాళ్లు అప్పుడే ఏదో మహా నేరం చేసినట్టు కలర్ ఇచ్చిన అధికారులపై ఆగ్రహించాల్సింది పోయి ఆల్రెడీ నేరం రుజువైందనే ధోరణిలో క్షమాపణ లేఖ పంపించడంలో అర్థం ఏమిటని?' ఛాంబర్‌ను ప్రశ్నించారు. కాగా, జరిగి వారం అయినా వర్మ స్పందించారని కొందరంటే.. చాలా ఆలస్యంగా స్పందించారని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

# బాలీవుడ్‌లో 'భాగమతి'



**'బాహుబలి 2' తర్వాత బాలీవుడ్‌లో అనుష్కకు ఆఫర్లు వస్తున్నాయి. ఆమెకు భారీ మొత్తంలో పారితోషికాన్ని ఇస్తున్నా ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది. దాంతో ఆమె తెలుగులో చేస్తోన్న 'భాగమతి' సినిమాపై వారు దష్టి పెట్టారు. ఈ సినిమా హిందీ వెర్షన్ డిజిటల్ హక్కుల కోసం పోటీ పడుతున్నారు. హిందీ వెర్షన్ డిజిటల్ హక్కులకు 12 కోట్లకి పైగా ఆఫర్ చేస్తున్నారని తెలుస్తోంది. పవన్, త్రివిక్రమ్ లేటెస్ట్ మూవీ హిందీ వెర్షన్ డిజిటల్ హక్కులు 11కోట్లకి అమ్ముడైతే, 'భాగమతి' హిందీ వెర్షన్ డిజిటల్ హక్కులు 12 కోట్లకి పైగా పలుకుతుండటం విశేషం.**

# 'ప్రతిక్షణం'



'ప్రతిక్షణం'లో మనీష్‌బాబు, తేజస్విని

శ్రీ భాగ్యలక్ష్మి మూవీ మేకర్స్ పతాకంపై జి.మల్లిఖార్జునరెడ్డి నిర్మించిన చిత్రం 'ప్రతిక్షణం'. నాగేంద్రప్రసాద్ దర్శకుడు. మనీష్‌బాబు, తేజశ్విని హీరోహీరోయిన్లు. ఈనెల 18న విడుదల కానుంది. ప్రీ రిలీజ్ వేడుక సోమవారం హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్స్‌లో జరిగింది. నిర్మాత జి.మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ... సినిమా చూసే ప్రేక్షకులు థ్రిల్ అవుతారు. ఆకట్టుకునే అంశాలున్నాయి. అందరికీ నచ్చే సినిమా అవుతుంది" అన్నారు. రాజ్ కందుకూరి మాట్లాడుతూ... క్యాచీ టైటిల్. క్షణం సినిమా ఎంత పెద్ద హిట్ సాధించిందో ఈ సినిమా అంత కంటే పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నానని అన్నారు. తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ.. పాటలు, ట్రైలర్ చూస్తుంటే నిర్మాత తపన కన్పిస్తోంది. సినిమా మంచి సక్సెస్ అవుతుంది. ఈనెల 18న దాదాపు 80 థియేటర్స్‌లో విడుదల చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాం" అన్నారు.

# 'నాకు మనసున్నది' పాటలు

సుజయ్, తనిష్క్, చంద్రకాంత్, రష్మీ హీరో హీరోయిన్లుగా సోని ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'నాకు మనసున్నది'. సోనిటీమ్ సమర్పణలో సాయి హాసిని ప్రొడక్షన్ పతాకం పై దేవశంకర్ గౌడ్ నిర్మించగా రాజశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రంలోని పాటలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ముఖ్య అతిథిలుగా ప్రతాని రామకష్ణగౌడ్, సాయి వెంకట్, బానుచందర్, కవిత, తుమ్మలపల్లి రామసత్యనారాయణ హాజరయ్యారు. ట్రైలర్‌ను ప్రతాని రామకష్ణ గౌడ్ ఆవిష్కరించగా, సీడీని బానుచందర్ విడుదల చేశారు. "రాజశేఖర్ ఈ సినిమాను చాలా బాగా చిత్రీకరించారనీ, టైటిల్ తగినట్లే నిర్మించారనీ, అందరికీ మంచి విజయం చేకూరాలని అతిథులు ఆకాంక్షించారు.




పాటలవేడుకలో కవిత, భానుచందర్, ఆర్‌కె గౌడ్ తదితరులు

'దెయ్యం మనుషుల్ని ప్రేమించడం కొత్త కాన్సెప్ట్ అని దర్శక నిర్మాతలు పేర్కొన్నారు. త్వరలో చిత్రాన్ని విడుదలచేయనున్నట్లు వెల్లడించారు.






**ఒకప్పుడు వయసు పెరిగేకొద్దీ వెంటాడే కీళ్ల సమస్యలు ప్రస్తుత సమయంలో అన్ని వయసుల వారినీ వేధిస్తున్నాయి. ముఖ్యంగా ఈ కీళ్ల సమస్యలు మహిళలను మరింతగా కుంగదీస్తున్నాయి. కీళ్ల వాతాలు, వెన్ను నొప్పులు, భుజాల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి ఇలా రకరకాల రూపాల్లో ఈ కీళ్ల సమస్యలు వాటి ప్రభావాన్ని చూపిస్తున్నాయి. తగిన వైద్య చికిత్సలు తీసుకుంటే వీటి నుంచి బయటపడే మార్గాలూ అనేకం. అయితే చాలామంది డాక్టర్ దగ్గరకు వెళ్లకుండానే స్వంత వైద్యంతో నొప్పి నివారణ మందులు పరిమితికి మించి తీసుకుంటున్నారు. సమస్యలను తగ్గించకపోగా కొత్త ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఏదో ఒక సందర్భంలో అందర్నీ యాతనలకు గురిచేసే కీళ్ల సమస్యలు, వాటి లక్షణాలు, ఏ చికిత్స తీసుకుంటే వాటి నుంచి బయటపడడానికి వీలవుతుందో ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్' లో...**



# కీళ్ల నొప్పులకు నో చెబుదాం

ఆధునిక జీవన విధానంలో వ్యాయామం లేకపోవడం, తీవ్ర మానసిక ఒత్తిడి, పౌష్టికాహార లోపం వంటి వాటివల్ల ఎక్కువమంది కీళ్ళ వ్యాధులకు గురవుతున్నారు. జనాభాలో నలభైయ్యేళ్ళు వయసు దాటిన వారిలో యాభై శాతం మంది కీళ్ళవ్యాధుల బారిన పడుతున్నారు. మరి కొంతమంది వివిధ కారణాల వల్ల చిన్న వయసు నుంచే కీళ్ల సమస్యతో సతమతమవుతున్నారు. వీటినే ఆర్థరైటిస్ అని వ్యవహరిస్తుంటారు.


**ఆర్థరైటిస్ అంటే?!**

కీళ్లల్లో ఉండే కార్టిలేజ్ (మృదులాస్థి) అనే మెత్తని రబ్బరు పదార్థం అరిగిపోవడం వల్ల ఎముకల మధ్య రాపిడి ఏర్పడి ఇన్‌ఫ్లమేషన్‌కు దారి తీస్తుంది. అధికబరువు, వయసు, ఇన్ఫెక్షన్లు, వంశపారంపర్య కారణాలు, ప్రమాదాలు, రోగనిరోధకశక్తి లోపాల వల్లా కీళ్ళవ్యాధులు వస్తాయి. వీరిలో మోకాళ్లు, మడమ నొప్పులతో బాధపడే వారే ఎక్కువమంది. ఉదయం పూట విపరీతంగా ఉండి సాయంత్రానికి మెల్లగా తగ్గడం లక్షణం. యువతలో 50శాతం మంది కీళ్ళనొప్పులతో బాధపడుతున్నారు. పని ఒత్తిడి, ఊబకాయం, గంటల తరబడి కూర్చోవడం వల్లనే యువత కీళ్ళనొప్పులకు గురవుతున్నారు. పురుషులతో పోల్చుకుంటే మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ముఖ్యంగా ముప్ఫై సంవత్సరాల వయసున్న మహిళల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఆర్థరైటిస్ రావడానికి ఊబకాయం, వంశపారంపర్యమే కాదు సరిగ్గా కాలికి సరిపోని చెప్పులు వేసుకోవడం, ఎత్తుమడమల చెప్పులు ధరించడం కూడా కీళ్ళనొప్పులకు కారణమే. హైహీల్స్, చాలీచాలని షూస్ ధరించడం వల్ల అవి శరీరాకృతిని మార్చడమే కాకుండా మడమలపై తీవ్ర ఒత్తిడి కలిగిస్తాయి. ఈ రకమైన ఒత్తిడి వల్ల కీళ్లనొప్పులు వచ్చే అవకాశం ఉంది.

**కీళ్ల వాతం**

కీళ్ల సమస్యలలో ఎక్కువ మంది తీవ్రంగా బాధపడేది కీళ్ల వాతం వల్ల. ఇది ఒక దీర్ఘకాలికమైన వ్యాధిగానే గుర్తిస్తున్నారు. ప్రపంచంలో అంగవైకల్యం కలిగించే ముఖ్యమైన పది వ్యాధుల్లో కీళ్ల వాతం కూడా ఒకటిగా గుర్తించారు. శరీరంలో వ్యాధి నిరోధక వ్యవస్థ బలహీనపడితే అది ఆరోగ్యకరమైన చీలమండలపై ప్రభావం చూపుతుంది. తద్వార కండరాలు, చీలమండలో వాపు, నొప్పితో పాటు అసౌకర్యానికి దారితీస్తుంది. కీళ్లవాతం వల్ల నొప్పులు తలెత్తినప్పటి నుంచి ఆ భాగంలో మంటతో పాటు నొప్పి వేధిస్తూ ఉంటుంది.

శరీరంలోని మణికట్టు, వేళ్లల్లో ఎముకలు పరస్పరం చీలమండల సాయంతో కలిసి ఉంటాయి. శరీర విడిభాగాలతో అనుసంధానమైన కీళ్లు, చీలమండలం, మణికట్టు చివర్లో మెత్తని కండరాలు రక్షిస్తూ ఉంటాయి. ఈ మెత్తని కండరాలు ఎటువంటి ఇంధనం లేకుండానే సజావుగా సాగిపోతుంటాయి. చీలమండలం లోపలివైపు ఎముక పొరల్లో ఉండే ద్రవం(కార్టిలేజ్) ఎముకల జాయింట్ల ద్వారా సులభంగా కదలడానికి కందెనల్లా ఉపకరిస్తుంది. కీళ్లవాతం వచ్చినప్పుడు శరీరంలోని రోగ నిరోధక శక్తి కణాలు కీళ్లపైనా, చీలమండలంపై దాడి చేయడంతో వాటిని రక్షిస్తున్న ద్రవపదార్థం ఆవిరవుతుంది. దీని ప్రభావంతో కీళ్లు వాచిపోయి, నొప్పులు వస్తాయి. జన్యు కారణాల వల్లా కొంతమందిలో ఈ ఆరోగ్య సమస్య తలెత్తే అవకాశం ఉన్నది. వ్యాధి ప్రారంభంలోనే సరైన మందులతో చికిత్స తీసుకుంటే వ్యాధి నయమవుతుంది. స్టెరాయిడేతర కీళ్లవాత నిరోధక మందులను వాడడం వల్ల కీళ్ల నొప్పులు పరిష్కారమవుతాయి. నిరంతర వైద్య పర్యవేక్షణ ద్వారా తదుపరి నష్టాన్ని నివారించొచ్చు.



**మోకాళ్ల నొప్పి**

మోకాళ్ల నొప్పి కూడా ఎక్కువమంది ఎదుర్కొంటున్న కీళ్ల సమస్యల్లో ఒకటి. సాధారణంగా 40 ఏళ్ళు పైబడిన వారిలో వచ్చే ఈ సమస్య నుంచి తాత్కాలిక ఉపశమనం కోసం వినియోగించే పెయిన్ కిల్లర్లు మరిన్ని వ్యాధులకు కారణం అవుతున్నాయి. డాక్టర్ల సలహా లేకుండా మందుల షాపుల్లో అడిగి కొనుక్కోవడం, వాటిని వినియోగించడం వల్ల దుష్ప్రభావాలు అధికం అవుతున్నాయి. మోకాలి నొప్పి సాధారణంగా సంబంధిత జాయింట్ల కింద ఉన్న ఎముకల్లో పటుత్వం కోల్పోవడం, అరిగిపోవటం లేదా తీవ్ర గాయాలపాలైన సందర్భాల్లో ఎక్కువగా వస్తోంది. దేశ జనాభాలో 15 మిలియన్ల మంది ఈ మోకాలి నొప్పి, ఊబకాయం వల్ల వచ్చే కీళ్ళనొప్పులతోనే బాధపడుతున్నారు. వీటికి తోడు ప్రమాదాల్లో గాయపడటం, స్థూలకాయం జీవనశైలి వంటి వాటినూ ఈ సమస్య తీవ్రమవుతోంది.

**అధునాతన చికిత్స**

మోకాళ్ల నొప్పి తీవ్రమైతే కనీసం కూర్చోలేని, నిలుచోలేని పరిస్థితికి రోగులు చేరుతుంటారు. తాత్కాలిక పెయిన్ కిల్లర్స్ జోలికి పోకుండా వారు 'విస్కో సప్లిమెంటేషన్' పేరిట అందుబాటులోకి వచ్చిన కొత్త చికిత్సా విధానాన్ని పొందడం మేలు. ఈ అధునాతన చికిత్సలో మోకాలి చిప్పలోపలి భాగంలో చెడిపోయిన ఫ్లూయిడ్‌ను మొత్తం తొలగించి తిరిగి అదే విధమైన కొత్త ద్రవాలను ఎక్కిస్తారు. దీనితో పాటు సంకోచ, వ్యాకోచ స్థితిగతులను నిత్యం వైద్యులు పరిశీలిస్తారు. దీనివలన, కొత్తగా ప్రక తి తయారీ ఫ్లూయిడ్స్ జొప్పించిన కారణంగా నొప్పి తగ్గి నడిచేందుకు వీలు ఏర్పడుతుంది. ఇలా ఒకే ఒక్క ఇంజెక్షన్‌తో దాదాపు ఆరు నెలల పాటు నొప్పిని తగ్గించుకునే అవకాశం ఉందని తేలింది. ఇంజెక్షన్ ద్వారా మోకాలి జాయింట్ వద్దకు పంపించే ఈ విధానంలో ఆరు నెలల పాటు చికిత్స పొందాల్సి ఉంటుంది. దీనికితోడు క్రమం తప్పని వ్యాయామం, బరువు నియంత్రణలతో మోకాలి నొప్పులను నియంత్రించుకోవచ్చు.

**మరికొన్ని పరిష్కారాలు**

కీళ్ల సమస్యలు నాలుగు దశల్లో ఉంటాయి. మొదటి దశలో ఉన్నప్పుడే దీనిని గుర్తించగలిగితే చాలా మంచిది. చిన్నపాటి వ్యాయామం, యోగా ద్వారా బరువు తగ్గించుకోవచ్చు. క్యాల్షియం, ప్రోటీన్లు, విటమిన్లు– డి, ఏ, సి ఉన్న పదార్థాలను తీసుకోవడం వల్ల ఈ సమస్య తగ్గించుకోవచ్చు. నొప్పి ముదిరినప్పుడు కొన్నిరకాల మందుల ద్వారా దాన్ని నయం చేస్తారు. అయితే చివరి దశలో ఉన్నప్పుడు మాత్రమే సర్జరీ అవసరం అవుతుంది. సాధారణ జీవనశైలికి అంతరాయం ఏర్పడినప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే కీలుమార్పిడి ఆపరేషన్ చేస్తారు. కీలుమార్పిడి చేయడం వల్ల పదిహేను, ఇరవై సంవత్సరాలపాటు నొప్పులు రావు.

**ఆర్థోస్కోపి చికిత్స**

మోకాలు, భుజం, మోచేయి, మడమ, మణికట్టు, తుంటి సమస్యలకు అత్యంత అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చింది. కీళ్ల నొప్పులతో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లడం, సర్జరీ అంటే భయంతో సమస్యను మరింత తీవ్రం చేసుకునేవారు ఎంతోమంది. అటువంటి వారి సమస్యలకు చక్కని పరిష్కారంగా ఆర్థోస్కోపి సాయంతో చేసే మినిమల్లీ యాక్సెస్ సర్జరీ అందుబాటులోకి వచ్చింది. మోకాలు లేదా మోచేతి లోపలకు చిన్న ట్యూబ్ లాంటి పరికరం ఆర్థోస్కోపిని పంపించి, లోపల ఉన్న కీళ్లను వీడియో కెమెరా సాయంతో టెలివిజన్ మానిటర్‌పై చూస్తూ శస్త్రచికిత్స చేస్తారు.ఎక్స్‌రే, ఎంఆర్ఐ స్కానింగ్‌లో కూడా కనిపించని చిన్న గాయాన్ని కూడా చూస్తూ శస్త్రచికిత్స చేయవచ్చు. ఈ పద్ధతిలో శస్త్రచికిత్స చేయించుకున్న రోగుల్లో ఎక్కువమందిని ఆపరేషన్ చేసిన రోజే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేస్తారు. మోకాలు, భుజం, మడమ, మోచేయి, మణికట్టు సమస్యలకు ఆర్థోస్కోపిక్ మినిమల్లీ యాక్సెస్ సర్జరీ చేయవచ్చు. ఈ సర్జరీ చేయించుకున్న వారికి ఆపరేషన్ మచ్చ కూడా ఉండదు. ఈ పద్ధతిలో మోకాలిలోని లిగ్మెంట్లనూ కూడా రిపేరు చేయవచ్చు. తక్కువ వయసులో వచ్చే మోకాలి నొప్పి సమస్యలకు, మోకాలిలో వదులుగా ఉన్న ఎముకలనూ ఈ చికిత్సతో సరిచేయవచ్చు. 60 ఏళ్ల వయసున్న వారిలో కొందరికి మోకాలికి ఒకవైపు మాత్రమే నొప్పి వస్తుంది. అలాంటప్పుడు మోకాలిలో పాక్షికంగా కీలు మార్పిడి చేయాలి. అత్యంత అధునాతన పద్ధతుల్లో శస్త్రచికిత్స చేస్తారు కాబట్టి కీళ్లమార్పిడి ఆపరేషన్ చేయించుకున్న రోగి ఆ మరునాటి నుంచే నడవవచ్చు. రోగిని నాలుగు రోజులకే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేస్తారు.

**కార్టిలేజ్ పునరుత్పత్తి**

కొందరు రోగుల్లో కొత్త విధానంతో కార్టిలేజ్ పునరుత్పత్తి సాధ్యమవుతుంది. తక్కువ వయసు వారిలో కొద్దిభాగంలో కార్టిలేజ్ దెబ్బతింటే అలాంటి వారికి కార్టిలేజ్‌ను పునరుత్పత్తి చేయవచ్చు. ఆరోగ్యంగా ఉన్న వారి నుంచి కార్టిలేజ్‌ను తీసుకొని కీళ్లలోకి ఎక్కించవచ్చు. చిన్న రంధ్రం చేసి కృత్రిమ కార్టిలేజ్‌ను కూడా రీజనరేట్ చేయడానికి వీలవుతుంది.

## ఇలా చేస్తే కీళ్ల నొప్పి దూరం



కీళ్లనొప్పి సమస్య రాకుండా కొన్ని ముందుజాగ్రత్తలు తీసుకోవాలి.

✧ ప్రతిరోజూ పోషకాహారం తీసుకోవటంతోపాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.

✧ బరువును అదుపులో ఉంచుకోవాలి. ఒక కిలో బరువు తగ్గటం వల్ల మోకాలి కీలుకు నాలుగు కిలోల ఒత్తిడిని తగ్గించేందుకు వీలవుతుంది.

✧ ఆరోగ్యకరమైన తక్కువ కొవ్వు పదార్థాలతో ఉండే ఆహారం తీసుకోవటం అవసరం.

✧ క్యాల్షియం, విటమిన్‌లు, ప్రోటీన్‌లు, ఫైబర్ అధికంగా ఉన్న పాలు, పండ్లు, కూరగాయలు, త ఋధాన్యాలు ఎక్కువగా తీసుకోవటం మేలు.

✧ ప్రతిరోజు 30 నిమిషాల పాటు సైక్లింగ్, స్విమ్మింగ్ చేయటం వల్ల మోకాళ్లతోపాటు శరీరాన్ని దఢంగా ఉంచుకోవచ్చు.

✧ ఎక్కువ దూరం వాకింగ్ చేయడం, జాగింగ్, రన్నింగ్ చేయటం వల్ల మోకాలి నొప్పికి కారణమవుతుంది. అందువల్ల వాకింగ్ చేసేటపుడు ఓ చేతికర్ర ఊతంగా ఎడమ చేతిని వినియోగించటం మేలు.దీనివల్ల మోకాలిపై 60 శాతం ఒత్తిడి తగ్గుతుంది.

✧ కీళ్ల సమస్యలకు పెయిన్ కిల్లర్లు వాడకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

- డాక్టర్ ఎం. నరేంద్రకుమార్,
ఎం.ఎస్. ఎం.సిహెచ్(ఆర్థో),
సన్‌రైజ్ హాస్పిటల్స్- విజయవాడ.






**పొడుపు కథ**

రేయి అయినా.. పగలైనా.. చేత దీపం పట్టుకు తిరిగేది... ఏమిటది ?

**జోక్ :**

టీచర్ : ఏరా రవి..! పెట్రోల్ అయిపోయిన కారు అంగుళం కూడా ముందుకు కదలనప్పుడు ఏం చేస్తావ్ ?

రవి : వెనక్కి పోనిస్తాను సార్..!


టీచర్ : ఆ..!

## చంద్రమండలంపై ధ్వని వినవచ్చా?



**పిల్లలూ..!** ధ్వని ఎలా పుడుతుందో తెలుసా? ధ్వని కంపించే వస్తువుల వల్ల పుడుతుంది. అయితే కంపించే అన్ని వస్తువుల శబ్దాలను మనం వినలేం. మనం వినగలిగిన శబ్దంలను శ్రావ్య ధ్వనులంటారు. శబ్దం యాంత్రిక తరంగం అవటం వల్ల దీని ప్రసారానికి యానకం కావాలి. అంటే ఘన, ద్రవ, వాయు పదార్థాలలో ఏదో ఒకటి ఉన్నప్పుడు మాత్రమే కంపనల వల్ల ధ్వని జనిస్తుంది. శూన్యంలో యానకం ఉండదు కాబట్టి కంపనలు జరగవు. అందువల్ల ధ్వని జనించదు. కాబట్టి శూన్యంలో, చంద్రునిపై శబ్ధవేగం సున్నా, అందుకే మనిషి చంద్రమండలంపై మామూలుగా మాట్లాడటానికి వీలుకాదు. అంతేకాక చప్పట్లు కొట్టినా, తుపాకీ పేల్చినా, బాంబు పేల్చినా వాటి శబ్దాలేవీ మన చెవిని చేరవు. అందుకే చంద్రునిపై ధ్వని వినలేం అంటారు. ★





## గుర్తించి రంగులేయండి!

పిల్లలూ..! పైనున్న చిత్రాల్లో భిన్నమైన వాటిని గుర్తించి, వాటికి రంగులు వేయండి.







# సింధు-4, శ్రీకాంత్-8

## 'ప్రపంచ ఛాంఫ్‌లో టాప్ సీడింగ్స్

**న్యూఢిల్లీ :** గ్లాస్గోలో ఈ నెల 21 నుంచి జరిగే బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఒలింపిక్ రజత పతక విజేత పివి సింధుకు టాప్ సీడింగ్ లభించింది.ప్రతిష్టాత్మకమైన ఈ టోర్నీలో సింధు భారత క్రీడాకారుల్లో టాప్‌సీడ్‌గా ఏ విధంగా రాణిస్తుందన్నది ఆసక్తి కరంగా మారింది. మహిళల కేటగిరిలో సింధు నాలుగో సీడింగ్ లభించడం విశేషం. రియో స్వర్ణ పతక విజేత కరోలినా మారిన్(స్విస్), అకెన్ యమగుచ్చి (జపాన్), సుంగ్ జి హ్యున్(కొరియా)లు టాప్ సీడ్స్‌గా బరిలో దిగుతున్నారు. ఒలింపిక్ కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్ 12వ సీడ్‌గాను పోటీ పడుతోంది. ఈ సీజన్‌లో వరుసగా ఇండోనేషియా, ఆస్ట్రేలియా సూపర్ సిరీస్ టైటిళ్లతో మెరిసిన గుంటూరు కుర్రాడు కిడాంబి శ్రీకాంత్ ఉన్నతంగా ర్యాంకింగ్స్‌లో ఎగబాకాడు.దీంతో పురుషుల విభాగంలో ఎనిమిదో సీడ్‌గా శ్రీకాంత్ సాయి ప్రణీత్(15) అజయ్ జయరామ్ (13)లు బరిలో దిగుతున్నారు. టాప్ సీడ్‌గా కొరియాకు చెందిన సాన్ వాన్ తన సత్తా చాటేందుకు పావులు కదుపుతున్నాడు. భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడి ప్రణయ్ జెర్రీ చొప్రా, సిక్కిరెడ్డి 15 సీడ్‌గా బరిలో దిగుతున్నారు.



## భారత్ నెం:1 బాంబ్రీ

### ఏటిపి ర్యాంకుల్లో 159కు చేరిన వైనం

**న్యూఢిల్లీ :**యువ టెన్నిస్ ఆటగాడు యూకీ బాంబ్రీ భారత్ నెంబర్ వన్ ర్యాంకుకు చేరుకున్నాడు. ఇప్పటి వరకు 179 ర్యాంకుతో రామనాథన్ రామ్‌కుమార్ ఈ స్థానంలో కొనసాగుతున్నాడు. వాషింగ్టన్‌లో జరిగిన సిటి ఓపెన్‌లో అనుహ్య ప్రతిభతో బాంబ్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. మాజీ టాప్ టెన్ టెన్నిస్ ఆటగాడు కెవిన్ అండర్సన్ చేతిలో క్వార్టర్స్‌లో పరాజయం పాలైన విషయం తెల్సిందే. ఈ టోర్నీ ముందు వరకు 200 ర్యాంకులో ఉండే బాంబ్రీ అనుహ్యంగా 41వ స్థానాలు పైకి ఎగబాకాడు.దీంతో 159 ర్యాంకులో భారత్ నెంబర్ -1 సీడ్‌గా అవతరించాడు. బాంబ్రీ, రామనాథన్ రామ్‌కుమార్ ఏటిపి 250 టోర్నమెంట్ ద్వారా ఈ నెల 28 నుంచి జరిగే యూఎస్ ఓపెన్ మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. డబుల్స్ భారత్ స్టార్ సానియా మీర్జా ఉన్నత ర్యాంకులో కొనసాగుతోంది.

## అజహర్‌కు బకాయిల చెల్లింపుపై బిసిసిఐ దృష్టి



**న్యూఢిల్లీ:** భారత మాజీ కెప్టెన్ అజారుద్దీన్‌కు సుదీర్ఘ కాలం క్రితం బకాయి పడిన వేతనాలు, ఎక్స్‌గ్రేషియా తదితర అంశాలపై బిసిసిఐ దృష్టి సారించింది. 2000 సంవత్సరం వరకు అజహర్ భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. 17 ఏళ్ల క్రితం నుంచి అతను ఫెన్షన్, వన్‌టైమ్ ఎక్స్‌గ్రేషియా పేమెంట్ తదితరాలను బిసిసిఐ విత్‌హెల్డ్‌లో పెట్టింది. అజారుద్దీన్‌ను క్రికెట్ నుంచి నిషేధించిన విషయం తెల్సిందే. గత ఐదేళ్ల క్రితం ఆంధ్రా హైకోర్టులో తన బకాయిల చెల్లింపుపై కోర్టును ఆశ్రయించాడు.అతనిపై ఛార్జీ నమోదైన కారణంగా అప్పట్లో చెల్లించాల్సిన బకాయిలు కొన్ని కోట్లకు చేరి ఉంటుందని అంచనా. దీనిపై ఈ నెల 9న జరిగే బిసిసిఐ పాలక మండలి సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## మూడో ప్రయత్నంలో దేవేంద్రకు అర్జున

**న్యూఢిల్లీ:** భారత్‌కు చెందిన అగ్రశేణి ఫ్లై వెయిట్ బాక్సర్ ఎల్ దేవేంద్ర సింగ్ 17 మంది అర్జున అవార్డుల జాబితాలో ఎట్టకేలకు మూడో ప్రయత్నంలో అవార్డుకు ఎంపికవ్వడంపై హర్షం వ్యక్తం చేశాడు. ఉలాన్‌బత్తార్ కప్ జట్టులో ఎంపికైన దేవేంద్ర 2015, 2016ల్లో అతని పేరును అర్జునకు ప్రతిపాదించారు. అయితే తుది జాబితాలో పేరు ఖరారు కాలేదు. తాను అర్జున అవార్డు జాబితాలో పేరు దక్కించుకోకపోవడంలో ఎటువంటి బాధ పడలేదని, ఈ విషయంలో ఎవర్ని నిందించకుండా ఉండాలని కూడా నిర్ణయించుకున్నానని, దేశ అత్యున్నత పురస్కారానికి ఎంపికవ్వడమనేది అరుదైన గౌరవమని తెలిపాడు.

# గాట్లిన్ ఆమెకు స్ఫూర్తి

- దూకి.. స్వర్ణం పట్టేసిన బౌయి





ఫినిషింగ్ లైన్ వద్ద దూకి స్వర్ణం సాధించిన బోయి (ఇన్‌సెట్‌లోవిజయదరహాసం)

**లండన్ :** 100 మీటర్ల పురుషుల పరుగు పందెంలో జమైకన్ స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్‌ను దాటేసి స్వర్ణంతో మెరిసిన జస్టిన్ గాట్లిన్( అమెరికా) స్ఫూర్తితో మహిళా స్ప్రింటర్ బౌయి 100 మీటర్ల పరుగులో అనుహ్యంగా విజేతగా నిలిచింది. బోల్ట్ కాంస్యంతో సరిపెట్టుకున్న విషయం తెల్సిందే. బౌయి 40 మీటర్లు దూరంలో ఉన్న తరుణంలో ముందుకు దూకి రెప్పపాటులో ప్రత్యర్థులకు జలక్ ఇచ్చి దేశానికి 100 మీటర్ల పరుగులో రెండో స్వర్ణం అందించిన ఖ్యాతి గడిచింది. బీజింగ్‌లో 2015, 2016 రియో ఒలింపిక్స్‌లో పాల్గొన్న బౌయి మూడో ప్రయత్నంలో కష్టపడి మొత్తం మీద స్వర్ణంతో కొత్త విజేతగా తన సత్తాను చాటింది. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల మహిళల పరుగులో నాటకీయ పరిణామాల మధ్య అమెరికన్ స్ప్రింటర్ స్వర్ణమయం చేసుకుంది. చివరి మజిలీలో ఒక్క ఉదుటున ఫినిషింగ్ లైన్ వద్ద దూకేసి విజేతగా అవతరించింది. 26 ఏళ్ల బౌయి చివరి 40 మీటర్ల లక్ష్య సాధనలో ఐవరి కోస్ట్ స్ప్రింటర్ మారియి- జోసి తా లౌ వెనక్కి నెట్టేసి స్వర్ణం సాధించింది. ఈ హఠాత్ పరిణామంతో ఫేవరేట్ రేసర్, ఒలింపియన్ ఎలీనా థాంప్సన్ 10.98 సెకన్లతో ఐదో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తొలి వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లో బౌయి స్వర్ణం సాధించడం విశేషం.

## శ్రీశాంత్‌పై నిషేధం ఎత్తివేయండి

### బిసిసిఐను ఆదేశించిన కేరళ హైకోర్టు



**కోచి:** భారత మాజీ పేసర్ శ్రీశాంత్‌కు కేరళ హైకోర్టులో ఊరట లభించింది. అతనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) విధించిన జీవిత కాల నిషేధం ఎత్తివేయాలని కేరళ హైకోర్టు ఆదేశించింది. 2013లో ఇండియన్ ప్రీమియర్ లీగ్-6లో స్పాట్ ఫిక్సింగ్ వ్యవహారంపై బిసిసిఐ జీవిత కాల నిషేధం విధించింది. తనపై నిషేధం ఎత్తివేయాలని శ్రీశాంత్ ఈ ఏడాది మార్చిలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారించిన హైకోర్టుపై అతనిపై జీవితకాల నిషేధం ఎత్తివేయాలని ఆదేశించింది. స్పాట్ ఫిక్సింగ్ కేసుతో సంబంధం ఉందనే ఆరోపణలపై శ్రీశాంత్, అజిత్ చండీమాల్, అంకిత్ చవాన్‌లపై 2013 మే నెలలో ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వారిని తీహార్ జైలుకు తరలించారు. శ్రీశాంత్ బెయిల్‌పై విడుదలైన విషయం తెల్సిందే.

## రేపే ఇరాన్‌తో భారత్ పోరు



### నేటి నుంచి ఫిబా ఆసియా బాస్కెట్‌బాల్ టోర్నీ

**బెంగళూరు:** భారత ఫుట్‌బాల్ టీమ్ ఫిబా ఆసియా కప్‌లో తొలి పోరులో ఇరాన్‌ను ఢీకొననుంది. ఈ నెల 8వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే టోర్నీలో తొలి మ్యాచ్‌లో భారత్- ఇరాన్ జట్ల మధ్య బుధవారం జరగనుంది. అమజ్యోత్ సింగ్ గిల్ సారథ్యంలో 16 మంది సభ్యుల బృందం జైత్రయాత్ర కొనసాగేంచేందుకు పావులు కదుపుతోంది. గ్రూప్-ఎలో ఇండియాతో పాటు ఇరాన్, జోర్డాన్, సిరియాలున్నాయి. ఇందులో టాప్-3 స్థానాల్లో నిలిచిన జట్లు రెండో దశకు చేరుకుంటాయి. చైనా ఈ టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగుతోంది. భారత్ జట్టులో స్టార్ ప్లేయర్ అమృతపాల్ సింగ్ ఏ విధంగా సత్తా చాటుతాడన్నది ఆసక్తి కరంగా మారింది.

## టీమిండియాతో మ్యాచ్‌లు బహిష్కరించండి : జావెద్

**కరాచీ:** ఐసిసి ఈవెంట్లలో భారత్‌తో ఆడే మ్యాచ్‌లను పాక్ బహిష్కరించాలని పాకిస్తాన్ మాజీ క్రికెటర్ జావెద్ మియాందాద్ ఆసక్తి కర వ్యాఖ్యలు చేశాడు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు నిర్వహించలేని వేళ పాక్‌కు భారత్‌తో ఆడాల్సిన అవసరం లేదని ఆయన స్పందించాడు.ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లను నిర్వహించాలని అడుక్కోవడం నిరుపయోగమని అభిప్రాయపడ్డాడు. ఐసిసి ఈవెంట్‌ల్లో భారత్‌తో మేము ఆడకపోతే...అప్పుడు ఐసిసి నష్టపోవాల్సి వస్తుందని తద్వారా ఆర్థిక నష్టాలొస్తాయన్నాడు. దేశ గౌరవాన్ని, ప్రతిష్టను దృష్టిలో ఉంచుకుని చర్చలతో సమయం వృథా కానీయొద్దని బోర్డుకు సూచించాడు.

## త్వరలో 10 కీలకాంశాలతో అమరావతి డిక్లరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



మహిళల సమస్యలను విస్తృత స్థాయిలో చర్చించి, ముసాయిదా ప్రకటనలో తుది మార్పులు చేసి త్వరలోనే అమరావతి డిక్లరేషన్ సిద్ధం చేస్తామని స్పీకర్ కోడెల శివప్రసాదరావు వెల్లడించారు. అమరావతి ప్రకటనపై సోమవారం శాసనసభ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, సామాజిక వేత్తలతో స్పీకర్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివిధ రంగాల ప్రముఖ మహిళలు, వివిధ కళాశాలల విద్యార్థినుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలతో అమరావతి డిక్లరేషన్ ముసాయిదాలో మార్పులు చేశామని తెలిపారు. అన్ని విధాలా మహిళలకు సహాయపడేలా ఈ ప్రకటనను రూపొందిస్తామన్నారు. మహిళలకు విద్య, సామాజిక భద్రత, డిజిటల్ విద్య, న్యాయపరమైన హక్కులు, ఆరోగ్యం - సమతులాహారం, పారిశ్రామిక రంగంలో మహిళలు, పరిశోధన, సామాజికాభివృద్ధి, రాజకీయాల్లో మహిళలు తదితర పది అంశాలతో అందరికీ ఒక బెంచ్ మార్క్‌గా ఉండేలా ఈ ప్రకటనను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఏ ప్రభుత్వం ఉన్నా, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు అంతా అనుసరించేలా మహిళలు శక్తిమంతులుగా తయారయ్యేందుకు ఒక మార్గదర్శిగా అమరావతి ప్రకటన ఉంటుందని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి వద్ద సమావేశం నిర్వహించి, ఆయన సమక్షంలో తుది ప్రకటన పుస్తకాన్ని ఆవిష్కరిస్తామన్నారు.

**చట్టసభల్లోనూ సమానత్వం ఉండాలి : మంత్రి సునీత**

మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ చట్ట సభల్లో యాభై శాతం స్థానాలు పొందిన నాడే మహిళలు సాధించిన అసలైన విజయంగా భావించాల్సి ఉంటుందని తెలిపారు. మహిళా సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీల సభ్యుల భర్తలు కాకుండా ఎన్నికైన ఆయా మహిళా నాయకులే స్వయంగా పదవీ బాధ్యతలు నిర్వహించే స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. సమావేశ అనంతరం రక్షాబంధన్‌ను పురస్కరించుకొని మంత్రి పరిటాల సునీత, మాజీ మంత్రి పీతల సుజాత స్పీకర్ కోడెలకు రాఖీ కట్టారు. రోడ్లు రవాణా, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సుమిత దావ్రా, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి కె. సునీత, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యా రాణి, పలువురు అధికారులు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# భోగాపురంపై బహుపరాక్..!

- కాంట్రాక్టు సంస్థపై రాష్ట్రానికి కేంద్రం నుంచి సూచనలు
- ఎజి అభిప్రాయం కోరిన సర్కార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ప్రభుత్వం తలపెట్టిన భోగాపురం విమానాశ్రయంపై కొత్త సమస్య తెరపైకి వచ్చింది. ఈ నిర్మాణాన్ని చేపట్టాలని భావిస్తున్న సంస్థపై కేంద్రం కొన్ని అనుమానాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆ నిర్మాణ సంస్థను ఇంకా అధికారికంగా ఖరారు చేయనప్పటికీ, దాదాపుగా ఒక సంస్థను డెవలపర్‌గా గుర్తించినట్లు ప్రచారం సాగుతోంది. ఈ సంస్థ గతంలో వివిధ రాష్ట్రాల్లో నిర్మించిన పలు ప్రాజెక్టులపై విమర్శలు వస్తున్నట్లు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం, ఆ విషయాన్ని రాష్ట్రానికి వివరించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం పంపించిన హెచ్చరిక సూచనలను అడ్వకేట్ జనరల్‌కు పంపారని సమాచారం.

విశాఖపట్నంలో ప్రస్తుతం ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయం స్థానే విజయనగరం జిల్లాలోని భోగాపురంలో కొత్త విమానాశ్రయాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్రం కూడా ఈ విమానాశ్రయ నిర్మాణానికి సానుకూలంగా స్పందించి, నిధులు కేటాయించేందుకు ముందుకొచ్చింది. మొత్తం నిర్మాణానికి రూ.2260 కోట్లవుతుందని అంచనా వేశారు. ఇందులో కొంత హడ్కో ద్వారా కేంద్రం ఇవ్వనుండగా, మరికొంత మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ఈ నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించి, వాటిని పరిశీలించి ఒక సంస్థను ప్రాథమికంగా ఎంపిక చేశారు. త్వరలోనే ఈ సంస్థకు అవార్డు ప్రకటించాలని కూడా నిర్ణయించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ కీలక కసరత్తు పూర్తి కావస్తున్న తరుణంలో కేంద్రం నుంచి హెచ్చరిక సూచనలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం అవాక్కయింది. పలు రాష్ట్రాల్లో ఆ సంస్థ చేపట్టన పనుల్లో కొన్ని సక్రమంగా లేవని, అవి విఫలమయ్యాయనే సమాచారం ఉందని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రం రాష్ట్ర యంత్రాంగానికి సూచించినట్లు తెలిసింది. ఆ సంస్థకు పనులు అప్పగించే దిశగా నిర్ణయానికి తుది కరసత్తు సాగుతున్నందున, ఇప్పుడేం చేయాలనే అభిప్రాయాన్ని అడ్వకేట్ జనరల్ ను కోరారని తెలుస్తోంది. ప్రభుత్వం మాత్రం ఆ సంస్థకే పనులు కట్టబెడుతూ అవార్డు ప్రకటించాలని భావిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ భావనకు అనుగుణంగానే అడ్వకేట్ జనరల్ నుంచి సిఫార్సులు వస్తాయా? లేకుంటే ఆ సంస్థకు పనులు ఇవ్వవద్దని సూచిస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

## టిడిపి హయాంలో మహిళల కంట కన్నీరు

### పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు మిన్నంటాయని, దీనివల్ల మహిళలు కన్నీరు కార్చుతున్నారని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి అన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధరల స్థిరీకరణ నిధుల కోసం రూ. 2 వేల కోట్లు బడ్జెట్‌లో పెడతామని టిడిపి, బిజెపి ఎన్నికల్లో హామీ ఇచ్చాయన్నారు. కానీ పరిస్థితి ఆ విధంగా లేదన్నారు. ప్రస్తుతం టమోటా, ఉల్లిపాయల ధర ఆపిల్ పళ్ల ధర కన్నా అధికంగా ఉన్నాయన్నారు. మహిళల పరిస్థితి ఎంత బాధాకరంగా ఉందో ప్రభుత్వానికి తెలియజెప్పేందుకు రాఖీలతో నిరసన కార్యక్రమాన్ని మహిళా కాంగ్రెస్ చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, ఉపాధ్యక్షురాలు కుర్షిదా, ఇందిర, మీసాల రాజేశ్వరరావు, రాజీవ్ రతన్, ఎన్ నరసింహరావు, కొలనుకొండ శివాజి తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వండి**

సిపిఎం,సిపిఐ, జనసేన నేతలకు రఘువీరా లేఖలుఈ నెల 23న జరిగే నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న అబ్దుల్ ఖాదర్ విజయానికి సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీలు సంపూర్ణ సహకారం, మద్దతు ఇవ్వాలని రఘువీరారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి మధు, కె రామకృష్ణ, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌కు లేఖ రాశారు.

## అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు

### కేరళ తరహాలో జరిమానాలు

### ఆకస్మిక తనిఖీలో మంత్రి పుల్లారావు వెల్లడి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హోటళ్ళు, సినిమా థియేటర్లు, మాల్స్‌ల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు ఆహార పదార్థాలు, శీతల పానీయాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. సచివాలయంకు దగ్గరలో ఉన్న విస్కేర్ రెస్టారెంట్‌ను తూనికలు, కొలతల శాఖ అధికారులతో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులకు కనిపించే విధంగా ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆహార పదార్థాలు, శీతలపానీయాలు అధిక ధరలకు విక్రయించడం పట్ల ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తనిఖీల్లో భాగంగా రూ.12ల సోడాను రూ.35లకు విక్రయిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మాల్స్, ఇతర దుకాణాల్లో ఏ వస్తువులైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే 1100 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. నకిలీ, కల్తీ విత్తనాలతో వినియోగదారుల్ని మోసం చేయడానికి ప్రయత్నించే ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. కేరళ రాష్ట్రం తరహాలో జరిమానాలను రూ.5వేల నుంచి 25వేలకు పెంచే అంశం పరిశీలనలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ ఛైర్మెన్ ఎం.లింగారెడ్డి, రీజనల్ డిప్యూటీ కంట్రోలర్ రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌పై కేసు నమోదు చేయాలి

### ఎపిసిఎస్‌సి ఛైర్మెన్ లింగారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంద్యాల సభలో సిఎం చంద్రబాబుపై ప్రతిపక్ష నేత జగన్ చేసిన వ్యాఖ్యల్ని సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల సంస్థ ఛైర్మెన్ ఎం.లింగారెడ్డి డిమాండ్ చేశారు. ఉగ్ర వాదులు, జగన్ మాటలకు పెద్ద తేడా లేదన్నారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిబంధనలు, సాంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న జగన్ పార్టీ గుర్తింపు రద్దు చేయాలన్నారు. సెక్షన్ 121 ప్రకారం రాజ్యంపై దాడి, 124(ఎ) ప్రకారం రాజద్రోహం, 120(బి) ప్రకారం కుట్ర కేసుల్నిజగన్‌పైనమోదు చేయాలన్నారు.

## 18న విజయవాడలో కృష్ణా బోర్డు సమావేశం

### కృష్ణా ప్రాజెక్టుల నుంచి అదనపు నీరు కావాలంటున్న తెలంగాణా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణా బోర్డు సమావేశం ఈ నెల 18న విజయవాడలో జరుగనుంది. విభజన చట్టం ప్రకారం ఏర్పడిన కృష్ణా బోర్డు సమావేశాలన్నీ ఇప్పటి వరకు హైదరాబాద్‌లోనే జరిగాయి. బోర్డు కార్యాలయం కూడా హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేశారు. అయితే బోర్డు సమావేశాన్ని తమ రాష్ట్రంలో కూడా నిర్వహించాలని ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది. దీనికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అంగీకారం తెలిపింది. దీంతో ఈ నెల 18న విజయవాడలో కృష్ణా బోర్డు సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. తెలుగు రాష్ట్రాలకు తాగు, సాగు నీరందించే శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు ఇప్పటికీ నీరు చేరక పోవడంతో తాగు నీటి అవసరాల కోసం కర్నాటక నుంచి నీరు విడుదల చేయాలని ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాలు కృష్ణా బోర్డును కోరనున్నాయి. మరోవైపు కర్నాటక ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయకపోతే ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని రెండు రాష్ట్రాల్లో తాగునీటి అవసరాల కోసం వినియోగించుకోవాల్సి ఉంది. ఇటు కృష్ణా నది ఎగువ ప్రాంతంలో వర్షాలు పడితే నారాయణపూర్ నుంచి నీరు విడుదల చేస్తే శ్రీశైలం ప్రాజెక్టుకు నీరొచ్చే అవకాశం ఉంది. బోర్డు సమావేశం లోగా నీరొస్తే అప్పటి పరిస్థితిని సమీక్షించి రెండు రాష్ట్రాలకూ నీటి కేటాయింపులు చేసే అవకాశాన్ని బోర్డు పరిశీలిస్తుంది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా బ్యారేజీకి గోదావరి నీరు తరలి వస్తున్నందున కృష్ణా ప్రాజెక్టుల నుంచి తమకు అదనపు నీటి వాటా కావాలని తెలంగాణ కోరుతున్న సంగతి తెలిసిందే. రెండు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల వద్ద ఏర్పాటు చేస్తున్న టెలిమెట్రీలు, బోర్డు నిర్వహణ, ప్రాజెక్టుల పరిధి వంటి అంశాలపై కూడాఈ సమావేశంలోచర్చ జరిగేఅవకాశం ఉంది.

ప్రజాశక్తి
అగస్టు 1 నుండి 10 వరకు జరిగే
ప్రజాశక్తి కాంపెయిన్ సందర్భంగా
ప్రత్యేక రాయితీలు
సంవత్సర చందా రూ. 1350/-
6 నెలల చందా రూ. 700/-
టీ స్టాల్స్, బార్బర్ షాపులకు సంవత్సర చందా రూ. 700/-
వివరాలకు సంప్రదించండి:
అడ్రసు:- ప్రజాశక్తి తెలుగు డైలీ,
డోర్ నెం. 27-30-4,
ఆకులవారి వీధి, గవర్నర్‌పేట,
విజయవాడ-520002,
ఫోన్ నెం. 9490099275.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68